Estd 1938

ఆంధ్రప్రభ

www prabhanews com
Journalism first!

సంపుటి: 56 • సంచిక: 117 • సోమవారం 7 ఆగస్టు 2017 • హైదరాబాద్ ✻ పేజీలు: 10+12 • వెల: 5.00 Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad

ముహూర్తం | శ్రీ హేవళంబినామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, తిథి: పూర్ణిమ రా. 11.00 వరకు; నక్షత్రం: శ్రవణం తె. 3.58 వరకు, అనంతరం ధనిష్ఠ; అమృతకాలం: సా. 4.55 నుండి 6.35 వరకు; వర్జ్యం: ఉ. 6.33 నుండి 8.16 వరకు; దుర్ముహూర్తం: మ. 12.31 నుండి 1.31 వరకు, తదుపరి మ. 3.04 నుండి 3.55 వరకు; రాహుకాలం: ఉ. 7.30 నుండి 9.00 వరకు; యమగండం: ఉ. 10.30 నుండి 12.00 వరకు

ప్రధాని వద్దకెళ్దాం!


పోరాడదాం..రాజీపడే ప్రసక్తే లేదు!

- ప్రజోపయోగ ప్రాజెక్టులపై పన్నులు న్యాయం కాదు
- ప్రధాని మోడీకి వివరించి, ఒప్పించే ప్రయత్నం చేద్దాం
- జీఎస్టీతో కలిగే నష్టమెంతో నివేదిక సిద్ధం చేయండి
- ఖజానాకు భారంపడే అంశాలన్నీ క్రోడీకరించండి
- అధికారులకు కేసీఆర్ ఆదేశం
- రెండ్రోజుల్లో ప్రధానికి లేఖ
- ప్రగతి భవన్‌లో ఉన్నత సమీక్ష



హైదరాబాద్, ఆంధ్రప్రభ: వేలాది మంది ప్రాణత్యాగాలతో కష్ట, నష్టాలకు ఓడ్చి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రానికి ఏ కోణంలో అన్యాయం జరిగినా వదిలిపెట్టే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు స్పష్టం చేశారు. అది కేంద్ర ప్రభుత్వమైనా... ఇంకేదైనా నా విధానం మాత్రం ఒక్కటేనని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు భంగం వాటిల్లినా, ప్రయోజనాలు దెబ్బతిన్నా ఎక్కడా రాజీపడేందుకు అవకాశమే ఉండదని తేల్చిచెప్పారు. కేంద్రం అమలు చేస్తున్న జీఎస్టీ విధానం ద్వారా తెలంగాణాలో ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులకు జరిగే నష్టాన్ని ఉపేక్షించబోనన్నారు. వాస్తవాలను ప్రధాని నరేంద్రమోడీ దృష్టికి తీసుకువెళ్తానని, ఆర్థిక భారాన్ని తొలగించేందుకు అవసరమైన పరిష్కారం కోసం పోరాడుతానని వ్యాఖ్యానించారు. ఈ అంశంపై ఆదివారం ప్రగతి భవన్‌లో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా, అభివృద్ధి, సంక్షేమ పథకాల వారీగా జీఎస్టీ పన్ను భారంపై చర్చించి వివరాలను తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ మాట్లాడుతూ, తెలంగాణలో వివిధ దశల్లో ఉన్న అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించి జీఎస్టీ భారంపై తక్షణమే సమగ్ర నివేదికలు తనకు అందించాలని అధికారులను ఆదేశించారు. స్పష్టమైన సమాచారంతో ప్రధానికి లేఖ రాసి, అక్కడి నుంచి వచ్చే స్పందనను బట్టి తదుపరి కార్యాచరణకు వెళ్దామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఖజానాపై పడే భారాన్ని స్పష్టంగా క్రోడీకరిస్తూ ఒక రిపోర్టును తయారు చేయాలని ➪ 3వ పేజీలో...



ఇండియాదే సిరీస్


- శ్రీలంకపై రెండో టెస్టులోనూ ఇన్నింగ్స్, 53 పరుగుల తేడాతో ఘన విజయం

విరాట్ కోహ్లీసేన అప్రతిహత జైత్రయాత్రను కొనసాగిస్తోంది. పాత రికార్డులను చెరిపేస్తూ మరో అద్వితీయ సిరీస్‌ను సాధించింది. శ్రీలంకను వారి గడ్డమీదనే రెండోటెస్టులో ఇన్నింగ్స్ 53 పరుగుల తేడాతో ఓడించడం ద్వారా 2-0 తేడాతో వరుసగా ఎనిమిదవ సిరీస్ విజయాన్ని అందుకున్నారు. ఈ టెస్టులో ఇండియా ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఐదురోజుల టెస్టు కాస్తా..మూడోరోజులకే ముగిసిపోయింది. అటు బ్యాటింగ్‌లో 600 పైగా స్కోరు చేయడమే కాకుండా ఇటు బౌలింగ్‌లోనూ రెండుసార్లు లంకను ఆలౌట్ చేసి తన సత్తా చాటింది. జడేజా అద్భుతంగా రాణించాడు. అటు బ్యాటింగ్‌లో అర్ధసెంచరీ ఇటు బౌలింగ్‌లో మొత్తం 7 వికెట్లు కూల్చి "ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్" గెలుచుకున్నాడు. మూడో టెస్టును గెలుచుకుని వైట్‌వాష్ చేయడం ద్వారా టీమిండియా సరికొత్త చరిత్ర సృష్టించాలని ఉవ్విళూరుతోంది.

వివరాలు స్పోర్ట్స్‌లో...

- 24 ఏళ్లకు న్యాయం


మహిళకు క్షమాపణ



చెన్నై: రెండు దశాబ్దాల పైబడి చేస్తున్న న్యాయపోరాటం ఫలించింది. ఈ సందర్భంగా బాధిత మహిళకు మద్రాస్ హైకోర్టు క్షమాపణలు చెప్పింది. తీర్పు కోసం ఓ మహిళను 24 ఏళ్లుగా వేచిచూసేలా చేసినందుకు చింతుస్తున్నామని కోర్టు వ్యాఖ్యానించింది. 1993లో మరణించిన తన కుమారుడి పరిహారం కోసం అప్పటి నుంచి ఆమె అలుపెరుగని న్యాయ పోరాటం చేస్తోంది. చివరికి న్యాయమే గెలిచింది. లారీకి ఇన్సూరెన్స్ ఇచ్చిన కంపెనీ పరిహారం చెల్లించి తీరాల్సిందేనని మద్రాస్ హైకోర్టు జడ్జి జస్టిస్ ఎన్. శేషసాయి తీర్పు వెల్లడించారు. తమిళనాడుకు చెందిన బక్కియం కుమారుడు లోకేశ్వరన్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వీళ్లకి సొంత ➪ 3వ పేజీలో...

- సిమ్లా హైకోర్టు నిబంధనలు

జీన్స్‌కు నో ఎంట్రీ



న్యూఢిల్లీ: కక్షిదారులు మర్యాద పాటించాలని హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు ఆదేశించింది. విచారణకు హాజరయ్యే అధికారులకు డ్రెస్ కోడ్‌ను నిర్దేశించింది. కక్షిదారులు తగిన దుస్తులను ధరించి కోర్టుకు హాజరైనపుడు మాత్రమే వారికి తమ లక్ష్యంపై శ్రద్ధ ఉన్నట్లు వెల్లడవుతుందని పేర్కొంది. న్యాయ పరిపాలనకు మర్యాద భావన అత్యధికంగా దోహదపడుతుందని తెలిపింది. జస్టిస్ తర్లోక్ సింగ్ చౌహాన్, జస్టిస్ అజయ్ మోహన్ గోయెల్ డివిజన్ బెంచ్ ఈ ఆదేశాలు జారీ చేసింది. ఈ మార్గదర్శకాలను ప్రభుత్వోద్యోగులందరికీ తెలియజేయాలని ఆరాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి తెలిపింది. ఈ ఆదేశాలను ఉల్లంఘిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

ఇండో- చైనా యుద్ధం తప్పదా?

- అది చైనా-అమెరికా యుద్ధం

8

శత్రుదేశమూ ఇలా చేయదు





రెండు జిల్లాల పేర్లు మార్పు

- వరంగల్, హన్మకొండలుగా ఏర్పాటు
- ముఖ్యమంత్రి కేసీఆర్ కసరత్తు
- జిల్లాల పరిధి, ప్రాంతాల మార్పు
- త్వరలో అధికారిక ఉత్తర్వులు జారీ
- మళ్లీ తెరపైకి కొత్త జిల్లాల ఆందోళన

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కొత్త జిల్లాలలో స్వల్పమార్పులు చేపట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం సమాయత్తమవుతోంది. వరంగల్ అర్బన్, రూరల్ జిల్లాలలో మార్పులు, చేర్పులు చేయడంతో పాటు జిల్లాల పేర్లను కూడా మార్చాలన్న ప్రతిపాదనపై ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు కసరత్తు చేస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. గతేడాది విజయ దశమి రోజున రాష్ట్రంలో కొత్త జిల్లాలను ఏర్పాటు చేసిన సంగతి విదితమే. గతంలో పది జిల్లాలున్న రాష్ట్రంలో మరో 21 జిల్లాలను చేర్చడం ద్వారా ఈ సంఖ్య 31కి చేరింది. వరంగల్ రూరల్, అర్బన్ జిల్లాల స్థానంలో వరంగల్, హన్మకొండ ➪ 3వ పేజీలో...



వెంకయ్యాజీ కంగ్రాట్స్

- ఉపరాష్ట్రపతికి మంత్రి కేటీఆర్ శుభాకాంక్షలు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: కొత్త ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడును తెలంగాణ రాష్ట్ర మంత్రి కే.టీ. రామారావు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో పాల్గొనేందుకు శుక్రవారమే ఢిల్లీ వచ్చిన కేటీఆర్, ఆదివారం ఉదయం వెంకయ్య నాయుడును ఆయన నివాసంలో కలుసుకున్నారు. శనివారం జరిగిన ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో వెంకయ్య నాయుడు ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. తెలుగు తేజం వెంకయ్య నాయుడు రాజ్యాంగ పదవిని అధిరోహిస్తున్న నేపథ్యంలో ఆయనకు పార్టీలకతీతంగా అభినందనలు తెలుపు తున్నారు. ఈ క్రమంలో కేటీఆర్ మర్యాదపూర్వకంగా భేటీ అయి అభినందించారు.

గొర్రెను కాపాడబోయి...

- లారీని ఢీకొన్న ఆటో • ఆరుగురు దుర్మరణం
- ఐదుగురికి తీవ్రగాయాలు... పరిస్థితి విషమం
- ప్రాణాలతో బయటపడ్డ ఇద్దరు చిన్నారులు
- మహబూబ్‌నగర్ జిల్లా మక్తల్ వద్ద ప్రమాదం



మక్తల్, కెఎన్ఎన్: మహబూబ్‌నగర్ జిల్లా మక్తల్ మండలం కాచ్‌వార్ వద్ద ఆదివారం సాయంత్రం ఘోరరోడ్డు ప్రమాదం జరిగింది. మక్తల్ సంత నుంచి మహబూబ్‌నగర్ హైవేపై వస్తున్న ఆటో కాచ్‌వార్ వద్ద రహదారిపై ఉన్న గొర్రెను తప్పించబోయి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందగా.. మరో ముగ్గురు చికిత్స పొందుతూ మృతి చెందారు.. మృతులు మక్తల్, ఊట్కూర్ మండలాలకు చెందిన వారుగా గుర్తించారు. ఆటోలో మొత్తం 11మంది ప్రయాణిస్తున్నట్లు తెలుస్తుండగా.. వీరిలో రెండేళ్లలోపు వయస్సుగల ఇద్దరు చిన్నారులు చంద్రకళ, నిఖిత ప్రాణాలతో బయటపడ్డారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు, ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. ఆదివారం సంత పూర్తి చేసుకుని ఆటోలో మక్తల్ మండలం జక్లేర్, మాదన్ పల్లి, ఊట్కూర్ మండలం పులిమామిడికి చెందిన వ్యక్తులు ➪ 3వ పేజీలో...

జోరా..!



నల్లధనం ఇక వెనక్కి!

- తొలగిన అడ్డంకులు
- అయితే రెండేళ్లాగాలి
- సమాచారం ఇస్తామన్న స్విట్జర్లాండ్ ప్రభుత్వం
- త్వరలోనే పటిష్ట వ్యవస్థ



న్యూఢిల్లీ/బెర్న్: నల్ల ధనాన్ని వెనక్కు తెస్తానన్న ప్రధాని మోడీకి అధికారంలోకి వచ్చిన మూడేళ్ల తరువాత ఒక అవకాశం వచ్చింది. భారతీయులు ఎక్కువగా తమ నల్లధనాన్ని దాచుకుంటారని భావిస్తున్న స్విట్జర్లాండ్ తమ దేశంలో దబ్బుదాచుకున్న భారతీయుల సమాచారం ఇవ్వడానికి అంగీకరించింది. ఇరు దేశాల మధ్య సమాచారం ఇచ్చిపుచ్చుకోవడానికి భారత్‌లోని చట్టాలు సరిపోతాయని ఇప్పటికి విశ్వసించింది. భారతదేశంలో సమాచార భద్రత, గోప్యతకు సంబంధించిన చట్టాలు ఇప్పుడు తగినంతగా ఉన్నాయని ఆ దేశం విశ్వసిస్తోందని స్విస్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా భారత్‌తో సమాచారం ఇచ్చి పుచ్చుకోవడానికి అవసరమైన నిబంధనలను అధికార గెజిట్‌లో పొందుపరిచింది. దీంతో భారతీయులు స్విస్ బ్యాంకుల్లో దాచుకున్న డబ్బుకు సంబంధించిన సమాచారాన్ని భారత్‌తో ఆ దేశం ఆటోమేటిగ్గా ➪ 2వ పేజీలో...



2

రూ. 300 కోట్ల లెక్క తేలాలి!

దీనావస్థలో చేనేత పరిశ్రమ



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలో చేనేత పరిశ్రమ చాలా దీనావస్థలో ఉందని సినీనటి సమంత ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లో విలేకరులతో సమంత మాట్లాడుతూ చేనేత పరిశ్రమను ఆదుకునేందుకు తన వంతుగా ప్రచారకర్తగా వ్యవహరిస్తున్నానని తెలిపారు. నేతన్నలకు అండగా నిలిచేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సోమవారం జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ ఓవన్ పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అక్కడ 30మంది చేనేత కార్మికులను సత్కరించనున్నట్లు తెలిపారు. భారతీయ సంస్కృతిలో భాగమైన చేనేత పరిశ్రమను కాపాడుకోవాల్సిన అవశ్యకత అందరిపైనా ఉందన్నారు.

సీడబ్ల్యూసీ సభ్యుడిగా రాంచంద్ర కుంతియా



హైదరాబాద్,ఆంధ్రప్రభ: కాంగ్రెస్ పార్టీలో అత్యున్నత పదవిగా భావించే సీడబ్ల్యూసీ సభ్యుడిగా రాంచంద్ర కుంతియాకు పార్టీ అధిష్టానం చోటు కల్పించింది. ఈ నెల 8న జరిగే సీడబ్ల్యూసీ సమావేశానికి హాజరు కావాలని కూడా అధిష్టానం కోరింది. కాగా పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జిగా కుంతియాను ఇటీవలనే నియమించిన విషయం తెలిసిందే. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా ఉన్నవారికి సీడబ్ల్యూసీలో చోటు కల్పిస్తారు. ఇంకా పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమించినప్పటికీ.. ఆయనకు సీడబ్ల్యూసీలో అవకాశం ఇవ్వడంతో త్వరలోనే ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమించే అవకాశాలు ఉన్నాయని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. భవిష్యత్‌లో తెలంగాణలోని పార్టీకి దీర్ఘకాల ఇన్‌ఛార్జిగా ఉండే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు.

రూ.300 కోట్లు లెక్కతేలాలి

- శివకుమార్ నివాసాల్లో ముగిసిన ఐటీ సోదాలు...

బెంగళూరు: కర్నాటక మంత్రి డీకే శివకుమార్ నివాసాలు, సంస్థల్లో గత నాలుగు రోజులుగా దాడులు నిర్వహించిన ఆదాయపన్ను డైరెక్టరేట్ (ఇన్వెస్టిగేషన్) అధికారులు పెద్దమొత్తంలో అక్రమాస్తులను గుర్తించారు. దాదాపు 300 కోట్ల రూపాయల అప్రకటిత ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు. ఢిల్లీ, బెంగళూరు రుల్లోని శివకుమార్, ఆయన కుటుంబ సభ్యు లకు చెందిన 64 ప్రాంగణాల్లో ఐటీ వింగ్ తనిఖీలు నిర్వహించింది. మొత్తం 300 కోట్లలో 100 కోట్ల రూపాయలు శివకుమార్, ఆయన కుటుంబ సభ్యులు బదేని అధికారులు గుర్తించినట్లు సమాచారం. దీంతోపాటు గా 15 కోట్ల రూపాయల విలువైన బంగారు ఆభరణాలు జప్తు చేశారు. మిగతా రెండు వందల కోట్లు వివిధ వ్యాపార సంస్థలకు చెందినవిగా ఆదాయపన్ను అధికా రులు గుర్తించారు. శివకుమార్ ప్రమేయం కలిగిన రియల్ ఎస్టేట్, ట్రాన్స్‌పోర్ట్, ఇతర వ్యాపార సంస్థల్లో అక్రమ పెట్టుబడులపెట్టి నట్లు భావిస్తున్నారు. దర్యాప్తు అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని, అక్రమాలు నిజమని తేలితే ఫెమా చట్టం కింద చర్యలు తీసుకుంటామని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఒక ప్రకటనలో పేర్కొంది. కాగా 2013 అసెంబ్లీ ఎన్నికల అఫిడవిట్‌లో శివకుమార్ ఆస్తులను రూ. 251 కోట్లుగా ప్రకటించారు.

అంతా సక్రమమే.. ఆధారాలున్నాయ్

ఐటీ దాడుల సమయం... సందర్భం... తీరుతెన్నులు... బల గాల మోహరింపు.. ఇవన్నీ యావత్ దేశం గమనిస్తోంది. బీజేపీ కక్షపూరిత చర్యే అనడానికి ఇంతకంటే పెద్ద సాక్ష్యాలు అవసరం లేదు. అయినా అన్నిటికీ ప్రజలే సాక్షి. ఐటీ దర్యాప్తు పూర్తిగా నిర్వహించి. ఎవరేచెప్పే ప్రతి ప్రశ్నకూ నా వద్ద జవాబు ఉంది. ప్రతి రూపాయికీ లెక్కలున్నాయి. అక్ర మాస్తులు, నల్లడబ్బు లాంటివి నాద గ్గర లేవు. పన్ను ఎగవేత ప్రచారం శుద్ధ అబద్ధం. నిజం నిలకడమీదే తెలుస్తుంది. రాజ్యాంగం మీద, చట్టాలమీద నాకు గౌరవం ఉంది. చట్టాలను ఉల్లంఘించే వ్యక్తిని కాను. 30 ఏళ్లుగా పార్లమెంటరీ రంగంలో ఉన్నాను. ప్రతియేటా ఐటీ రిటర్నులు సమర్పిస్తున్నాను అని వివరించారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా వాస్తవాలు మాయం చేయలేరని, తాను ఎప్పటికీ సచ్చీలు డనేనని అన్నారు. ఆదివారం ముఖ్యమంత్రి సిద్ధరామయ్యతో తన తల్లి చేసిన విమర్శలకు ఆయన క్షమాపణలు చెప్పారు. క్షణికావేశంలో ఆమె అలా స్పందించి వుంటారని అన్నారు. సీఎం తనకు మద్దతుగా ఉన్నారని చెప్పుకొచ్చారు. దేశవ్యాప్తంగా అన్ని పార్టీల నేతలు తనకు అండగా నిలిచారని గుర్తుచేశారు. పార్టీకి గానీ, నేతలకు గానీ తలవంపులు రానివ్వనని ఈ సందర్భంగా శివకుమార్ ధీమా వ్యక్తం చేశారు.

అన్నీ అడ్డంకులే...!

- కీలక శాఖలో నిస్తేజం
- ముఖ్యమైన పోస్టుల ఖాళీలు
- ఆడిట్ లేని వైనం
- అక్రమాలకు ఊతం
- కొత్త చట్టంతో చెక్
- రిజిస్ట్రేషన్ శాఖలో నిర్లక్ష్యం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రజలతో నేరుగా సంబంధాలు నెరపే కీలకమైన ప్రభుత్వ వ్యవస్థల్లో స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ ఒకటి. అత్యంత కీలకమైన రాబడిని సమకూర్చే ఈ శాఖపై ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందన్న విమర్శలు పెరిగాయి. ఇటీవలే ప్రభుత్వం ఈ శాఖలో సంస్కరణలకు తెరలేపినా కీలక పోస్టుల భర్తీ మాత్రం పూర్తికాలేదు. ఇన్‌ఛార్జీల పాలనతో కీలక నిర్ణయాల్లో అయోమయం నెలకొంటోందని పలుమార్లు ఫిర్యాదులు ప్రభుత్వానికి చేరాయి. మరోవైపు ఆడిట్ వ్యవస్థ నిర్వీర్యం కావడంతో అవినీతి, అక్రమాలు పెరిగాయనే ఆరోపణలకు బలం చేకూరుతోంది. మూడేళ్లుగా ఎలాంటి ఆడిట్‌లు లేకపోవడం, కీలకస్థానాలైన కమిషనర్(ఇన్స్పెక్టర్ జనరల్) పోస్టులో ఇన్‌ఛార్జీ పాలన ఇబ్బందిగా మారింది. ఇటీవలే సబ్ రిజిస్ట్రార్‌లను భారీగా బదిలీలను చేసిన ప్రభుత్వం కీలక పోస్టులపై దృష్టిసారించలేదు.

ఆడిట్ వ్యవస్థలో నిస్తేజం...

ఈ శాఖలో అక్రమాల నియంత్రణకు ఆడిట్ వ్యవస్థ ఎంతో కీలమైంది. ప్రతీ మూడు నెలలకు ఓసారి క్రమం తప్పకుండా ఆడిట్ నిర్వహించాలి. కుంభకోణాలు పెరగడంతో ఆడిట్ వ్యవస్థపై అనుమానాలు పెరిగాయి. అనేకకేసుల్లో ఆడిట్ నిర్లక్ష్యం బైట పడింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వారీగా మూడు నెలలకోసారి, జిల్లా రిజిస్ట్రార్‌ల పరిధిలో ఏడాదికోసారి జరగాల్సిన ఆడిట్‌లో తాత్సారం నెలకొంది ఇటీవల వెలుగుచూసిన పరిణామాలను రుజువు చేశాయి. ప్రధానంగా ఆస్తుల విలువ మదింపు, రుసుముల తగ్గింపు, స్టాంపు రుసుముల ఎగవేత, తక్కువగా చేసి చూపడం, నిర్ధారిత లోపాలు, బుక్ నమోదులో మోసాలు, అక్రమాలపై నిఘాల్లో లోపాలను కనిపెట్టడం కరువవుతోంది. దీంతో ఆడిట్ వ్యవస్థపై అనుమానాలు ఇటీవలీ కాలంలో పెరిగాయి. ప్రధానమైన ఈ శాఖలో పోస్టుల భర్తీలో తీవ్ర ఇబ్బందులున్నాయి. కమిషనర్, ఐజీ, అదనపు ఐజీ, జాయింట్ ఐజీ స్థానాల్లో ఖాళీలున్నాయి. ఒక డీఐజీ స్థానం కూడా ఖాళీగా ఉండటంతో రాష్ట్రస్థాయి పాలనపై ప్రభావం పడుతోంది. 22 జిల్లా రిజిస్ట్రార్‌లను భర్తీ చేయాల్సి ఉంది. దీంతో క్షేత్రస్థాయిలో జిల్లాల పాలన, కీలక నిర్ణయాల అమలులో ప్రతిష్టంభన ఎదురవుతోంది. సీనియర్ అసిస్టెంట్ పోస్టుల్లో కూడా భారీగా ఖాళీలు ఉన్నాయని అధికార వర్గాల సమాచారం.

నూతన చట్టంతో చెక్...

అన్ని అవకతవకలను ఆదిలోనే అంతం చేసేలా కొత్త చట్టాన్ని వేదికగా చేసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా కొత్త స్టాంపుల చట్టంలో బ్యాంకులు, ఆర్థిక సంస్థలను జవాబుదారీ చేస్తూ నిబంధనలను రూపొందించింది. స్టాంపు డ్యూటీని సరిగా చెల్లిస్తున్నారా లేదా, ఆస్తుల మదింపు ఎలా చేశారు అనే విషయాలను ఈ చట్టం ద్వారా పరిశీలించే వెసులుబాటు ఉన్నట్లు చెప్పారు. అదేవిధంగా పూర్తిగా అధికారం ఉన్న రిజిస్ట్రేషన్ సిబ్బంది అధికారాలను సవరించి పరిమితం చేయాలని యోచిస్తూ నాలో పొందుపర్చారు. ఇకపై ప్రభుత్వ కార్యాలయాల్లోనే కాకుండా ప్రైవేటు కార్పొరేట్ కార్యాలయాల్లో కూడా తనిఖీలకు అవకాశం, అధికారం ఇవ్వనున్నారు. స్టాంపుల చట్టం సెక్షన్ 73 ప్రకారం అధికారులు కేవలం ప్రభుత్వ కార్యాలయాల్లో మాత్రమే కాంట్రాక్ట్ అగ్రిమెంట్లు, ఇతర డాక్యుమెంట్లను పరిశీలిస్తున్నారు. ఇకపై ఈ సమాచారాన్ని సబ్ రిజిస్ట్రార్‌లకు తెలపాలని నిబంధన విధించారు. కృత్రిమంగా పెంచిన మార్కెట్ విలువలపై విధించే స్టాంపు డ్యూటీ పెనాల్టీ రూ. 2కు తగ్గించారు. ఇందుకు జిల్లా రిజిస్ట్రార్‌కు ఉన్న అధికారాన్ని ఐజీ, కమిషనర్‌లకు కట్టబెట్టారు. ఫ్రాంక్ మార్కెట్‌లో లావాదేవీలపై రుసుముల వసూలుకు పకడ్బందీ వ్యవస్థను సూచనలు చేయడం కీలక అంశంగా చెప్పుకోవచ్చు. ఆడిటర్ జనరల్ నిబంధనల్లో ఉన్న అయోమయాన్ని తొలగించడం, ప్రతీ డాక్యుమెంట్‌కు నిర్దేశిత రుసుమును విధించడం కీలక పరిణామం. ఈ ముసాయిదాను సర్కార్ పరిశీలించి ఆమోదముద్ర వేయాల్సి ఉంది. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో బిల్లును పెట్టనున్నట్లు తెలిసింది. తర్వాత దీనిని కేంద్ర ఆమోదానికి పంపనున్నారు.

కమ్యూనికేషన్ విభాగంలో...
సింగరేణికి ఐదు అవార్డులు

- సీఎండీ శ్రీధర్ హర్షం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రజాసంబంధాలు, కమ్యూనికేషన్ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్న సింగరేణి సంస్థకు పబ్లిక్‌రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా వారు నిర్వహించిన పోటీల్లో నాలుగు అత్యుత్తమ బహుమతులతో పాటు ఒక జ్యూరీ అవార్డు లభించాయి. హైదరాబాద్‌లో జరిగిన పిఆర్ఎస్ఐ 8వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సదస్సులో ఈ అవార్డులను సింగరేణి సంస్థ అందుకుంది. సింగరేణి సంస్థలో అత్యంత ఆదరణ పొందుతున్న సింగరేణీయుల సమాచారం ద్వైమాసిక పత్రికకు రెండు విభాగాల్లో ప్రథమ బహుమతులు, టీన్యూస్‌లో వారంవారం ప్రసారమవుతున్న సింగరేణి ప్రగతి కార్యక్రమానికి కార్పొరేట్ ఫీచర్ అవార్డు, సింగరేణి డైరీల విభాగంలో ప్రథమబహుమతితో పాటు సింగరేణి క్యాలెండర్‌కు ప్రత్యేక జ్యూరీ అవార్డు లభించాయి. రాష్ట్రప్రభుత్వ సాంస్కృతిక సలహాదారు డాక్టర్ కెవి రమణాచారి, గ్రేటర్ హైదరాబాద్ మేయర్ బొంతు రామ్మోహన్‌ల చేతుల మీదుగా జీఎం (కో-ఆర్డినేషన్) వి.కిషన్‌రావు, పిఆర్ఓ మహేష్, సీనియర్ కమ్యూనికేషన్ ఆఫీసర్ గణశంకర్ పూజారి, పిఆర్ఏలు కెవిరమణ, సంపత్‌కుమార్‌లు అందుకున్నారు.

ప్రత్యేక కృషికి లభించిన గుర్తింపు

సంస్థచైర్మన్ అండ్ ఎండి శ్రీధర్ ఆధ్వర్యంలో గత మూడేళ్లుగా తీసుకుంటున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను, ప్రజాసంబంధాలు.. కమ్యూనికేషన్ సాధనాల ద్వారా సమర్థంగా ప్రచారంలోకి తీసుకెళ్లిన నేపథ్యంలో వీటికి పిఆర్ఎస్ఐ సంస్థ గుర్తింపునిచ్చి అవార్డులను ప్రకటించిందని జి.ఎం.కిషన్ రావు సంతోషం వ్యక్తం చేశారు. న్యూస్‌లెటర్ విభాగంలో, సంక్షేమ కార్యక్రమాల విభాగంలో సింగరేణీయుల సమాచారంకు రెండు ఉత్తమ బహుమతులు లభించాయన్నారు. టీన్యూస్‌లో ప్రసారమయ్యే సింగరేణి ప్రగతికి కార్పొరేట్ ఫీచర్ విభాగంలో ప్రథమ బహుమతి లభించిందన్నారు. గణశంకర్ పూజారి యాంకర్‌గా వ్యవహరిస్తున్న ఈ కార్యక్రమం ఇప్పటికి 550ఎపిసోడ్స్ పూర్తిచేసుకుందన్నారు. ఈ సందర్భంగా కొత్త జిల్లాల ఏర్పాటుతో వస్తున్న పరిపాలనా మార్పులకు సంబంధించిన సదస్సులో సిపిఆర్ఓ కిషన్‌రావు పాల్గొని మాట్లాడారు.

సింగరేణి చైర్మన్ అభినందనలు..

సింగరేణి ప్రజాసంబంధాలు, కమ్యూనికేషన్ విభాగాలకు పిఆర్ఎస్ఐ సంస్థ ద్వారా ఐదు జాతీయస్థాయి అవార్డులు లభించడంపై సింగరేణి చైర్మన్ ఎన్.శ్రీధర్ సంతోషం వ్యక్తం చేశారు. విజేతలను అభినందించారు. ఈ కృషిని ఇకపై మరింత సమర్థవంతంగా కొనసాగించాలన్నారు.

నల్లధనం ఇక వెనక్కి!

(మొదటిపేజీ తరువాయి)

పంచుకుంటుంది. దీనికి ప్రత్యేకమైన నిబంధనలు, అనుమతులు అక్కర్లేదు. ఇప్పటి వరకూ ఆ అవసరం ఉండేది. ఈ సందర్భంగా లీకిన్‌స్టన్, బహమాస్ దేశాలతోనూ ఇలాంటి ఒప్పందాలే కుదుర్చుకున్న వైనాన్ని ప్రస్తావించింది. అమెరికాలో పన్నులను వేసే అధికార సంస్థ ఇంటర్నల్ రెవెన్యూ సర్వీస్ (ఐఆర్ఎస్) కూడా ఇటీవలే భారత్‌లోని గోప్యత, సమాచార భద్రతను ప్రశంసించింది. ఇదే దారిలో నడిచిన స్విస్ భారత్‌తో సమాచారం ఇచ్చిపుచ్చుకోవడానికి అంగీకరించింది.

ఇప్పుడెందుకు అనుమతి?

ఇందుకు పునాది మోదీ 2016లో స్విట్జర్లాండ్‌లో పర్యటన జరిపినప్పుడే పడింది. మన దేశంలో అవకాశాలను వారికి చెప్పి మోదీ, చట్టాలను సవరించేందుకు అంగీకరించారు. అందుకనుగుణంగా చర్యలు తీసుకున్నారు. దీంతో ఇన్నాళ్లూ తమ దగ్గరడబ్బు దాచుకున్న వారి వివరాలను చెప్పేందుకు నిరాకరిస్తూ వచ్చిన స్విట్జర్లాండ్ ఇప్పుడు అంగీకరించడానికి కారణం ఉంది. భారత్‌లో ఆ దేశ కంపెనీలు పెట్టుబడులు పెట్టడానికి రంగం సిద్ధం అయినందున స్విట్జర్లాండ్ సమాచారం ఇచ్చి పుచ్చుకునేందుకు అంగీకరించింది. ఆ దేశ కంపెనీలు భారత్‌లో ఇన్సూరెన్స్, రీఇన్సూరెన్స్, ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగాల్లో పెట్టుబడులు పెట్టడానికి సిద్ధమయ్యాయి. దీంతో సమాచారం ఇచ్చిపుచ్చుకోవడం ఆ దేశానికి అవకాశమే కాక అవసరం కూడా అయింది. భారతీయుల సమాచారం ఇస్తేనే, భారత్ కూడా స్విట్జర్లాండ్ కంపెనీ వారి పెట్టుబడిదారుల సమాచారం ఇచ్చే అవకాశం ఉంటుంది. దీంతో అక్కడ డబ్బు దాచుకున్న వారి సమాచారం స్విట్జర్లాండ్ బయటపెట్టక తప్పడం లేదు. దీంతో స్విస్ ఫెడరల్ కౌన్సిల్ భారత్‌తో సమాచారం



ఇచ్చిపుచ్చుకోవడానికి అంగీకరించింది. అయితే.. సమాచారాన్ని బహిరంగపరచడంపై చాలా నిబంధనలు ఉన్నాయి. స్విస్ ఇచ్చిన సమాచారాన్ని భారత ప్రభుత్వం బహిరంగ పరిచే అవకాశం లేదు.

ఏ సమాచారాన్ని బహిరంగ పరచాలో దేన్ని కూడదో తెలిపే నిబంధనలు తయారయ్యాకే స్విట్జర్లాండ్ ఇందుకు పూనుకుంది. ఫెడరల్ కౌన్సిల్ ఒక నిర్ణయం తీసుకున్నప్పటికీ జనవరి ఒకటో తేదీ నుంచి భారత్‌తో సమాచారం ఇచ్చిపుచ్చుకోవడం నిర్ణయించారు ఇది లాంఛనమే. అయితే.. అది వెంటనే వచ్చే అవకాశము లేదు. మొదటి సారి సమాచారం 2018లో వస్తుందని అనుకున్నప్పటికీ, 2019లోకాని రాదని తెలుస్తోంది.

భారత్‌లో నల్లధనం విషయం చాలా కీలకమైంది. ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ఎన్నికల వాగ్దానాల్లో నల్లధనాన్ని భారత్‌కు తేవడం కూడా ఒకటి. అలాగే భారతీయులు తమ డబ్బు దాచుకోవడానికి స్విట్జర్లాండ్ చాలా భద్రమైన ప్రదేశంగా భావిస్తుంటారు. దీంతో స్విస్ నుంచి సమాచారం రప్పించుకోవడానికి భారత్ పెద్ద స్థాయిలో చర్చలు జరిపింది. స్వయంచాలిత సమాచారం ఇచ్చిపుచ్చుకోవడం (ఏఈఓఐ) ని స్విస్‌తో అమలు చేయడంకంటే ముందు జీ20, ఓఈసీడీ వంటి అంతర్జాతీయ గ్రూపులతో కలిసి భారత్ పని చేసింది. దీంతో భారత్‌తో పాటు 41 దేశాలతో స్విస్ ఇటువంటి ఒప్పందం కుదుర్చుకోవాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో భారత్ కూడా చాలా చట్టాలను సవరించింది. స్విస్‌తో ఒప్పందానికి అనుగుణంగా సమాచార భద్రత చట్టాలను సవరించింది.

ప్రస్తుతం భారత్‌లో ఉన్న సమాచార భద్రత స్థాయి అమెరికాలోని ఐఆర్ఎస్‌తో సరిపోతుందని స్విస్ భావిస్తోంది. ప్రస్తుతం భారతదేశంలో ఆదాయపు పన్ను చట్టాలు కూడా అవసరమైన సమాచార భద్రతను పాటిస్తున్నాయి. అందుకే కొందరి ఆదాయ సమాచారాన్ని ఇవ్వడానికి కోర్టులు నిరాకరించిన సందర్భాలు ఉన్నాయి.


ఇప్పటివరకూ భారత్ మార్కెట్ మీద స్విట్జర్లాండ్ దృష్టి పెట్టకపోవడానికి కారణం ఉంది. ఇక్కడి బ్యూరోక్రసీనే. అయితే.. ఇటీవల చేసిన పాలనా సంస్కరణల వల్ల భారత్ మార్కెట్‌ను కూడా స్విట్జర్లాండ్ పరిగణనలోకి తీసుకుంటోంది. ముఖ్యంగా రీఇన్సూరెన్స్ రంగంలో అడుగుపెట్టడానికి రంగం సిద్ధమైంది. ది. రీఇన్సూరెన్స్ రంగమంటే ఒకపెద్ద ఇన్సూరెన్స్ కంపెనీ తన క్లెయిమ్‌ల రిస్క్‌ను సెటిల్ చేయడానికి మరో కంపెనీతో ఒప్పందాలు కుదుర్చుకుంటుంది.

దీంతో రెండుకంపెనీలకు రిస్క్ స్థాయి తగ్గిపోతుంది. ప్రస్తుతం భారత్‌లో ఈ రంగంపై స్విస్ దృష్టి పెట్టినందున సమాచారం ఇచ్చిపుచ్చుకునే ఏర్పాటు కూడా జరుగుతోంది. దీంతో ఇరు దేశాల మధ్య సమాచారం ఇచ్చిపుచ్చుకోవడానికి వ్యవస్థను ఏర్పాటు చేసే ప్రక్రియ ప్రారంభమైంది.

కార్మికులకు ఆరోగ్య భద్రత

- ఈఎస్ఐసీ, డీజీఎఫ్ఏఎస్ఎల్ఐ మధ్య పరస్పర ఒప్పందం
- ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తాం: కేంద్ర మంత్రి దత్తాత్రేయ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: దేశ వ్యాప్తంగా కార్మికుల దరికి సామాజిక భద్రతతో పాటు ఆరోగ్య రక్షణ కల్పించేందుకు ఎన్డీయే ప్రభుత్వం పెద్దఎత్తున కృషి చేస్తోందని కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి బండారు దత్తాత్రేయ స్పష్టం చేశారు. ఇందుకోసం అనేక చర్యలు తీసుకుంటున్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆదివారం నాడిక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి పెద్దపీట వేస్తున్నదన్నారు. ముఖ్యంగా గతంలో ఎప్పుడు లేనివిధంగా కార్మిక సంక్షేమం, అభ్యున్నతి కోసం తీసుకుంటున్న చర్యలు మంచి ఫలితాలను ఇస్తున్నాయని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే ఇఎస్ఐసీ, డైరెక్టర్ జనరల్ ఫ్యాక్టరీ అడ్వైస్ సర్వీసు, లేబర్ ఇన్‌స్టిట్యూషన్ (డిజిఎఫ్ఏఎస్ఎల్ఐ) మధ్య



పరస్పర ఒప్పందం సైతం కుదుర్చుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ ఒప్పందంలో భాగంగా కార్మికులకు సంభవించే ప్రమాదాలు, జబ్బులకు సంబంధించిన ఆరోగ్య భద్రత కల్పిస్తున్నామన్నారు. ఇందుకోసం కార్మికులకు మందుస్తు అవగాహన కార్యక్రమాలను సైతం ఏర్పాటు చేయనున్నామన్నారు. దీనివల్ల రాబోయే ప్రమాదాలను కొంత మేరకు నియంత్రించే అవకాశముంటుందన్నారు. అలాగే రాబోయే జబ్బులపై వారికి పూర్తి సమాచారం ఉండడం వల్ల ఆరోగ్యంపట్ల మరింత శ్రద్ధ తీసుకునే అవకాశముంటుందన్నారు. ఫలితంగా కార్మికుల ప్రాణనష్ట నివారణను నియంత్రించేందుకు కూడా అవకాశముంటుందని దత్తాత్రేయ పేర్కొన్నారు.

ఉత్తమ్ నాయకత్వాన్ని ఆమోదించం

- మాజీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: టీపీసీసీ పదవి కోసం తానెప్పుడు వెంపర్లాడలేదని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటి రెడ్డి వెంకటరెడ్డి అన్నారు. అయితే టీ పీసీసీ చీఫ్ పదవి నుంచి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని మార్చాలని పార్టీ నేత రాహుల్‌గాంధీ దృష్టికి తీసుకుపోయిన మాట వాస్తవమేనని, ఆయన నాయకత్వాన్ని ఆమోదించేదిలేదని కుండబద్దలు కొట్టి తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఉత్తమ్ పార్టీ అధ్యక్షుడిగా నియమించిన తర్వాత జరిగిన జీహెచ్ఎంసీ, స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘోరంగా ఓటమి చెందిందని, అప్పుడే నైతిక బాధ్యత వహించి ఉత్తమ్‌రాజీనామా చేసి ఉంటే బాగుండేదని ఆయన అభిప్రాయపడ్డారు. నాలుగేళ్లు ఒకే వ్యక్తి నాయకత్వం కింద పని చేయలేకున్నారు. టీ పీసీసీ పదవి పార్టీలోని సీనియర్లకు ఇవ్వాలని రాహుల్‌కు చెప్పినట్లు ఆయన వివరించారు. తాను కాంగ్రెస్‌ను వీడి టీఆర్ఎస్‌లో చేరుతారని వస్తున్న వార్తల్లో వాస్తవం లేదన్నారు. తెలంగాణ కోసం అంటూ అధిష్టానం పదవులను వదులుకున్నట్లు చెప్పారు. తమకు సోనియాగాంధీ, రాహుల్ గాంధీలే నాయకులన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో భారీ అవినీతి జరుగుతోందని ఆయన ఆరోపించారు. సాగునీటి ప్రాజెక్టుల్లో టెండర్లు లేకుండానే రూ. 85 వేల కోట్లు కాంట్రాక్టులకు అప్పజెప్పారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వంలో అవినీతి జరగడం లేదని సీఎం చంద్రశేఖర్‌రావు దేవుళ్ల వద్ద ప్రమాణం చేస్తారా..? అని కోమటిరెడ్డి నిలదీశారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీపై సీఎం విమర్శలు చేయడం సరికాదన్నారు. సోనియా వద్దకు కుటుంబసభ్యులు వెళ్లి కాళ్లమీద పడిన విషయం గుర్తుంచుకోవాలన్నారు.

ప్రొ. జయశంకర్ స్ఫూర్తిప్రధాత

- జయంతి సందర్భంగా స్మరించుకున్న సీఎం కేసీఆర్, హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: స్వరాష్ట్రసాధన ఉద్యమం కోసం తన జీవితాంతం కృషిచేసిన ప్రొఫెసర్ జయశంకర్ సార్‌ను తెలంగాణ సమాజం ఎన్నటికీ మరువదని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఆయనను స్మరించుకున్నారు. హైదరాబాద్ రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో విలీనమైన నాటి నుండి మలిదశ తెలంగాణ ఉద్యమం రగిలేవరకు తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించుకుంటూ వచ్చి భావజాల వ్యాప్తికి జీవితాన్ని ధారపోశారని సీఎం కొనియాడారు. జయశంకర్ సర్ తెలంగాణ సమాజానికి స్ఫూర్తిప్రదాతగా నిలుస్తారన్నారు.

తెలంగాణ భవన్‌లో..



ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్రసాధనకు అందించిన సేవలు ఎనలేని వని, ఉద్యమ నేత కెసిఆర్‌కు వెన్నుదన్నుగా నిలిచి అందించిన సహకారం చిరస్మరణీయమైనదని రాష్ట్ర హోంశాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం తెలంగాణభవన్‌లో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ సందర్భంగా మాట్లాడారు. ముఖ్యమంత్రి కెసిఆర్ మరో పదేళ్లు తెలంగాణకు సిఎంగా ఉంటారన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ ఆశయసాధనకు కృషి చేస్తున్నామన్నారు. శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్ ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విద్యాలయంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపసభాపతి డాక్టర్ ప్రవీణ్‌రావు పూలదండ వేసి పుష్పాంజలి ఘటించారు. జగిత్యాలలో నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని ఆవిష్కరించి ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. జీవితాంతం తెలంగాణ కోసం అర్పించిన మహోన్నత జయశంకర్ అని, తెలంగాణ నకు జరిగిన అన్యాయాన్ని లెక్కలతో సహా రాసిపెట్టుకుని కెసిఆర్‌కు అందించారని, ఆ అన్యాయాన్ని సరిచేసేందుకు.. తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపేందుకు సిఎం కెసిఆర్ కృషి చేస్తున్నారన్నారు.

బాషాసాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో..

తెలంగాణ బాషాసాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో జయశంకర్ జయంతి కార్యక్రమం నిర్వహించగా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ పాల్గొని నివాళులర్పించారు. ఆయన సేవలను స్మరించుకున్నారు. విద్యుత్ సౌధలో ప్రాజెక్టు అండ్ గ్రిడ్ డైరెక్టర్ జి.నర్సింగ్ రావు, ట్రాన్స్‌కో, జెన్‌కో అధికారులు జయశంకర్ జయంతి వేడుకలు నిర్వహించారు. జెఎన్‌టియులో వైస్‌ఛాన్స్‌లర్ ఎ.వేణుగోపాల్ రెడ్డి జయశంకర్ సర్‌కు నివాళులు అర్పించారు. ఆయన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్.యాదయ్య, ప్రిన్సిపాల్ ఎ.గోవర్ధన్, డైరెక్టర్లు మంజూర్ హుస్సేన్, ప్రభుకుమార్, వి.కామాక్షిప్రసాద్ పాల్గొన్నారు.


మంత్రి జూపల్లి నివాళి..



ప్రొఫెసర్ జయశంకర్ సర్ తెలంగాణ ఏర్పాటు కోసం జీవితాంతం కృషిచేసిన మహనీయుడని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఓల్డ్ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కృషిని కొనియాడారు.

టిఎస్ఎస్పిడిసిఎల్‌లో..

టిఎస్ఎస్పిడిసిఎల్‌లో ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంస్థచైర్మన్ రఘుమారెడ్డి, సంస్థడైరెక్టర్లు శ్రీనివాస్, మీర్ కమాలుద్దీన్ అలీలు జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో చెరిగి పోని శిలాక్షరం జయశంకర్ అన్నారు. కార్యక్రమంలో సిజిఎంలు సతీష్‌కుమార్, విద్యాసాగర్, బాల్ రాజ్, దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.



బస్‌భవన్‌లో...


దార్శనికుడు ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను బస్ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ జి.వి. రమణారావు, కార్యనిర్వాహక సంచాలకులు సత్యనారాయణ, రవీందర్, వేణు, టి.వి.రావుతో పాటు అధికారులు, యూనియన్ ప్రతినిధులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

టీజేఏసీ ఆఫీస్‌లో జయశంకర్ జయంతి

టీజేఏసీ కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి టీజేఏసీ చైర్మన్ కోదండరామ్ తో పాటు నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోసం ఎంతో దూరదృష్టితో పని చేశారు. ఆంధ్ర పాలకుల కుట్రలను ఎండగట్టారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీజేఏసీ నేతలు ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం, రఘు, వెంకటరెడ్డి, భైరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.


మహోన్నతుడు జయశంకర్

- నీటి పారుదల శాఖ మంత్రి హరీష్‌రావు



సిద్దిపేట, కెఎన్ఎస్: 1952లో జరిగిన 'నాన్ ముల్కీ గో బ్యాక్' ఉద్యమ మొదలుకుని మలిదశ తెలంగాణ ఉద్యమాన్ని భుజాన వేసుకుని జీవితమంతా తెలంగాణ ఉద్యమ భావజాల వ్యాప్తికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి ఆచార్య జయశంకర్ అని నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు కొనియాడారు. జయశంకర్ జయంతి సందర్భంగా సిద్దిపేటలోని ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ ప్రొ.జయశంకర్ తన మేధాశక్తితో ఈ ప్రతిఫలం ఆశించకుండా నిస్వార్థంగా రాష్ట్ర సాధనకోసమే పనిచేశారని అన్నారు. 13 ఏళ్ల టీఆర్ఎస్ పోరాటం సాగించడం వెనక ప్రొ.జయశంకర్ సహాయ సహకారం, ప్రోత్సాహం అమోఘం అన్నారు. ఆయన ఆధ్యాపకుడైనా.. నిరంతర అధ్యయనశీలి, మేధావి, నిరాడంబరుడు. ఏవిరిశ్రాంత వరకు తెలంగాణ రాష్ట్ర సాధనే ఊపిరిగా బతికారని పేర్కొన్నా రు. తెలంగాణ ఉద్యమానికి దిశానిర్దేశం, మార్గదర్శకం చేసిన మహోన్నతుడు జయశంకర్ సార్ అని అన్నారు. జయశంకర్ చూపిన బాటలోనే టీఆర్ఎస్ పని చేస్తుందని, జయశంకర్ సార్ కోరుకున్న తెలంగాణ నిర్మాణం కోసం సీఎం కేసీఆర్ అహర్నిశలు కృషి చేస్తున్నారని మంత్రి హరీష్ ఈ సందర్భంగా గుర్తుచేశారు.

జయశంకర్ సార్ ఆశయ సాధనకు కృషి




వరంగల్, కెఎన్ఎస్ బ్యూరో: ఆచార్య జయశంకర్ ఆలోచనలు ఆశయాలను మరింత ముందుకు తీసుకెళ్లే దిశలో ఆయన ఆశయాల సాధనకు పునరంకితం కావాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు. జయశంకర్ గురించి ఎన్ని గంటలు మాట్లాడినా.. ఎన్ని రోజులు చేసినా..

ఇంకా మిగిలిపోతుందని, మూడు తరాలను పరికించి చూసిన వ్యక్తి ఆయనే అన్నారు. జయశంకర్ సార్ ఏకపక్షంగా కేసీఆర్‌పై నమ్మకం ఉంచి ఆయనపైనే ఉన్నారని, అలా ఉన్నందుకే ఆనందం వ్యక్తం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు పసునూరి దయాకర్, సీతారామ్‌నాయక్, శాసనసభ్యులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, డా. టి.రాజయ్య, ఆరూరి రమేష్, శంకర్‌నాయక్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు రాజయ్యయాదవ్, లింగంపల్లి కిషన్‌రావు, బొల్లంసంపత్ కుమార్, వాసుదేవరెడ్డి, కుడా వైస్ చైర్మన్ యాదవరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శృతిఓజా, పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీపై నిరంతర ఒత్తిడి

తెరాస ఎంపీల నిర్ణయం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: జీఎస్టీ అంశంలో పన్ను మినహాయింపులకు కేంద్రంపై నిరంతర ఒత్తిడి తీసుకురావాలని టిఆర్ఎస్ ఎంపీలు నిర్ణయించారు. జీఎస్టీ బిల్లు పాసయ్యేంతవరకు అన్ని రాష్ట్రాల అంశాలను పరిగణనలోకి తీసుకుంటామని చెప్పిన కేంద్రం తమ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా ఇపుడు బుల్డోజ్ చేయడం దారుణమని భువనగిరి ఎంపీ బూరనర్సయ్య గౌడ్ ధ్వజమెత్తారు. ఆదివారం తెలంగాణభవన్‌లో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్‌డిఏ తీసుకొచ్చిన జీఎస్టీ బిల్లుకు టిఆర్ఎస్ సంపూర్ణమద్దతును ఇచ్చిందన్నారు.రాష్ట్రంలో మిషన్ భగీరథ, మిషన్‌కాకతీయ, డబుల్‌బెడ్‌రూం ఇండ్లు, సాగునీటి ప్రాజెక్టులపై పెద్ద ఎత్తున జీఎస్టీ భారం పడుతోందన్నారు. బిజెపికి మూడేళ్ళ నుండి అన్ని అంశాల్లో మద్దతుగా నిలుస్తున్నామన్నారు. ఇప్పటికైనా తమ ప్రాజెక్టులకు సహకరించాలన్నారు. ఎయిమ్స్ కేంద్రం నీళ్ళు చల్లిందని, నియోజకవర్గాల పునర్విభజనపై చేతులెత్తేసిందన్నారు. బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీపై స్పందనేలేదన్నారు. జీఎస్టీ భారాన్ని తగ్గించాలని, అందుకోసం కేంద్రంపై నిరంతర ఒత్తిడి తెస్తామన్నారు. వత్తిడి తెచ్చి హక్కులు సాధించుకోవడం టిఆర్ఎస్‌కు కొత్త కాదన్నారు. రాష్ట్రప్రయోజనాలే తమకు ముఖ్యమన్నారు.

కేంద్రం పునరాలోచన చేయాలి: ఎంపీ బాల్కసుమన్

జీఎస్టీకి సంబంధించి ప్రాజెక్టులపై భారం మోపడం కేంద్రానికి తగదని, దీనిపై పునరాలోచన చేయాలని ఎంపీ బాల్క సుమన్ అన్నారు. జీఎస్టీ వల్ల ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులకు 18శాతం నుండి 12శాతంకు పన్ను తగ్గించినా రాష్ట్రాలు భరించే స్థితిలో లేవన్నారు. దీనిని 5శాతం లోపు తగ్గించాలన్నారు. ఇప్పటికే మంత్రి కెటిఆర్ ఢిల్లీలో జరిగిన జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో తెగేసి చెప్పారని, దీనిపై లోక్‌సభలో తాము వాయిదా తీర్మానం కూడా ఇచ్చామన్నారు.


తప్పుడు ప్రకటనలపై

ప్రజలకు క్షమాపణ చెప్పాలి

కేసీఆర్‌కు రేవంత్‌రెడ్డి బహిరంగ లేఖ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: జీఎస్టీతో నష్టం లేదని కొద్ది రోజుల క్రితం చంకలు గుద్దుకున్నసీఎం కేసీఆర్ ఇప్పుడెందుకు కేంద్ర ప్రభుత్వంపై అక్కసు వెళ్ళగక్కుతున్నారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర శాఖ కార్యనిర్వాహ క అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. జీఎస్టీ కారణంగా రాష్ట్రానికి ఎలాంటి నష్టం లేదన్న ప్రకటనతో తెలంగాణ సమాజం మొత్తాన్ని తప్పుదోవ పట్టించారని ఆయన విమర్శించారు. గతంలో నోట్ల రద్దు గురించి, ఇపుడు జీఎస్టీ గురించి రెండు రకాల మాటలు మాట్లాడడం అన్నది ఈ మధ్యకాలంలో మీకు అలవాటుగా మారిందని పేర్కొంటూ ఆదివారం సీఎం కేసీఆర్‌కు రేవంత్‌రెడ్డి మరో బహిరంగ లేఖను సంధించారు. జీఎస్టీ పన్ను విధానాన్ని అమలు చేయడానికి ముందు కేంద్ర స్థాయిలో ఎన్డీయే ప్రభుత్వం అనేక సమావేశాలు నిర్వహించిందన్నారు. ఈ సమావేశాలలో రాష్ట్ర తరపున ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ పాల్గొన్న ఏఒక్కరోజు కూడా జీఎస్టీ విధానాన్ని తెలంగాణ రాష్ట్రం వ్యతిరేకిస్తుందన్న సమాచారం ఎక్కడా,ఎప్పుడు వినబడలేదన్నారు.

మేం చెప్పిందే నిజమవుతోంది



హైదరాబాద్, ఆంధ్రప్రభ: జీఎస్టీపై కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి చెబుతున్నదే ఇప్పుడు జరుగుతోందని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి అన్నారు. మధ్య తరగతి, సామాన్య ప్రజలను పట్టించు కోకుండా జీఎస్టీని రూపొందించారని ఆయన విమర్శించారు. ఆదివారం ఆయన సీఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. జీఎస్టీని తమ పార్టీ అసెంబ్లీ, మండలిలో వ్యతిరేకిస్తే.. సీఎం చంద్రశేఖర్‌రావు సమర్థించారని, ప్రధాన మంత్రిని తిట్టొద్దని ఆయన మెప్పుకోసం మాట్లాడారని ఆయన ఎద్దేవా చేశారు. కేసీఆర్‌ది అవకాశవాద రాజకీయాలు అని ఆయన విమర్శించారు. తనకో న్యా యం, ప్రతిపక్షాలకు ఒక న్యాయమా..? అంటూ నిలదీశారు. పోల వరం ముంపు బాధితుల గోడ అరణ్యరోధనంగా మారిందన్నారు. భద్రాచలం దేవా లయం మునిగే ప్రమాదం ఉందన్నారు. మెడికల్ కాలేజీ కోసం మాజీ ఎంపీ పొన్నం చేస్తున్న దీక్షప్రభుత్వానికి పట్టడటం లేదన్నారు. డ్రగ్స్‌పై సర్కార్ చెబుతున్నదొకటి, చేస్తున్నది మరొకటన్నారు. సీఎం కేసీఆర్ సొంత ఎజెండాను పక్కన పెట్టి, ప్రజల కోసం పని చేయాలని ఆయన కోరారు.

తుమ్మలకు సీఎం కేసీఆర్ పరామర్శ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : కొద్ది రోజుల క్రితం అస్వత్థతకు గురై యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును ఆదివారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు పరామర్శించారు. వైద్యులతోనూ మాట్లాడి చికిత్స అందుతున్న తీరును తెలుసుకున్నారు. తగినంత విశ్రాంతి తీసుకుని త్వరగా కోలుకోవాలని, ఆ తర్వాతే విధులకు హాజరు కావాలని ఈ సందర్భంగా కేసీఆర్ తుమ్మలకు సూచించారు.

హెచ్‌సీయూకు జాతీయ అవార్డు

కార్పొరేట్ బ్రోచర్‌కు మొదటి బహుమతి



హైదరాబాద్,ఆంధ్రప్రభ: హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం రూపొందించిన కార్పొరేట్ బ్రోచర్‌కు జాతీయ అవార్డు లభించింది. జాతీయ పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ప్రధానం చేసిన అవార్డుల్లో కార్పొరేట్ బ్రోచర్ విభాగంలో యూనివర్సిటీ ప్రొఫైల్‌తో రూపొందించిన బ్రోచర్‌కు మొదటి బహుమతి లభించింది. అవార్డును హైదరాబాద్ మహానగర పాలక సంస్థ మేయర్ బొంతు రాంమోహన చేతుల మీదుగా ఆదివారం కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రజా సంబంధాల అధికారి ఆశిష్ జాకబ్ థాంప్సన్ అందుకున్నారు. గత ఏడాదిలో వాల్ కేలండర్ విభాగంలో అవార్డను సొంతం చేసుకున్నట్టు పిఆర్‌వో తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ హైదరాబాద్ చాప్టర్ ఛైర్మన్ వి వేణుగోపాల్‌రెడ్డి, కాన్ఫరెన్స్ ఛైర్మన్ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీవారి ఆలయం మూసివేత

తిరుమల, కెఎన్ఎన్: చంద్రగ్రహణం కారణంగా సోమవారం సాయంత్రం 4.30 గంటల నుంచి ఎల్లుండి తెల్లవారు జామున 2 గంటల వరకు తిరుమల శ్రీవారి ఆలయం తలుపులు మూసి ఉంటాయని, భక్తులు ఈ విషయాన్ని గమనించి తమ తిరుమల యాత్రను ప్లాన్ చేసుకోవాలని తిరుమల జేఈవో శ్రీనివాసరాజు తెలియజేశారు. ఆయన ఆలయం ఎదుట విలేకరులతో మాట్లాడుతూ నేడు రాత్రి 10.52 గంటలకు చంద్రగ్రహణం ప్రారంభమై ఎల్లుండి ఉదయం 12.48 గంటలకు పూర్తవుతుందని, అయితే గ్రహణ సమయానికి 6 గంటల ముందుగా ఆలయం తలుపులు మూసివేయడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. రేపు ఉదయం 2 గంటలకు ఆలయం తలుపులు తెరిచి శుద్ధి, పుణ్యాహవచనం నిర్వహిస్తారని చెప్పారు.

ప్రధాని వద్దకెళ్దాం!

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్‌ను ఆదేశించారు. కేంద్రానికి రాసే లేఖతో పాటు ఈ వివరాలను కూడా జతచేస్తే సానుకూల స్పందన వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. కొత్తగా ఏర్పడిన రాష్ట్రంలో అభివృద్ధికి సహకరించి ప్రత్యేక రాయితీలతో ప్రోత్సహించాల్సిన బాధ్యత గల కేంద్ర ప్రభుత్వం జీఎస్టీపై ఏకపక్ష నిర్ణయాలు తీసుకుని రాష్ట్రానికి నష్టం కలిగించడం దురదృష్టకరమన్నారు. ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులకు జీఎస్టీలో ప్రత్యేక మినహాయింపులు ఇవ్వకుంటే రాష్ట్రానికి దాదాపు రూ.20 వేల కోట్ల నష్టం జరుగుతుందని పదేపదే వాదించినా పట్టించు కోకపోవడం బాధాకరమని కేసీఆర్ వ్యాఖ్యానించారు.

ప్రజోపయోగ కార్యక్రమాల కోసం చేపడుతున్న నిర్మాణాలపై విధించిన 12శాతం జీఎస్టీని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వంపై రాజీలేని పోరాటాన్ని సాగించేందుకు సిద్ధమని సీఎం పునరుద్ఘాటించారు. అనుకున్నది సాధించేంత వరకూ వదిలిపెట్టేది లేదన్నారు. కేసీఆర్ పట్టుబడితే ఇది పెద్ద కష్టమేమీ కాదన్నారు. జూన్ 30 నాటికే ప్రారంభమైన ప్రాజెక్టులకు జులై 1 నుంచి అమల్లోకి వచ్చిన జీఎస్టీని వర్తింపజేయడం సమంజసం కాదన్నారు. గతంలో ఉన్న 5శాతం వ్యాట్ అంచనాలతో ఆయా ప్రాజెక్టులకు సంబంధించి అంచనా వ్యయాలను రూపొందించడం జరిగిందన్నారు. అందుకు బడ్జెట్ కేటాయింపులు జరిగిన తర్వాత సవరించడం ఎట్లా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. ఈ పరిస్థితుల్లో అమల్లో ఉన్న ప్రాజెక్టులకు విధించాలనుకున్న 12శాతం జీఎస్టీని తగ్గించడం ఒక్కటే మార్గమన్న విషయాన్ని స్పష్టం చేస్తూ ప్రధానికి లేఖ రాయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఆ లేఖలో పొందుపర్చాల్సిన అంశాలపై ఒకటికి రెండుసార్లు పునఃపరిశీలించాలని ఆర్థిక, ప్రణాళిక శాఖల ఉన్నతాధికారులకు సూచించారు.

జీఎస్టీ వలన నిర్మాణ పనులపై ఎంత ప్రభావం పడుతుందనే విషయాన్ని స్పష్టంగా కేంద్రానికి తెలియపరిస్తేనే వాస్తవాలను పరిగణనలోకి తీసుకుని సవరించే అవకాశాలు ఉన్నాయన్నారు. ఆదివారమే ప్రధానికి లేఖ రాయాలని ముందుగా అనుకున్నప్పటికీ, నీటి పారుదల ప్రాజెక్టులు, మిషన్ భగీరథ, గృహ నిర్మాణం, విద్యుత్ ప్రాజెక్టులు, రహదారుల నిర్మాణం తదితర ప్రాజెక్టుల వ్యయం, భారంపై స్పష్టమైన సమాచారం లేనందున వేచి ఉన్నానని కేసీఆర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. లోతుగా అధ్యయనం చేసి గణాంకాలకు తుదిరూపం ఇవ్వాలని, ఆ తర్వాతే లేఖ రాస్తే ఫలితం ఉంటుందని అభిప్రాయపడ్డారు. పథకాలు, ప్రాజెక్టుల వారీగా 12శాతం జీఎస్టీతో పెరిగే ఆర్థిక భారం ఎంత?, మొత్తం కలిపి రాష్ట్ర ఖజానాపై పడే భారం ఎంత?, ఆ భారాన్ని ఎలా భరించాలి?, అన్న వివరాలను ఒకటి, రెండు రోజుల్లోగా తనకు అందజేయాల్సిందిగా కీలక శాఖల ముఖ్య కార్యదర్శులకు సీఎం బాధ్యతలు అప్పగించారు. ఆ తర్వాతే ప్రధానికి లేఖ రాస్తానని తెలిపారు.

మొదటి నుంచీ గట్టిగానే వాదించాం...

ప్రజలకు ఉపయోగపడే ప్రాజెక్టులు, నిర్మాణంలో ఉన్న వాటిపై జీఎస్టీ విధించవద్దని రాష్ట్రప్రభుత్వం తరపున మొదటి నుంచీ కేంద్రంతో గట్టిగానే వాదిస్తున్నామని సీఎం కేసీఆర్ వెల్లడించారు. ఢిల్లీలో జీఎస్టీ కౌన్సిల్ సమావేశం జరిగినప్పుడల్లా ఈ అంశంపై కేంద్రానికి పదేపదే విజ్ఞప్తి చేశామన్నారు. అంతేకాకుండా ప్రధానిని కలిసిన ప్రతి సందర్భంలోనూ చర్చించామన్నారు. తెలంగాణ రాష్ట్రం పట్టుబట్టిన ఫలితంగానే ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులపై ఉన్న జీఎస్టీని 18 నుంచి 12 శాతానికి తగ్గించారని పేర్కొన్నారు. అయినప్పటికీ రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై రాజీపడే ప్రసక్తే లేదన్నారు. కాళేశ్వరం, పాలమూరు, సీతారామ లాంటి నీటి పారుదల ప్రాజెక్టులు ఏడాది, రెండేళ్ళ కిందటే ప్రారంభమయ్యాయని అన్నారు. మిషన్ భగీరథ ప్రాజెక్టు రెండేళ్ళ క్రితం మొదలు పెట్టామని, మొదటి దశ పనులను స్వయంగా ప్రధానే ప్రారంభించారని చెప్పుకొచ్చారు. యాదాద్రి, భద్రాద్రి పవర్ ప్రాజెకట్‌లు కూడా ఎప్పుడో ప్రారంభమైనవేనని వెల్లడించారు.

డబుల్ బెడ్‌రూం పథకంలో గృహ నిర్మాణాలు ప్రారంభమై కూడా రెండేళ్ళు అవుతుందన్నారు. మధ్యలో ప్రవేశపెట్టిన జీఎస్టీకి, ఈ అభివృద్ధి పనులకు ఎలా సంబంధం ఉంటుందో తనకు మాత్రం అర్థం కావడం లేదన్నారు. ఇదే అంశాన్ని ప్రధానితో వివరించి ఒప్పించేప్రయత్నం చేస్తానని కేసీఆర్ ధీమా వ్యక్తం చేశారు. కొన్ని ఆర్థిక సంస్థల సహకారంతో తలపెట్టిన అభివృద్ధి ప్రాజెక్టులకు జీఎస్టీ భారం విధించడం ఏ కోణంలో చూసినా న్యాయం కాదన్న విషయాన్ని స్పష్టం చేస్తానన్నారు.

ఇప్పుడున్న పరిస్థితుల్లో తెలంగాణ తరపున చేసే విజ్ఞప్తికి నరేంద్రమోడీ సానుకూలంగానే స్పందిస్తారన్న నమ్మకం తనకుందని, ఆ దిశగానే ప్రయత్నాలు చేద్దామని అధికార యంత్రాంగానికి భరోసా వ్యక్తం చేశారు. ఎంత నచ్చజెప్పినా వినిపించుకునే పరిస్థితి కనిపించని పక్షంలో తదుపరి ఏ విధంగా ముందుకు వెళ్ళాలన్న కోణంలో కార్యాచరణపై దృష్టి పెడతానని సీఎం కేసీఆర్ ఉన్నతస్థాయి సమీక్షలో వెల్లడించారు.

తిరుమలకు చేరిన వెంకయ్య

నేడు శ్రీవారి దర్శనం



పద్మావతి అతిథిగృహం వద్ద ఉపరాష్ట్రపతికి స్వాగతం పలుకుతున్న టీటీడీ ఈఓ, జేఈఓలు

తిరుమల, కెఎన్ఎన్: ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎన్నికైన వెంకయ్య నాయుడు శ్రీవారి దర్శనార్థం ఆదివారం రాత్రి తిరుమలకు చేరుకున్నారు. పద్మావతి అతిథిగృహం వద్దకు చేరుకున్న ఆయనకు టీటీడీ ఈవో అనిల్‌కుమార్‌సింఘాల్, తిరుమల జేఈవో శ్రీనివాసరాజు ఘనంగా స్వాగతం పలికారు. రిసెప్షన్ అధికారులు హరీంద్రనాథ్, లక్ష్మీనారాయణయాదవ్‌లు వసతి ఏర్పాట్లు చేశారు. రాత్రికి తిరుమలలోనే బసచేసి సోమవారం ఉదయం ఆయన శ్రీవారిని దర్శించుకోనున్నారు. ఈ సందర్భంగా పద్మావతి నగర్ ఆయన పర్యటించే ప్రాంతాలలో భద్రతను కట్టుదిట్టం చేశారు.

మహిళకు క్షమాపణ

(మొదటిపేజీ తరువాయి)

లారీ ఉంది. 1993 మే 18న జరిగిన రోడ్డు ప్రమాదంలో లోకేశ్వరన్ మరణించాడు. ఇన్సూరెన్స్ కంపెనీకి ఆమె దరఖాస్తు చేసుకుంది. సాంకేతిక కారణాలను సాకుగా చూపుతూ ఇన్సూరెన్స్ కంపెనీ క్లయిమ్‌ను తిరస్కరించింది. చివరకు ట్రిబ్యునల్‌ను ఆశ్రయించగా, రూ 3.47 లక్షల పరిహారం చెల్లించాలని ఉత్తర్వులిచ్చింది. దీనిని మద్రాస్ హైకోర్టులో ఇన్సూరెన్స్ కంపెనీ సవాల్‌చేసింది.ఆ అప్పీల్‌ను తోసిపుచ్చిన హైకోర్టు జడ్జి.. బాధిత మహిళకు నాలుగు వారాల్లో పరిహారం చెల్లించాలని తుది తీర్పునిచ్చారు.

జన బాహుళ్యంలోకి..

దేశ విభజన స్మృతులు



విభజన అనుభూతులపై ఓ వృద్ధుడిని ఇంటర్వ్యూ చేస్తున్న సునీతా సింగ్ భల్లా

న్యూఢిల్లీ: 1947 నాటి భారతదేశ విభజనకు సంబంధించిన భయానక, భావోద్వేగ స్వీయ అనుభవ కథనాల సంకలనం తొలిసారి ప్రజాబాహుళ్యంలోకి రాబోతున్నది. నాటి విభజనకు సాక్షీభూతంగా నిలిచిన, సమకాలీకులైన వారి అనుభూతులను ఇంటర్వ్యూల ద్వారా క్రోడీకరించి ప్రత్యేక సంచికను రూపొందించారు. దీనిని ఆగస్టు 10న స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ లైబ్రరీ డిజిటల్ రెపోసిటరీలో అంతర్జాలం వేదికగా విడుదల చేయనున్నట్లు అమెరికాకు చెందిన సునీతా సింగ్ భల్లా ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. స్వాతంత్ర్యం సిద్ధించి 70 ఏళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో భల్లా రూపొందించించిన చారిత్రక కళాఖండానికి ప్రత్యేకత చోటుచేసుకుంది. విభజన చరిత్ర సేకరణ వ్యవస్థాపకురాలైన భల్లా మాట్లా డుతూ, నాటి స్మృతులు బహిర్గతం చేయడం అన్నది చాలా సున్నితమైన అంశం. పరిశోధకులు, ఔత్సాహికులు ఎంపిక చేసిన యూనివర్సిటీ లైబ్రరీల సహకారంతో ఈ భారత్- పాకిస్తాన్ విభజన కథనాలను అధ్యయనం చేయవచ్చు. ఇండియాలో అశోకా యూనివర్సిటీ, ఢిల్లీ, గురునానక్ దేవ్ యూనివర్సిటీల్లో అందుబాటులో ఉంటుంది. అలాగే పాక్ లోని లాహోర్ యూనివర్సిటీ ఆఫ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్, హబిబ్ యూనివర్సిటీగ్రంథాలయాల్లో విభజన స్మృతులను నెమరువేసుకోవచ్చు. ఈ చారిత్రక సంకలనంలో 4300 మంది ఇంటర్వ్యూలు, 30 వేలకు పైచిలుకు డిజిటల్ డాక్యు మెంట్లు, ఫొటోలు ఉన్నాయి. వీటిని 12 దేశాలు, 22 భాషల్లో వీటిని సేకరించడం జరిగింది' అని చెప్పారు. దక్షిణాసియాలో ఏదైనా అంశంపై అతిపెద్ద మౌఖిక చారిత్రక సంకలనం ఉందంటే ఇది భారత విభజన కథనాలదేనని సునీతా సింగ్ భల్లా చెప్పారు. ప్రపంచంలోని వీడియో ఆధారిత మౌఖిక చారిత్రక భాండాగారాల్లోనూ ఇదే అతిపెద్దదని పేర్కొన్నారు. మొత్తం 10వేల మంది సాక్షుల ఇంటర్వ్యూలను రికార్డు చేయాలన్నది తన అంతిమ లక్ష్యమని భల్లా తెలిపారు. 'ఇన్నేళ్ల మాకృషిని జనబాహుళ్యంలోకి విడుదల చేస్తున్నందుకు మేమెంతో సంభ్రమాశ్చర్యానికి గురవు తున్నాం. దీంతో మన అమూల్య చరిత్రను తెలుసుకునే వెసులు బాటు లభిస్తుంది' అని భల్లా చెప్పారు. ఈ ప్రాజెక్టు అద్భుతం. చారిత్రక రికార్డులకు ఇది ఎంతో ప్రాధాన్యమైంది. లోతైన అన్వేషణకు, అధ్యయనానికి ఇదొక రెడీమెడ్ కళాఖండం అని స్టాన్‌ఫోర్డ్ లైబ్రేరియన్ మిఖీల్ కెల్లర్ అభిప్రాయపడ్డారు. ఈ పైలెట్ ప్రాజెక్టుకు భారత్‌లో టాటా ట్రస్టు సహకారం అందిస్తున్నది. దేశ విభజనపై మౌఖిక చారిత్రక ఆధారంలో ఇదే మొట్టమొదటి ప్రామాణికం అవుతుందని టాటా ట్రస్టు ఆర్ట్స్ అండ్ కల్చరల్ విభాగం అధినేత దీపికా సొరాబ్జీ అభిప్రాయపడ్డారు.

రెండు జిల్లాల పేర్లు మార్పు?

(మొదటిపేజీ తరువాయి)

జిల్లాలను ఏర్పాటు చేయాలన్న నిర్ణయానికి ప్రభుత్వం వచ్చినట్లు సమాచారం. పేర్ల మార్పుకు సంబంధించి వారం పదిరోజుల్లో అధికారిక నిర్ణయం వెలువడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ రెండు జిల్లాల పేర్ల మార్పుతో పాటు కొత్త జిల్లాలలో సరిహద్దులు, మండలాలు, రెవెన్యూ డివిజన్‌ల ఏర్పాటుపై కూడా ప్రభుత్వం చర్చిస్తున్నట్లు సమాచారం. రాష్ట్రంలో ఇప్పటికే కొత్త జిల్లాలను ఏర్పాటు చేయడంతో పాటు వాటి పేర్లను నిర్ణయించి అధికారిక ఉత్తర్వులను వెలువరించిన సంగతి తెలిసిందే.కొత్త జిల్లాలు ఏర్పాటై దాదాపు 11 నెలలు పూర్తవుతోంది. అయితే, వరంగల్ రూరల్, అర్బన్ జిల్లాల ఏర్పాటుపై వివాదం ఇంకా రాజుకుంటూనే ఉంది. రూరల్ జిల్లా కేంద్రం ఏర్పాటుపై పరకాల, వర్ధన్నపేట, నర్సంపేట నియోజకవర్గాలకు చెందిన నేతలు ఎవరికి వారే తమ నియోజకవర్గాల్లో జిల్లా కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు ఇదివరకే సీఎం కేసీఆర్.. డిప్యూటీ సీఎం కడియం శ్రీహరిని కలిసి తమ డిమాండ్‌ను వారి ముందు ఉంచారు. కొత్త జిల్లాల ఏర్పాటులో వరంగల్ జిల్లాను ఐదు జిల్లాలుగా ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. జనగాం, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్ అర్బన్, రూరల్ జిల్లాలు ఏర్పాటయ్యాయి. తొలుత వరంగల్ నగరాన్ని రెండుగా విభజిస్తూ వరంగల్ తూర్పు నియోజకవర్గాన్ని వరంగల్ జిల్లాలోని పశ్చిమ నియోజక వర్గాన్ని వరంగల్ అర్బన్ జిల్లాలో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీనిపై మొదట్లో జిల్లా నేతలలో అభిప్రాయభేదాలు తలెత్తాయి. తర్జనభర్జన అనంతరం ప్రభుత్వం వరంగల్ అర్బన్, రూరల్ జిల్లాలను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులిచ్చింది. పరకాల, వర్ధన్నపేట, నర్సంపేట నియోజకవర్గాలను వరంగల్ రూరల్ జిల్లాలో చేర్చడంతో తీవ్ర నిరసన వ్యక్తమైంది. ముఖ్యంగా పరకాల నియోజకవర్గం నేతలు ఈ ప్రతిపాదనను తిరస్కరించారు. రూరల్ జిల్లాను పరకాల కేంద్రంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వరంగల్ రూరల్ జిల్లా కేంద్రం ఎక్కడ ఏర్పాటు చేయాలన్న అంశంపై ఇంకా స్పష్టత రాలేదు. దీనిపై ఇంకా ఆందోళనలు జరుగుతూనే ఉన్నాయి. నర్సంపేట, వర్ధన్నపేట, పరకాల వంటి ప్రాంతాలలో జిల్లా కేంద్రాన్ని కోరుతూ నేతలు ఉద్యమిస్తున్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గాన్ని వరంగల్ రూరల్ జిల్లాలో కలిపి పాతపేరు వచ్చేలా వరంగల్ జిల్లాగా మార్చాలని సీఎం కేసీఆర్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ జిల్లా కేంద్రాన్ని గతంలో ఉన్న అజంజాహి మిల్స్ ప్రాంతంలో ఏర్పాటు చేయాలని కేసీఆర్ ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ మేరకు రెవెన్యూశాఖ ఉన్నతాధికారులకు మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. వరంగల్ అర్బన్ జిల్లాను నియోజకవర్గం, సరిహద్దు సైతం మార్చేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు సమాచారం. హన్మకొండకు ఉన్న చరిత్ర, ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని హన్మకొండ పేరుతో జిల్లాను ఏర్పాటు చేయాలన్నది ముఖ్య మంత్రి మదిలో ఉన్నట్లు పార్టీ నేతలు చెబుతున్నారు. చారిత్రక అంశాలు, పార్టీకి చెందిన ముఖ్య నేతలు, ముఖ్యుల అభిప్రాయాలను తెలుసుకుని హన్మకొండ జిల్లాను ప్రకటించాలన్న నిర్ణయానికి కేసీఆర్ వచ్చినట్లు చెబుతున్నారు. వరంగల్ ఈస్ట్, నర్సంపేట, వర్ధన్నపేట, పరకాల నియోజకవర్గాలను కలిపి వరంగల్ జిల్లాగా, వరంగల్ వెస్ట్, స్టేషన్ ఘన్‌పూర్‌తో సహా కొన్ని మండలాలు, కరీంనగర్ జిల్లాలోని కొన్ని గ్రామాలు, మండలాలను విలీనం చేసుకుని హన్మకొండ జిల్లాగా ఏర్పాటు చేసే ప్రతిపాదనపై కేసీఆర్ ఇప్పటికే పలు దఫాలు కసరత్తు చేసినట్లు చెబుతున్నారు. ఈ నెలాఖరులోపు ఈ రెండు జిల్లాల పేర్లు మారుస్తూ ఓ ప్రకటన వెలువడే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. మరోవైపు కొత్త జిల్లాలు ఏర్పాటు చేయాలన్న అంశంపై రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలలో ఉద్యమాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. కొత్తగా జిల్లాల పేర్లు మారుస్తుండటంతో తిరిగి ఈ ఉద్యమాలను ఉధృతం చేయాలన్న ఆలోచనతో వారు ఉన్నట్లు తెలుస్తోంది.

సిబ్బంది లేరు.. సౌకర్యాలూ లేవు!

పాలిటెక్నిక్ కాలేజీల దీనావస్థ

- 1100 అధ్యాపక పోస్టులు ఖాళీ
- 14 కొత్త కాలేజీలకు సిబ్బంది కేటాయింపే లేదు
- 11 కాలేజీలకు సొంత భవనాలు అసలే లేవు
- వసతి గృహాలు లేని కాలేజీలు 32
- ల్యాబ్ సౌకర్యం లేని కాలేజీలు 15
- 460 మంది కాంట్రాక్ట్ లెక్చరర్ల కొనసాగింపు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలు సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్నాయి. పాలిటెక్నిక్ కాలేజీలతో పాటు, ఇంజనీరింగ్ కాలేజీల్లో నైపుణ్యంతో కూడిన విద్యను అందించేలా చూడాలని ఆదేశించింది. ఉపాధి వచ్చే కోర్సులను పాలిటెక్నిక్‌తోపాటు, ఇంజనీరింగ్‌లోనూ, డిగ్రీలోను ప్రవేశ పెట్టేలా చూడాలని ప్రభుత్వం సూచించింద. ప్రధానంగా పాలిటెక్నిక్ కాలేజీలను పరిశ్రమలతో అనుసంధానం చేసి కోర్సు ముగిసిన వెంటనే ఉపాధి అవకాశాలు లభించేలా చూడాలని ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు పాలిటెక్నిక్ కాలేజీలు పరిశ్రమలతో అనుసంధానం కావాలని ఆదేశించింది కూడా. అయితే ప్రభుత్వం ఇంత చెబుతుండగా ప్రభుత్వ పాలిటెక్నిక్‌ల్లో వాస్తవ పరిస్థితులు ఇందుకు విరుద్ధంగా ఉన్నాయి. రాష్ట్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో చాలా సమస్యలు ఉన్నాయి.

1100 పోస్టులు ఖాళీలు

రాష్ట్రంలో 55 ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలు, మరో రెండు ఎయిడెడ్ కాలేజీలు ఉన్నాయి. కాలేజీలు నడవాలంటే ప్రధానంగా బోధన, బోధనేతర సిబ్బంది ఉండాలి. కానీ రాష్ట్రవ్యాప్తం గా ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో బోధన, బోధనేతర సిబ్బంది కలిపి సుమారు 1100పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిలో 686 మంది సిబ్బంది ఖాళీలు ఉండగా మంజూరైన పోస్టుల్లో 353 మంది బోధనా సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 2012-13లో ప్రారంభమైన రెండు

మంజూరు చేయబడిన పోస్టుల ఖాళీల వివరాలు			
పోస్టులు	**మంజూరు**	**పనిచేస్తున్నవారు**	**ఖాళీలు**
ప్రిన్సిపాల్స్	49	26	23
విభాగాధిపతులు	180	95	85
సీనియర్ అధ్యాపకులు	204	204	-
అధ్యాపకులు	880	635	245
మొత్తం	1313	960	353

ప్రభుత్వ పాలి టెక్నిక్‌లతోపాటు 2013-14 సంవత్సరంలో ప్రారంభమైన 12 కాలేజీల్లో బోధనా సిబ్బందిని ప్రభుత్వం ఇప్పటి వరకు మంజూరు చేయలేదు. ఈ కాలేజీల్లో 320 మంది బోధనా సిబ్బంది అవసరం ఉంటారని అధికారులు లెక్కలు వేశారు. అలాగే వీటిలో 150 మంది ప్రయోగశాల సాంకేతిక నిపుణులు అవసరం ఉంటారని అధికారులు స్పష్టం చేశారు. 14 కొత్త కాలేజీల్లో సిబ్బంది కోసం గత మూడేళ్లుగా అధికారులు ప్రభుత్వానికి లేఖలు రాస్తున్నప్పటికీ ఇప్పటి వరకు వాటిని మంజూరు చేయలేదు.

రాష్ట్రంలోని 14 కొత్త కాలేజీలకు 320 మంది బోధనా సిబ్బంది పోస్టులు మంజూరు కావల్సి ఉంది. బోధనేతర సిబ్బంది మొత్తంగా 686 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్రంలో 460 మంది కాంట్రాక్ట్ లెక్చరర్లు పనిచేస్తున్నారు.

15 పాలిటెక్నిక్‌లలో ప్రయోగ శాలలు లేవు

రాష్ట్రంలోని 55 పాలిటెక్నిక్ కాలేజీల్లో 15 కాలేజీల్లో ప్రయోగశాలలు లేవు. 26 కాలేజీల్లోని ప్రయోగశాలలు పరికరాలు లేకుండా వెల వెలబోతున్నాయి. అంతే కాకుండా 11 కాలేజీలకు సొంత భవనాలు లేకపోగా... 32 కాలేజీలకు వసతి గృహాలు లేవు. 25 పాలిటెక్నిక్ కాలేజీల్లో అదనపు మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఉంది. 11 కాలేజీల్లో గ్రంథాలయాలు కూడా లేకుండానే కొనసాగుతున్నాయి.

గొర్రెను కాపాడబోయి...

(మొదటిపేజీ తరువాయి)

తిరిగి తమస్వస్థలాలకు వెళ్తున్నారు. మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో మక్తల్ మండలం కాచ్‌వార్ వద్ద రహదారిపై గొర్రెలు అడ్డుగా ఉండటంతో ఓ గొర్రెను తప్పించబోయిన ఆటో డ్రైవర్ హైదరాబాద్ వైపు నుంచి మక్తల్‌వైపు వస్తున్న లారీ ఢీని డీకొట్టాడు. ఆటోలో ప్రయాణిస్తున్న గూని హన్మంతు (65) (మాదన్‌పల్లి), జమ్మనోళ్ళ రాములు (65)(మాదన్‌పల్లి), ఆటో డ్రైవర్ మ్యాకలిచిన్న కుర్మయ్య(35)(మాదన్‌పల్లి) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. తీవ్రగాయాలపాలైన వెంకటయ్య(70) (జక్లేర్)ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే కన్నుమూశారు. ఈ సంఘటనలో జక్లేర్ చెందిన అనూష(25), ఊట్కూర్ మండలం పులిమామిడికి చెందిన దత్తు(32), పద్మ(45), మక్తల్ మండలం బొందలకుంటకు చెందిన జయమ్మ(50), జక్లేర్‌కు చెందిన నర్సమ్మ(55)లు తీవ్ర గాయాలపాలయ్యారు. వీరిని చికిత్స నిమిత్తం మక్తల్ ఆస్పత్రికి తరలించారు. జయమ్మ, నర్సమ్మల పరిస్థితి విషమంగా ఉండటంతో మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో ప్రాణాలొదారు. ఆదివారం సంత కావడంతో ప్రమాదం విషయం తెలిసిన వెంటనే పెద్దఎత్తున చుట్టుప్రక్కల ప్రాంతాల ప్రజలు సంఘటన స్థలానికి రావటంతో ఆ ప్రాంతమంతా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.. సంఘటన స్థలం వద్ద, ఆస్పత్రి వద్ద మృతులు, క్షతగాత్రుల బంధువుల రోదనలతో మారుమోగింది.

రోడ్డెక్కిన రైతన్న

ఎస్సారెస్పీ నీటికోసం వందలాది మంది రాస్తారోకో



జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న రైతులు

నిజామాబాద్, కెఎన్ఎన్ బ్యూరో: శ్రీరాంసాగర్‌ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువ ఎస్కేప్ గేట్ల ద్వారా నీటిని విడుదల చేయాలని కోరుతూ గోదావరి నది ఆయకట్టు గ్రామాల రైతులు ఆదివారం చాకిర్యాల్ ఎక్స్‌రోడ్ జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. చాకిర్యాల్, కొడిచెర్ల, సావెల్, తడ్‌పాకల్, దోంచంద, గుమ్మిర్యాల్ గ్రామాలకు చెందిన వందలాది మంది రైతులు జాతీయ రహదారికి చేరుకొని రాస్తారోకో నిర్వహించారు. వెంటనే నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పంటలు ఎండిపోతున్నాయని, 100 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేసి పంటలను గట్టెంక్కించాలని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఆర్మూర్ డీఎస్పీ శివకుమార్ పోలీసు బలగాలతో రాస్తారోకో వద్దకు చేరుకొని రైతులతో మాట్లాడారు. అధికారుల వద్దకు తీసుకువెళ్లి సమస్య గురించి వివరిద్దామని, రాస్తారోకో చేయడం వల్ల ప్రయాణికులకు ఇబ్బందవుతుందని సూచించారు. తమకు న్యాయం జరిగే వరకు రాస్తారోకో విరమించేదిలేదని రైతులు భీష్మించుకొని కూర్చున్నారు. అప్పటికే ఎంపీ కవిత సీఎం సభ స్థలి ఏర్పాట్లను పరిశీలించేందుకు రావడంతో ఎంపీని కలిసి తమ సమస్యను వివరిద్దామని తరలివెళ్లారు. పోలీసులు అందరిని కాకుండా రైతు ప్రతినిధులను మాత్రమే ఎంపీ కవితను కలిసేందుకు అనుమతించారు. అధికారులతో మాట్లాడి గోదావరి నదిలోకి నీటిని విడుదల చేయాలని, పంటలు ఎండిపోతున్నాయని, వేలాది రూపాయలు ఖర్చు అయ్యాయని విన్నవించారు.

ఆంధ్రప్రభ సారస్వత వేదిక

సాహితీగవాక్షం

కవిత్వం ఎలా ఉండాలి?

ఇవాళ వచన కవిత్వం ఎవరైనా రాయవచ్చు. ఓటున్న ప్రతి ఒక్కరు ఏ కులం వారైనా మతం వారైనా ఎలా ఓటు హక్కును కలిగిఉంటారో... అన్ని కులాల వారికి కవిత్వం రాసే హక్కుందని గుర్తించాలి. కాకపోతే వస్తువు ఏది? అన్నది ఎవరికి తోచిన విధంగా వారు ఎంపిక చేసుకోవచ్చు. అందుకే షాక్‌లోవిస్కీ అన్న రష్యన్ రూపవాది ఆర్ట్ వజ్ ఆల్వేస్ ఫ్రీ ఆఫ్ లైఫ్ అన్నారు.

ఇవాళ దాదాపు అందరు కవులూ వచన కవితలు రాస్తున్నారు. పద్యం తెలుగు వారికి మాత్రమే సొంతమైన కవిత్వ ప్రక్రియారూపం. అయినా... మారిన దేశకాల పరిస్థితుల దృష్ట్యా ఇప్పుడు ప్రతి కవి వచన కవితలు రాస్తున్నారు. వచన కవితను ఆంగ్లంలో ఫ్రీ వెర్స్ అంటారు. 20వ శతాబ్దం ప్రారంభం నుండే వచన కవిత బాగా ప్రచారంలోకి వచ్చింది. అయితే 1880 లోనే ఫ్రాన్స్ దేశంలో వాల్ట్ వైట్‌మేన్ లాంటి ప్రయోగ వాదులు వచన కవిత్వానికి ఒక రూపమిచ్చారు. ఇకపోతే వచన కవిత్వంలో వస్తువు ఏది ఉండాలి? రూప నిర్మాణం ఎలా ఉండాలి? అసలు కవితా సామాగ్రి ఏది? వచన కవితలను కొందరు పద్యాలంటారు. మరికొందరు వచన కవితలే అంటారు. ఏమిటీ గందరగోళం అని చాలామంది యువకవులు నన్ను అడుగుతుంటారు. నిజమే... వచన కవితను కోవెల సంపత్కుమారాచార్య వచన పద్యం అన్నారు. అయితే చే.రా. గారు మాత్రం వచన కవిత్వమే అనాలన్నారు. పద్యానికి వచన కవితకు తేడాలు యువకవులు గుర్తించాలి. 1. పద్యంలో యతులు ప్రాసలు ఛందస్సు ఉంటుంది. వచన కవితకు అవి అక్కరలేదు. 2. పద్యంలో గణవిభజన ఉంటుంది.. వచన కవితకు అది అక్కరలేదు. 3. పద్యపాదాల్లో అక్షరరమ్యత ఉంటుంది. వచన కవితలో ఉండాలన్న నియమం లేదు. 4. పద్యంలో శబ్దాలంకారాలు అర్థాలంకారాలు ఉంటాయి. వచన కవితలను భావంతోనే నిర్మించవచ్చు. 5. పద్యాల్లో శబ్ద చిత్రణ ముఖ్యం. వచన కవితలో శబ్ద చిత్రణ అంతరించింది. 6. పద్యాలు ఫ్యూడల్ వ్యవస్థకు చిహ్నం. వచన కవిత ఆధునిక సమాజానికి ప్రతిబింబం. 7. పద్యాలు అవధానాల కాలం వేరు. వాటి లక్ష్యం వేరు. వచన కవిత ప్రయోజనం వేరు. 8. వచన కవితను పద్యంలాగ రాయాలని ప్రయత్నించరాదు. పాదాల నియతి వచన కవితకు లేదు. 9. పద్యం గొప్పదని పద్యం రాసినవాడే గొప్ప కవి అన్న భ్రమ నుండి యువకవులు బయటపడాలి. 10. రసధ్వని అలంకారాలు చంధస్సుల లాంటి పద్యకవితా సామాగ్రి జోలికి వచన కవులు వెళ్ళకండి. 11. పద్యకావ్యాలు ప్రబంధాలు వల్లిస్తూ వచన కవులను విమర్శించేకావ్య విమర్శకుల అడకమిక్ అహంకారుల మాటలను వచన కవులు పట్టించుకోవాల్సిన అవసరం లేదు. ఇవాళ వచన కవిత్వం ఎవరైనా రాయవచ్చు. ఓటున్న ప్రతి ఒక్కరు ఏ కులం వారైనా మతం వారైనా ఎలా ఓటు హక్కును కలిగి ఉంటారో... అన్నికులాల వారికి కవిత్వం రాసే హక్కుందని గుర్తించాలి. కాకపోతే వస్తువు ఏది? అన్నది ఎవరికి తోచిన విధంగా వారు ఎంపిక చేసుకోవచ్చు. అందుకే షాక్‌లోవిస్కీ అన్న రష్యన్ రూపవాది ఆర్ట్ వజ్ ఆల్వేస్ ఫ్రీ ఆఫ్ లైఫ్ అన్నారు. వచన కవితలు రాసే కవులు ముఖ్యంగా యువకవులు దేని గురించి కవిత్వం రాయాలో దేని గురించి రాయకూడదో కొందరు కుహనా మేధావులు సలహాలిస్తుంటారు. వేదికలపై తమ అహంకారాన్ని ప్రదర్శిస్తూ యువకవుల హృదయాలను గాయపరుస్తుంటారు. ప్రేమ, దోమ గురించి రాయకూడదని, విప్లవం అభ్యుదయం గురించే రాయాలని.. కుల మతాల గురించి.. రాసినా వాటిని హేళన చేసే విధంగా రాయకూడదని.. దేశభక్తి.. రాజభక్తి.. ప్రభుభక్తి.. గురించి రాయాలని ఎవరైనా చెప్పితే వినాల్సిన అవసరం లేదు. యువకవులు వస్తువు ఎంపిక పట్ల స్వతంత్రంగా ఆలోచించుకోవచ్చు. దేనిపైన అయినా కవిత రాయవచ్చు. భావ ప్రకటనా స్వేచ్ఛ ప్రతి కవికీ ఉందని గుర్తించండి. కవికి తాను కవిత రాయబోయే వస్తువు పవిత్రమైనది. ఎవరు ఏ వస్తువు (కంటెంట్)పై కవితలు రాసినా అందరూ ఆహ్వానించాల్సిందే... మొదట్లో రాయప్రోలు, గురజాడ లాంటి కవులు దేశభక్తి గురించి రాశారు. కృష్ణశాస్త్రి, వేదుల, అబ్బూరి లాంటివాళ్లు భావ కవిత్వం రాశారు. శ్రీశ్రీ, ఆరుద్ర, రెంటాల, సోమసుందర్ లాంటి కవులు అభ్యుదయ కవిత్వం రాశారు. సి.నా.రె, తిలక్ లాంటి కవులు మానవతావాదం గురించి రాస్తే... శేషేంద్ర నుండి కె.శివారెడ్డి వరకు.. విప్లవ కవితలు రాశారు. స్త్రీవాద దళిత ముస్లింవాద కవులు వస్తు వైవిధ్యంతో వారి వారి అస్తిత్వ కవిత్వాలు రాస్తూ వచ్చారు. ఇప్పుడు ప్రపంచీకరణ నేపథ్యంలో సామాజిక ఆర్థిక రాజకీయ సాంస్కృతిక రంగాల్లో, జీవన విధానాల్లో వచ్చిన అనూహ్యమైన మార్పుల నేపథ్యంలో కవులు ఎన్నుకునే వస్తువుల్లో కూడా మార్పులొచ్చాయి. పల్లె కన్నీరు పెడుతుందో కనిపించని కుట్రల అంటూ గోరటి వెంకన్న అన్నది వస్తువును గురించిన రహస్యం బయట పెట్టడానికి.. విలువలన్నీ పతనమవ్వడానికి కారణం ఏమిటో కవులు కారణాలను అన్వేషించాలి. వ్యవస్థలో దోపిడీ ఎన్ని రకాలుగా జరుగుతుందో యువకవులు గుర్తించాలి. కవిత్వంలో లోతైన భావాలు బలమైన అభివ్యక్తితో ఆవిష్కరించడానికి ప్రయత్నించాలి. కవికి పరిశీలనా శక్తి పరిశోధనపై అనురక్తి ఎంతో అవసరం... అయితే కవితా వస్తువు ఎంపిక పట్ల యువ కవులు కాస్త జాగ్రత్తగా ఉండాలి.

1. కవి ఎంచుకునే వస్తువు.. ఆత్మాశ్రయమా? వస్త్వాశ్రయమా? అన్నది గుర్తించాలి. 2. వస్తువు ఎంపికలో శాస్త్రీయత ఉన్నదా? అని ఆలోచించాలి. 3. వస్తువు కవితారూపానికి తగినదా కాదా? అని ఆలోచించాలి. 4. రామాయణాన్నే మళ్లీ మళ్ళీ రాసినట్టు ఎవరో రాసిన వస్తువునే ఎంచుకోవాలా? యోచించండి. 5. కళ్ల ముందు ఎన్నో వస్తువులు ఉండగా.. విదేశీ వస్తువులు అవసరమా? 6. కవులకు తెలిసిన వస్తువు... సంబంధమున్న వస్తువును ఎన్నుకోవడం ఉత్తమం. 7. ఎవడి పిచ్చి వాడి కానందమన్నట్టు ఒకే వస్తువును కవిత్వం చేయాలనుకోకూడదు. 8. కవి ఎంచుకునే వస్తువుకు రూపానికి జత కుదిరే విధంగా ఉండాలి. 9. వస్తువైవిధ్యం ఉన్న రచనలు కవికి గుర్తింపు తెస్తాయి. 10. ఎవరూ రాయని కొత్త వస్తువుపై కవిత రాస్తే కవికి ప్రత్యేక

కవిత్వం-డిక్షన్-2

గుర్తింపు లభిస్తుంది. కనుక యువకవులు తాము రాయబోయే కవితా వస్తువు (కంటెంట్ ఆఫ్ పోయమ్) ఎంపిక పట్ల అప్రమత్తులై ఉండాలి. ఒక్కోసారి కొన్ని దృశ్యాలను, వ్యక్తులను, సందర్భాలను, బట్టి కూడా స్పందిస్తూ కవితలు రాస్తుంటారు.. అది తరచుగా జరిగే అనివార్య వస్తువు ఎంపికగా మనం భావించవచ్చు. శ్రీశ్రీ మహాప్రస్థానంలో భిక్షువర్షీయసి కవితలో ఒక ముసలమ్మ వస్తువు కావడంతో ఆ కవితకు ఎనలేని కీర్తి వచ్చింది. అయితే శీర్షికలో ముసలమ్మ అనే పదం లేదు. కవిత్వపు నడకలో ముగ్గుబుట్ట వంటి తల, ముడతలు దేరిన ముఖం,కాంతి లేని గాజుకళ్లు.. ఇలాంటి పోలికలన్నీ కొత్తగా ఉండటం... ముసలమ్మ రూపం కళ్లముందు సాక్షాత్కరించే ఇమేజరీని శ్రీశ్రీ క్రియేట్ చేయడం.. అదంతా కవితా నిర్మాణానికి చెందిన టెక్నిక్.. వస్తువు మాత్రం.. దారి పక్క చెట్టుకింది.. ముసలవ్వ మాత్రమే.. కాని.. ఆయన తర్వాత ముసలమ్మపై ఎందరో ఎన్నో కవితలు రాశారు.కాని .. అవన్నీ భిక్షువర్షీయసీని డామినేట్ చేయలేకపోయాయి. అలా కొత్త కవులు కూడా కొత్త వస్తువులపై దృష్టి సారించాలి. ఇటీవల పేపర్ బాయ్ మీద చాలా మంది కవితలు రాశారు. హైదరాబాద్‌కు చెందిన మోహన్ కృష్ణ తెనాలికి చెందిన నాగలక్ష్మి ఇద్దరూ పేపర్ బాయ్ మీద రాసిన కవితలు ఒకే విధంగా ఉండటం నాకు ఆశ్చర్యమనిపించింది. బహుశ ఒకరి కవితలు మరొకరు చదవకపోవడమే ఇందుకు కారణం. కనుక యువకవులు కనిపించిన ప్రతి కవితా సంపుటిని చదివితే ఎవరెవరు ఏ ఏ వస్తువులపై కవితలు రాశారో తెలుస్తుంది. అందరూ అందరి కవుల కవిత్వాన్ని చదవక పోయినా కనీసం ఈ కింది కవుల కవితా సంపుటాలు చదవాల్సిన అవసరం ఉంది.

1. శ్రీశ్రీ.. మహాప్రస్థానం.. మరో ప్రస్థానం.. వీలైతే ఖడ్గసృష్టి. 2. తిలక్ అమృతం కురిసిన రాత్రి. 3. కుందుర్తి నా తెలంగాణ, 4. ఆలూరి బైరాగి.. నూతిలో గొంతుకలు, 5. రెంటాల.. సర్పయాగం, 6. ఆరుద్ర.. త్వమేవాహం, 7. దాశరథి.. అగ్నిధార.. రుద్రవీణ, 8. సి.నా.రె... విశ్వంభర. 9. గుంటూరు శేషేంద్ర శర్మ.. నా దేశం నా ప్రజలు, 10. కె.శివారెడ్డి.. మోహనా.. మోహనా, 11.డా.ఎన్.గోపి.. కాలాన్ని నిదుర పోనివ్వరు. 12. అజంతా స్వప్న లిపి.

ఇంకా ఇస్మాయిల్ చెట్టునాకు ఆదర్శం, మో కవిత్వం, దేవిప్రియ అమ్మ చెట్టు, ప్రసాదమూర్తి నాన్న చెట్టు, శిఖామణి నల్లగేటు నందివర్ధనం, మువ్వా శ్రీనివసరావ్ .. సమాంతర ఛాయలు, బిక్కి కృష్ణ కాలం నది ఒడ్డున, వర్ధమాన కవులు మెర్సీ మార్గరేట్.. మాటల మడుగు, బాల సుధాకర్ మౌళి, ఎగరాల్సిన సమయం (ఇంకా చాలామంది ఉన్నారు.. అందరినీ ఉదహరించలేను) మొదలైన కవితా సంపుటాలు చదివితే వస్తు వైవిధ్యం.. కవితా నిర్మాణ రహస్యాలు.. సరికొత్త ప్రతీకల వాడకం.. అభి వ్యక్తి నవ్యత, అద్భుత భావుకత మొదలైన విషయాలు తెలుస్తాయి. ఇక కవిత్వం-డిక్షన్‌లో వస్తువైవిధ్యంతో మంచి కవిత్వం రాస్తున్న ఆధునిక వచన కవుల్లో సామాజిక విధ్వంసక మూలాలెరిగిన కవి సరికొండ నరసింహ రాజు... అతడు ఒక విధ్వంసక ముఖచిత్రం, ఒకే ఒక్క సిరాచుక్క, భూస్వింహాసనం, చూపుడు వేలుపై సూర్యోదయం లాంటి కవితా సంకలనాలు వెలువరించాడు. ఆయన రాసిన చూపుడు వేలు కవితలోని వస్తువు శిల్పం రెండూ కొత్తవే.

బాల్యం మొక్క నేలను ముద్దాడుతూ వేసే బుడి బుడి అడుగులకు/ అమ్మా నాన్నల చూపుడు వేళ్లే తల్లి వేళ్ళు!/ బతుకు పలకమీద ఓనమాలు దిద్దించి/ గురువు చూపుడు వేలే దిక్కుల్లో చేయిపట్టి నడిపిన దివిటీ! / గుండె కూడలిలో చూపుడు వేలుపై ఉదయించిన/ఓ సూర్యోదయం/ స్వేచ్ఛా స్వాతంత్ర్యం కనకపుష్యరాగం పొదిగిన/ నా కవితాంగుళీయకం! అంటూ వస్తువైవిధ్యంతో శిల్పసోయగమైన కవితను శిల్పీకరించాడు ఈ కవిరాజు. బాల్యం మొక్క నేలను ముద్దాడుతూ వేసే బుడి బుడి నడకలు అన్నది కొత్త ఎక్స్‌ప్రెషన్. బతుకు పలక సరికొత్త పదబంధం. గురువు చూపుడు వేలు.. దివిటి... Simile ఎంత సహజంగా ఉందోకదా...

నేలమ్మ చూపుడువేలే చిలుకలు వాలని చెట్టై /ఆకుపచ్చ దారిన నడిపిస్తుంది! / ఆకాశం చూపుడు వేలే జలతారు కిరణాలై/ వెలుతురు జలపాతమవుతుంది!/ కవులు, చిత్రకారులచూపుడువేళ్ల/ కలాలు కుంచెలై సృజన శిరసెత్తి నినదిస్తుంది! అంటూ చూపుడు వేలును సింబల్ చేసి అనేక వస్తువులను (ఆకాశం, కవులు, చిత్రకారులు) సమ్మిళితం చేస్తూ.. ఒకానొక సత్యాన్ని కవితా రూపంలో అందంగా ఆవిష్కరించాడు రాజు. ఆకాశానికి ఒకచూపుడు వేలు ఉంటుందని ఎవరూ బహుశా ఊహించి ఉండరు. అంతటితో ఆగక దాన్ని వెలుతురు జలపాతంతో ఉపశమింపజేయడంలోనే కవి భావనా బలం అద్భుతంగా రాణించింది.


చూపుడు వేళ్ల సంతకాలు చల్లితే/ పిడికిళ్లు మొలకెత్తినట్టు../ ఒక చూపుడువేలు చూపేకదా/ బడుగు జీవికి మూడో కన్నును ఇచ్చింది!/ హక్కుల ఖడ్గాలతో/ తరతరాల చీకటి రాత్రుల గుండెల్ని చీల్చింది! అంటూ కవితను సింబాలిక్ ఎక్స్‌ప్రెషన్‌తో నిర్మిస్తూ వెళతాడు, చూపుడు వేళ్ల సంతకాలు ఎంత గొప్ప ప్రతీక.. అలాగే ఒక చూపుడు వేలు.. చూపు... (డా. అంబేద్కర్) బడుగుజీవికి మూడోకన్నును ఇచ్చింది అని చెప్పడం ఎంతో గొప్ప కవితాభివ్యక్తి. బడుగుజీవికి మూడో కన్ను ఎందుకు అవసరం అంటే అతను తరతరాలుగా చీకటిలో ఉన్నాడు... అంటే రెండుకళ్లు ఉన్నా.. వాటితో చీకటిని (దోపిడీని) చూస్తున్నా ఏం చేయలేని స్థితిలో ఇన్నాళ్లు బతికేశాడు. కాని ఇప్పుడు ఒక చూపుడు వేలు (డా.అంబేద్కర్) హక్కుల ఖడ్గాలు చీకటిరాత్రుల గుండెల్ని చీల్చింది అని అత్యంత ప్రతీకాత్మక.. ప్రతిష్టాత్మక.. ప్రగాఢమైన అభివ్యక్తితో ఓ చారిత్రక సత్యాన్ని కవితాత్మగా వ్యంజింపచేయడం ధ్వనిపూర్వకమైన అభివ్యక్తిగా కూడా భావించవచ్చు. కవిత ముగింపులో ఈ కవి ఎన్ని వస్తువుల్ని అందమైన ప్రతీకలతో అలంకరించి కవితను ముగించాడో చూడండి...

చూపుడు వేలుపై సిరా చుక్క/ చైతన్యం ఉత్ప్రేరకమై/ కోటానుకోట్ల హృదయాలను రగిలించింది/ ఛాయివాలాని ఎర్రకోటపై విజయపతాకగా ఎగుర వేసింది/ ..../ బాంచన్ దొర బతుకులను/ గులాబీలతో అభిషేకించింది/ పాంపేట్లర్ని ఎగరేసింది/ ఒక జాతి నుదుటిపై శిలాశాసనం చెక్కింది/ ప్రజాస్వామ్యాన్ని పూలరథంపై ఊరేగించింది/ నేడు ఓటుకు చూపుడువేలుపై గ్లోబు! అంటూ కవితకు చక్కని ముగింపునిచ్చాడు. నేడు ఓటుకు చూపుడువేలుపై గ్లోబు ...అనడంతో కవిత ముగింపుకే వస్తువు ఓ మెరుపు మెరిపించాడు, యువకవులు ఈ టెక్నిక్ గమనించాలి.. కవితకు ఎత్తుగడ ముగింపు చాలా ముఖ్యం. కొత్తగా కవితను ఎత్తుకోవాలి. మెరుపులా ముగించాలి. అసలు ఇలాంటి విస్తృతమైన వస్తువును కవితగా శిల్పీకరించడం చాలా కష్టం. ఎక్కడా బిగిసడలకుండా.. పతకంలో రాళ్లు పొదిగినట్టు ఇటుకపై ఇటుక ఒకే వరుసలో పేర్చినట్టు.. కవితను అల్లుకుపోవడం చాలా కష్టం. అందులోనూ అంబేద్కర్ చూపుడు వేలును సింబలైజ్ చేస్తూ.. చారిత్రక విద్రోహాల రహస్యాలను ఒకే కవితా పాదంలో ఇరికించడం మరీ కష్టం. అలాగే ఛాయ్ వాలా మోడీ... విజయం.. తెలంగాణా ఉద్యమ జయకేతనం ... నల్లచందమామ (ఒబామా)ను శ్వేత సౌధం శిగలో అలంకరించడం అనటం.. ఇవన్నీ... ఒకే కవితలో వస్తువు (కంటెంట్)కావటం.. ఆ విభిన్న అంశాల వస్తువును శిల్పశోభితం చేస్తూ కవితను నిర్మించడం సరికొంత రాజుకే సాధ్యమైంది.

అయితే ఇక్కడ ఓ విషయం గుర్తించాలి. చాలామంది గొప్ప కవులనబడే వారు, పాతకాలం నాటి పురాణాలు కావ్యాలు చదువుకుని ఇంకా ఆ కాలమే గొప్పదనుకుంటారు. ఆ కవులే మహాకవులనుకుంటూ చాంధసవాదులుగా బతికేస్తుంటారు. ఆధునిక కవిత్వంలో వస్తువు డిమాండును బట్టి కవి తన శిల్ప ప్రతిభతో భావనా బలంతో కవితను పెంచుకుంటూ పోతాడని తెలియని అకవులు, అల్పమతులు కవిత పొడుగై పోయిందని గగ్గోలు పెడుతుంటారు. అల్పాక్షరాలలో అనల్పార్థాన్ని సాధించాలంటూ (ఇది పద్యాలగురించి చెప్పినదని.. మరచిపోయి) వచనకవితలు అలా ఉండాలంటూ ఉచిత సలహాలిస్తారు అకడమిక్ అహంకారులు.. కువిమర్శకులు.. అయితే పచ్చినిజం ఏంటంటే.. కవి భావావేశంలో కొట్టుకుపోతూ ఓ విస్తృత వస్తువును అందమైన కవితా శిల్పంగా మార్చే క్రమంలో .. కవితను పొడిగించాల్సిన అనివార్యత ఏర్పడుతుంది. ఈ విషయం ఎందుకు గుర్తించరో మరి.. యువకవులన్నా గుర్తించి ఆచరిస్తారని.. ఆశిస్తున్నా.

(కొత్త కలాల కోసం - వచన కవితా నిర్మాణ పద్ధతులు)

- బిక్కి కృష్ణ
8374439053



సాహిత్య వార్తలు

సోమసుందర్ ప్రథమ వర్ధంతి సభ

సోమసుందర్ ప్రథమ వర్ధంతి సభ 13వ తేదీ సాయంత్రం ఆరుగంటలకు సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం, పిఠాపురం నందు జరుగుతుంది. ఈ సందర్భంగా సోమసుందర్ విగ్రహాన్ని డా॥యార్లగడ్డ లక్ష్మి ప్రసాద్ ఆవిష్కరిస్తారు. వర్ధంతి సభకు డా॥కె. వెంకటరావు అధ్యక్షత వహిస్తారు. ముఖ్య అతిథిగా డా॥యార్లగడ్డ లక్ష్మిప్రసాద్, ఆత్మీయ అతిథిగా డా॥చందు సుబ్బారావు, ప్రసంగకర్తలుగా సన్నిధానం నరసింహాశర్మ, వాడ్రేవు వరలక్ష్మీదేవి, శశికాంత్ శాతకర్ణి, గజరావు సీతారామస్వాములు పాల్గొంటారు. విజయ శేషేంద్ర శాతకర్ణి వందన సమర్పణ చేస్తారు,

విశాఖ జిల్లా కథా సాహిత్యం ఒకరోజు సదస్సు

సాహిత్య అకాడమి, విశాఖ సాహితి సంయుక్త ఆధ్వర్యంలో 8వతేది ఉదయం పదిగంటలకు యార్లగడ్డ లక్ష్మిప్రసాద్ సెమినార్ హాలు, హిందీ విభాగం, ఆంధ్ర విశ్వ కళాపరిషత్, విశాఖపట్నం నందు విశాఖ జిల్లా కథాసాహిత్యం ఒకరోజు సదస్సు నిర్వహించబడుతుంది. ఉదయం పదిగంటలకు నిర్వహించే సదస్సులో ఎస్.పి. మహాలింగేశ్వర్ స్వాగతోపన్యాసంతో ప్రారంభమవుతుంది. ఆచార్య ఎన్.గోపి అధ్యక్షతన జరిగే ఈ సదస్సులో ముఖ్య అతిథిగా గొల్లపూడి మారుతీరావు, సదస్సు పరిచోపన్యాసకునిగా కొలివెన్ను మలయవాసిని, కీలకోపన్యాసకునిగా చింతకింద శ్రీనివాసరావులు పాల్గొంటారు. 11.30గంటలకు డి.వి. సూర్యారావు, ఆదూరి సీతారామమూర్తి, కందాళ కనకమహాలక్ష్మిలు పత్రాలు సమర్పిస్తారు. 2.30గంటలకు జరిగే సదస్సులో ఎల్.ఆర్.స్వామి, వి.సిమ్మన్న, అయ్యగారి సీతారత్నంలు పత్రాలు సమర్పిస్తారు. నాలుగు గంటలకు జరిగే ముగింపు సమావేశానికి ఎన్.గోపి అధ్యక్షత వహిస్తారు. ఈ కార్యక్రమంలో ద్విభాష్యం రాజేశ్వరరావు, కొలవెన్ను మలయవాసిని పాల్గొంటారు. సాయంత్రం 5గం.లకు ఈతకోట సుబ్బారావు తన కవితలతో ఆహుతులతో ముచ్చటిస్తారు.

మార్నింగ్ వాక్

న్యూజెర్సీవాక్ పాత్ మీద
రెండేళ్ల మనవడు అక్షర్‌తో
నా మార్నింగ్ వాక్
నాకొక అద్భుత ఘట్టం
ప్రకృతితో మమేకమవుతూ
పచ్చికమీద మొలిచిన
గడ్డిపూలను లెక్కపెడుతూ
పక్కనే పాకుతున్న చీమల్ని పలకరిస్తూ
పుట్టగొడుగులను చూసి మురిసిపోతూ
వచ్చేపోయే కార్లకు 'టాటా' చెబుతూ
ఎగురుతున్న సీతాకోక చిలుకను
సంభ్రమంగా చూస్తూ
చెట్టుపైకి ఎక్కుతున్న
ఉడతను చూసి చప్పట్లు కొడుతూ
మైమరచిపోతూ సాగుతుంది
వాడి బుడిబుడి నడక
తాను చూసిన ప్రతిదీ వాడికి
అద్భుతమే!
వాడి వచ్చీరాని మాటలతో
నాకు వివరించాలని ఆత్రుత
బుల్లి బుల్లి అడుగులతో



చేతులు వెనక్కి కట్టుకుని
ఆరిందలా నా ముందు నడిచే
వాడి అమాయకపు చిలిపి చేష్టలు
ఆహ్లాదకరమైన ముఖారవిందం
ముద్దులు మూటకట్టే
మాటలతో
న్యూజెర్సీలో నా మార్నింగ్ వాక్
నాకొక మధురానుభూతి
అవును అక్షరన్నా అక్షరాలన్నా అనుభూతే కదా!

- డా॥ కేతవరపు రాజ్యశ్రీ
8500121990

మనసులోని భావాలకు అక్షరరూపాలు


నటి భానుమతీ రామకృష్ణ గొప్ప రచయిత్రేమీ కారుట. ఆమె పేరు పక్కన పెట్టి చూస్తే అవి నాసిరకం రచనలుగా తేలతాయట. ఆంధ్రపత్రిక సంపాదకులు శివలెంక శంభుప్రసాద్. ప్రముఖ సాహితీ విమర్శకుడు ఆర్.ఎస్.సుదర్శనానికి రాసిన లేఖలో తన ఈ అభిప్రాయాన్ని కుండబద్దలు కొట్టినట్లుగా వ్యక్తీకరించారు.

భానుమతి రాసిన కథల పుస్తకాన్ని సమీక్ష నిమిత్తం సుదర్శనం గారికి పంపుతూ శంభుప్రసాద్ ఈ మేరకు లేఖ జత చేశారు. ఆ లేఖలో ఇలా పేర్కొన్నారు. రాబోయే భారతి సంచికలో ఈ సమీక్షను ప్రచురించాలనుకుంటున్నాను. మిమ్మల్ని ప్రభావితం చేయడానికి ఇలా రాయడం లేదు. కానీ ఆవిడ రచనలు ఉత్తమ శ్రేణికి చెందినవని నేను భావించడం లేదు. రచయిత్రి పేరును పక్కనపెట్టి చూస్తే నాసిరకం రచనలుగా తేలతాయి.

తెలుగు సాహిత్య విమర్శనా రంగంలో అగ్రగణ్యుడిగా పేరు గాంచిన ఆర్.ఎస్.సుదర్శనం 1927 డిసెంబర్ 13న మదనపల్లెలో జన్మించారు. పలు ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థల్లో ఇంగ్లీషు అధ్యాపకుడిగా, ప్రిన్సిపల్‌గా సేవలు అందించారు. బోధనకే పరిమితం కాకుండా సాహిత్య రంగంలో అవిరళ కృషి చేశారు. సుదర్శనంగారి సాహిత్య కృషి బహుముఖీనంగా సాగింది. ఆయన 1960ల నుంచి మూడు దశాబ్దాలపాటు పుస్తకసమీక్షలు చేశారు. అనేకపుస్తకాలను పీఠికలు రాశారు. కొందరు తెలుగులో రాసిన కవితలు, కథలను ఇంగ్లీషులోకి అనువదించి పెట్టారు సాహిత్యంలో దృక్పథాలు, సమాజము - సాహిత్యము తెలుగు సాహిత్య విమర్శకు కొత్త ఒరవడి దిద్దాయి. అసురసంధ్య, సంసార వృక్షం వంటి నవలలు, కాలం తెచ్చిన మార్పు, మధుర మీనాక్షివంటి కథ సంకలనాలు కూడా వెలువరించారు. సాహిత్య అకాడమీ కోసం గుడిపాటి వెంకటచలంపై ఇంగ్లీషులో మోనోగ్రాఫ్ రాశారు.

ఈ బహుముఖ ప్రజ్ఞాశాలి గురించి అంపశయ్య నవీన్‌తో సాహిత్య అకాడమీ మోనోగ్రాఫ్ రాయించి ప్రచురించింది. కథ రచయిత్రిగా సాహితీలోకానికి పరిచితురాలైన సుదర్శనంగారి అర్ధాంగి ఆర్.వసుంధరా దేవి, రాటకొండ ప్రచురణల పేరిట సుదర్శనంగారికి చలం నుంచి చండీదాస్ వరకు లబ్ధప్రతిష్టులైన 19 మంది అగ్రగణ్య సాహితీ మూర్తులు వివిధ సందర్భాల్లో రాసిన లేఖలను పుస్తకంగా వెలువరించారు. లేఖలు రాసిన ప్రముఖుల్లో రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ, చలం, కొడవటిగంటి కుటుంబరావు, విశ్వనాథ సత్యనారాయణ, వడ్డెర చండీదాస్ మొదలైన వారు ఉన్నారు.

కొన్ని సంవత్సరాలుగా అమెరికాలోని న్యూయార్క్‌లో పిల్లల దగ్గర ఉంటున్న వసుంధరాదేవి, ఈ లేఖలను ప్రచురించాలని సంకల్పించడం బహుధా ప్రశంసనీయం. ఈ కృషిలో ప్రముఖ జర్నలిస్టు, రచయిత కల్లూరి భాస్కరం, సహాయ సహకారాలను అందించారు. పుస్తకం ఎడిటింగ్ బాధ్యతలను ఆయనే చూశారు. ఆయా రచయితలు అప్పటి సందర్భాల్లో వారి సాహిత్యానికి, సమకాలీన పోకడలకు సంబంధించి ఈ లేఖల్లో నిర్మొహమాటంగా తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ప్రచురణకు ఉద్దేశించి వీటిని రాయలేదు కనుక తమ మనసులోని భావాలను ఆంతరంగికంగా సూటిగా ఏ దాపరికం లేకుండా ప్రకటించారు. ఇవన్నీ వ్యక్తిగత అభిప్రాయాలే అయినా ఆయా వ్యక్తులపై తమ మనసులో ఉన్నదేమిటో వెలికి తీయగలిగారు. సాహిత్యాన్ని మదింపు చేయటానికి,



(సుదర్శనంగారికి - చలం నుంచి చండీదాస్ వరకు. (సాహితీ బంధువుల లేఖలు) పేజీలు - 192, వెల - రూ.150. ప్రతులకు - నవోదయ బుక్ హౌస్, ఆర్యసమాజ్ ఎదురు వీధి, కాచిగూడ, హైదరాబాద్- 27, ఫోన్ - 040- 24652387)

సాహితీ మూర్తుల వ్యక్తిత్వాన్ని అంచనా వేయటానికి, నాటి పరిస్థితులను అవలోకించ టానికి - ఈ లేఖల ద్వారా నిర్భీతిగా వ్యక్తం చేసిన విషయాలు ఉపకరిస్తాయి. అలనాటి పత్రికా సంపాదకులు పాటించిన నియమాలు, ఏర్పరచిన సత్సంప్రదాయాలు కూడా ఈ లేఖల ద్వారా కళ్లకు కడతాయి. భారతి, ఆంధ్రపత్రిక ప్రత్యేక సంచికలకోసం కథో, వ్యాసమో రాసి పంపాల్సిందిగా శివలెంకశంభుప్రసాద్, సుదర్శనం గారికి స్వయంగా ఉత్తరాలు రాసేవారు. రచనలు అందగానే వెంటనే ఆ విషయాన్ని తెలుపుతూ మరో ఉత్తరం రాసేవారు.

వ్యాసం ఆలస్యంగా అందినందున సంచిక చివరి పేజీల్లో ప్రచురించవలసి వచ్చినందుకు అన్యధా భావించవలదని ఒక లేఖలో శంభుప్రసాద్ రాయటం ఆయన సున్నితత్వానికి దర్పణం పడుతోంది. సుదర్శనం గారు రాసిన నిసాంతం అనే కవితా సంకలనం నచ్చి అంకితం పుచ్చుకోవటమే కాక స్వయంగా విశ్వనాథ సత్యనారాయణ అచ్చు వేయించారు. పుస్తక ప్రచురణ తర్వాత అందుకైన ఖర్చు తాలూకు బిల్లును విశ్వనాథవారు పంపటం సుదర్శనంగారికి ఆగ్రహం కలిగించింది.

మీ నిశాంతము అచ్చైనది. ఒక ప్రతి ఇందుతో పంపించుచున్నాను. బిల్లు కూడా పంపించుచున్నాను. మీరు పంపించమంటే 100 కాపీలు రైల్వే పార్శిల్‌గా నెల్లూరు స్టేషన్‌కు పంపించగలను. అని విశ్వనాథ సత్యనారాయణగారు లేఖ రాయగా సుదర్శనం గారు ప్రతిలేఖ ఘాటుగా రాశారు.

మీరు రావటం ఆ పద్యాల మీద వ్యామోహపడటం, వెంట తీసుకుని వెళ్లటం జరిగింది. అందుకే పుస్తకాన్ని మీకేసమర్పించాను. నాకు ఇక పుస్తకం మీద ఎటువంటి ఆసక్తి లేదు. పై కారణాలవల్ల పుస్తకం సాధక బాధకాలు పూర్తిగా మీరే సహించక తప్పదు.

ఈ వివాదాల నడుమ 1970లో విశ్వనాథ వారు ప్రచురించిన ఈ సంకలనాన్ని 1975 లో గుంటూరు శేషేంద్ర పునర్ముద్రించడం విశేషం.

వడ్డెర చండీదాస్ లేఖ అలా సాగింది - నా హిమజ్వాల మీకు సంతృప్తికరంగా అనిపించినందుకు సంతోషం. మీరు ప్రత్యేకించి మెచ్చుకునే నాలుగు, ఐదు అధ్యాయాలు వార పత్రికల రీడరీమణులలో అధిక సంఖ్య ఈసడింపుకి గురి అయ్యాయి. రావూరి భరద్వాజ తన పాకుడురాళ్లు నవల పంపుతూ నిష్పాక్షిక విమర్శను కోరుతున్నట్లు లేఖ రాశారు.

ప్రముఖ కవి ఇస్మాయిల్ లేఖలో హైకూల గురించిన అభిప్రాయాన్ని ఇలా వ్యక్తీకరించారు. ప్యూర్ హైకూ రాయటం చాలా కష్టం. అర్థం చేసుకోవటమూ కష్టమే. కవీ, పాఠకుడూ ఇద్దరూ, కవీ, ప్రపంచమూ ఐక్యమయ్యే ఆ సెల్ఫ్ లెస్ స్టేట్‌ని సాధించవలసి ఉంటుంది.

ఇలాంటి అనేక ఆలోచనల సమాహారమైన ఈ లేఖల్లో ఆయా రచయితల పరిచయంతో పాటు వారి చేతిరాతనూ బొమ్మకట్టించటం బావుంది.

-గోవిందరాజు చక్రధర్

ఓ సరికొత్త నినాదం!

ఎవరు నాటారో...?!
ఎప్పుడు నాటారో...?!
నా భవన నిర్మాణానికి ముందే
అక్కడ కొలువై వుంది!
సూర్యకిరణాలను
చంద్రుని వెలుగు రేకలను
భూమిని చేరకుండా
కొమ్మలను చిక్కగా
అలుముకున్నాయి ఆకులు...
నా గృహప్రవేశానికి
దాని నీడలోనే
అన్న సంతర్పణ జరిగింది!
అన్నం తింటూనే
దాని అందాన్ని కీర్తించి
దాని నీడ నాకో వరమని
నన్నూ అభినందించారు
అతిథి దేవుళ్ళందరూ!
నాకు చెప్పకుండానే
అకస్మాత్తుగా చెక్కెర నేస్తం
నా తనువులోని అణువణువునూ
అల్లుకు పోయింది!
అప్పుడే శ్రావణం వచ్చింది
వర్షఋతువు వయ్యారంగా
తొంగి తొంగి చూస్తోంది...
టపటప రాలుతోన్న
చినుకులతో బాటుగా
దానికొమ్మల చివర నుండి
కుంకుడు కాయంత పరిమాణంతో
పటపట రాలినేలను తాకాయి
బాగా పండిన నల్లని అల్లనేరేడు పండ్లు!
అప్పుడే వైద్యవృత్తిలో చేరిన మనువరాలు
చెక్కెర జబ్బుకు అల్లనేరేడు పండు
అద్భుతమైన వైద్యమని చెప్పింది...
చేదు బిళ్ళలు మింగలేక చస్తోన్ననాకు
ఈ తీపి కబురు అమితానందమే కదా!
ప్రతిరోజూ వందల సంఖ్యలో
నేలరాలుతున్నాయి పండ్లు...
నేనే కాదు...
మా వీధిలో... మాపేటలో...
పిల్లలూ... పెద్దలూ...



మధుమేహం జబ్బువున్న వాళ్ళు.... లేనివాళ్ళు...
అల్లనేరేడు పండ్ల కోసం
ఆరాటపడటం ఆనవాయితీగా మారింది!
ప్రతిరోజూ నా ఇంటిముందు
పండుగ కోలాహలమే!
ఓ రోజు... సూర్యోదయానికి ముందే
నా ఇంటిముందు కలకలం...
కళ్ళు నులుపుకుంటూ
ముఖ ద్వారం తెరిచాను...
నిద్రమత్తు వదిలింది...!
కడుపు రగిలిపోయింది..!!
ఆ దృశ్యం నా గుండెను పిండి చేసింది...!!!
పురపాలక అధికారులు పలువురు
ఆధునిక యంత్ర పరికరాలతో
చెట్టు తల్లిని కూలగొడుతున్నారు!
జీవజాలానికి నీడనిస్తోన్న మహావృక్షాన్ని...
మనుష్యజాతికి ప్రాణవాయువులందిస్తోన్న
అపర ధన్వంతరి ప్రతిరూపాన్ని...
కూకటివ్రేళ్ళతో పెకలిస్తున్నాను!
మనసు వికలమై... హృదయం ద్రవించి...
కన్నీరు వరదలా పొంగింది!
నేనే కాదు...
అక్కడకు చేరుకున్న అందరి పరిస్థితీ అదే!
అధికారుల ముందు మేము అల్పులమైన వేళ
మావాదన అరణ్య రోదనగా మారింది!
నగరానికి సరికొత్త అందాలను
సంతరింపజేయడానికి
రహదారుల విస్తరణ లక్ష్యంగా
హరిత వనాల నిర్మూలనం...
అధికారుల సమాధానం...
చెట్టునరకండి...!
మొక్క నాటండి...!!
ఇది ఓ సరికొత్త నినాదం!

- విడదల సాంబశివరావు
9866400059

సంక్షోభంలో వ్యవసాయం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : సంక్షోభంలో చిక్కుకున్న వ్యవసాయ రంగాన్ని కేంద్ర ప్రభుత్వంలో ఆదుకోవాలని సీపీఎం పోలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు డిమాండ్ చేశారు. కార్పోరేట్ సంస్థలకు చెందిన అప్పులను రూ. 1.56 లక్షల కోట్లను మాఫీ చేసిన కేంద్రం.. రైతు రుణాల మాఫీ తమ బాధ్యత కాదని తప్పించుకోవడం సరికాదని ఆయన హెచ్చరించారు. రైతు పండించిన పంటకు మద్దతు ధరను చట్టబద్ధ హక్కుగా గుర్తించాలని రాఘవులు పేర్కొన్నారు. రాఘవులు మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర కమిటి సమావేశాల్లో ఆరు సమస్యలను ప్రదానంగా గుర్తించినట్లు తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రదాన సమస్యలపై ఈ నెల 15 నుంచి సెప్టెంబర్ 1 వరకు ప్రచారోద్యమం నిర్వహిస్తామని వివరించారు. సెప్టెంబర్ 1న ప్రపంచ సామ్రాజ్యవాద వ్యతిరేక దినంగా పాటిస్తామన్నారు. ఎన్నికల ముందు చెప్పినట్లుగా ఏటా రెండు కోట్ల ఉద్యోగాల కల్పనకు కేంద్రం ప్రణాళిక రూపొందించడంలో విఫలమైందన్నారు. ఇజ్రాయిల్ పర్యటనకు వెళ్లిన ప్రధాన మంత్రి నరేంద్రమెడి పాలస్తీనాకు వెళ్లకుండ కొత్త సంప్రదాయం నెలకొల్పారని ఆయన విమర్శించారు. సీపీఎం అఖిల భారత మహాసభలు వచ్చే ఎడాది ఏప్రిల్‌లో హైదరాబాద్‌లో జరుగుతాయని తెలిపారు. సెప్టెంబర్ నుంచి ఏప్రిల్ వరకు పార్టీ నిర్మాణంపై కార్యక్రమాలు ఉంటాయన్నారు. నేరెళ్ల ఘటనపై సీఎం స్పందించిన తీరు దారుణమన్నారు. దళితుల మెడలో బోర్డు ఉందా..? అని వ్యాఖ్యానించడాన్ని ఆయన తప్పుపట్టారు. వాస్తు పేరుతో సచివాలయం తరలించి రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేయాలని చూస్తున్నారని ఆయన మండిపడ్డారు. కుల వృత్తులను కాపాడుతామంటూ ప్రకటనలకే పరిమితం అవుతున్నారని, గొర్రెల పంపిణి కూడా పూర్తి స్థాయిలో జరగడం లేదన్నారు. జానాభా ప్రాతిపదికన ఎస్సీ, ఎస్టీ బీసీ రిజర్వేషన్లు పెంచాలన్నారు.

శేషన్న ఆచూకి లభ్యం

నయీం కేసులో కీలక నిందితుడు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : గ్యాంగ్‌స్టర్ నయీం కేసులో మళ్లీ కదలిక రానుంది. నయీం ఎన్‌కౌంటర్ జరిగిన నాటి నుంచి పరారీలో వున్న నయీం రైట్ హ్యాండ్ శేషన్న ఆచూకీ పోలీసులకు లభ్యమైనట్లు సమాచారం. గతేడాది మహబూబ్‌నగర్ జిల్లా షాద్‌నగర్ వద్ద గ్యాంగ్‌స్టర్ నయీం ఎన్‌కౌంటర్ జరిగింది. అప్పట్నించీ శేషన్న ఆచూకీ కోసం పోలీసులు జల్లెడ పడుతున్నారు. శేషన్న డ్రైవర్ పోలీసులకు చిక్కాడు. దీంతో శేషన్న ఆచూకీ ఇక లభ్య మైనట్లేనని పోలీసులు భావించినప్పటికీ శేషన్న ఆచూకీని పోలీసులు కని పెట్టలేకపోయారు. శేషన్న ఆచూకీ దొరికితే ఈ కేసులో వున్న చిక్కు ముడులన్నీ వీడుతాయని పోలీసులు మొదట్నించీ చెబుతున్నారు. శేషన్న కోసం నల్లమల ప్రాంతంలో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినట్లు సమాచారం. గ్యాంగ్ స్టర్ నయీం తర్వాత నయీంగ్యాంగ్‌ను సమర్థవంతంగా నడపగల సత్తా, సామర్థ్యం శేషన్నకు ఉందని అంటున్నారు. రెక్కీ నిర్వహించడం, ప్రత్యర్థులను బెది రించడం, మాట వినని వారిని చిత్రహింసలు పెట్టడంలో శేషన్న నిష్ణాతుడు. నయీం నేర సామ్రాజ్యంలో శేషన్నదే కీలక పాత్ర పోషించినట్లు పోలీసులు అను మానిస్తున్నారు. గ్యాంగ్‌స్టర్ నయీం కార్యకలాపాల విస్తరణలో ప్రముఖ పాత్ర పోషించిన రైట్‌హ్యాండ్ శేషన్న ఆచూకీని పోలీసులు కనుగొన్నారని సమాచారం. దీంతో ఈ కేసులో మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. అయితే నయీం దందాలపై సిట్ 197 కేసులను నమోదు చేసింది. ఆయా కేసులకు సంబంధించి ఇప్పటికే న్యాయస్థానాల్లో 18 చార్జిషీట్లు దాఖలు చేశారు. ఈ కేసులో నిందితులుగా ఉన్నవారంతా బెయిల్‌పై విడుదలయ్యారు. మరికొన్ని కేసుల్లో కూడా తమ వద్ద ఆధారాలు లేవని పోలీసులు కోర్టును ఆశ్రయించేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే ఈ తరుణంలో శేషన్న ఆచూకీ లభ్యమైతే కొంత సమాచారం పోలీసులకు లభ్యమయ్యే అవకాశం లేకపోలేదు.

పొన్నం దీక్షకు సంఘీభావం



కరీంనగర్, కెఎన్‌ఎన్‌బ్యూరో: కరీంనగర్‌లో ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ నేత, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ చేపట్టిన నిరాహార దీక్షకు పలువురు సంఘీభావం తెలిపారు. ఆదివారంనాడు సీఎల్పీ ఉపనేత జీవన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కటకం మృత్యుంజయం, మాజీ చీఫ్ విప్ గండ్ర వెంకటరమణారెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి గంగాధర్, మాజీ ఎమ్మెల్యేలు ఆరేపల్లి మోహన్, సుద్దాల దేవయ్, కాంగ్రెస్ నేతలు కౌశిక్‌రెడ్డి, రమ్యారావు, ప్యాట రమేష్ తదితరులు దీక్షా శిబిరం వద్దకు వచ్చి సంఘీభావం తెలియజేశారు. తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ పార్టీ నాయకులతో కలిసి వచ్చి మద్దతు ప్రకటించారు. సీపీఐ, సీపీఎం పార్టీలతో పాటు వివిధ ప్రజాసంఘాల నేతలు పొన్నం దీక్షా శిబిరం వద్దకు వచ్చి తమ సంపూర్ణ మద్దతును తెలియజేశారు. దీక్ష చేస్తున్న పొన్నం ప్రభాకర్‌కు ఆదివారం ఉదయం నిమ్స్ వైద్యులు వైద్యపరీక్షలు నిర్వహించి, ఆరోగ్యాన్ని పరీక్షించారు. ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యబృందం వెల్లడించింది.

పొన్నం దీక్ష బూటకం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : కరీంనగర్‌లో మెడికల్ కళాశాల ఏర్పాటు అంశం పై మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ చేస్తున్న దీక్షపచ్చి బూటకమని, ప్రభుత్వంపై ఏదో రకంగా బురదచల్లాలని కాంగ్రెస్ నాయకులు ఆడుతున్న నాటకమని పెద్దపల్లి ఎంపీ బాల్కసుమన్ విమర్శించారు. ఆదివారం టీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మంచి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన ప్రతిసందర్భంలో ఏదో ఒక లేని సమస్యను అప్పటికపుడు సృష్టించి ప్రజల దృష్టిని మళ్ళించాలన్న కపటబుద్ధితో కుట్రలు చేయడం పరిపాటైందన్నారు. పదేండ్లు కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలో ఎంపీ పదవిలో ఉన్న పొన్నం కరీంనగర్‌కు మెడికల్ కళాశాలను ఎందుకు సాధించలేకపోయారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలకు మెడికల్ కళాశాలలు చేయాలన్న ప్రతిపాదన వచ్చిందన్నారు. కరీంనగర్ మెడికల్ కళాశాలకు సంబంధించి అప్పటి కలెక్టర్ స్మితాసభర్వాల్ ప్రభుత్వానికి ఒక నివేదిక పంపారని, కానీ అప్పటి సిఎం కిరణ్‌కుమార్ రెడ్డి ఆదిలాబాద్ జిల్లాకు మెడికల్ కళాశాల మంజూరుచేసి, రెండు ప్రైవేట్ కళాశాలలు ఉన్న కరీంనగర్‌కు మరో మెడికల్ కళాశాల అవసరం లేదని కలెక్టర్ పంపిన నివేదికను ఆమోదించారన్నారు. అపుడే కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వాన్ని నిలదీసి.. ఈదీక్ష చేసి ఉంటే కళాశాల వచ్చేదన్నారు.

వైభవంగా రాఘవేంద్రస్వామి ఉత్సవాలు

ఎమ్మిగనూరు, కెఎన్‌ఎన్: కర్నూలు జిల్లా మంత్రాలయంలో కొలువైన శ్రీ రాఘవేంద్రస్వామి 346వ సప్త రాత్రోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మఠం పీఠాధిపతులు శ్రీ సుబుదేంద్రతీర్థులు కాషాయ జెండాను ఆవిష్కరించి , ఉత్సవాలను ప్రారంభించారు. శ్రీ రాఘవేంద్రస్వామి మూల బృందావనంకు ప్రత్యేక అభిషేకాలు, బృందావనాన్ని బెంగుళూరుకు చెందిన వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. గోవు, ఆశ్వ, ధాన్య, లక్ష్మీ పూజలను నిర్వహించి మంచాలమ్మకు హారతులు ఇచ్చారు. మొదటి రోజు ప్రారంభం సందర్భంగా దేశ నలమూలల నుంచి వేలాది మంది భక్తులు పాల్గొని తరించారు. భక్తులకు పీఠాధిపతులు తీర్థ ప్రసాదాలు అందజేసి భక్తులను ఉద్దేశించి సందేశాన్ని వినపించారు. ఉత్సవ మూర్తి ప్రహ్లాదరాయులను చెక్క, వెండి, బంగారు రథాలపై ఊరేగించారు. కర్ణాటకకు చెందిన కళాకారులచే భరతనాట్యం, దాసవాణిసాహిత్యం భక్తులను ఎంతగానో అకట్టుకున్నాయి.

సర్పంచ్‌ల చెక్ పవర్‌కు

సర్కార్ కత్తెర

- పంచాయతీ అధికారాలు తగ్గింపు
- ప్రభుత్వ తీరుపై మండిపడుతున్న సర్పంచులు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలోని గ్రామపంచాయతీల అధికారాలకు రాష్ట్ర ప్రభుత్వం కత్తెర విధిస్తుంది. అసలే అధికారాలు అప్పగించలేదని ఒకపక్కా పోరాటం చేస్తున్న స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై కునుకులేకపోతుంది. గ్రామ సర్పంచులకు ఉన్న చెక్‌పవర్‌ను పంచాయతీ కార్యదర్శికి కూడా అప్పగించి జాయింట్ చెక్‌పవర్ రాష్ట్ర ప్రభుత్వం వర్తింపజేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ప్రజల చేత ఎన్నుకున్న ప్రజాప్రతినిధుల అవమానించే విధంగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని సర్పంచులు మండిపడుతున్నారు. జాయింట్ చెక్‌పవర్‌ను రద్దు చేయాలని డిమాండ్‌చేస్తూ గత కొంత కాలంగా సర్పంచుల సంఘం పోరాటం చేస్తున్న విషయం తెలిసిందే. దీనిపై హైకోర్టులో సర్పంచులు అప్పిల్ చేశారు. జాయింట్ చెక్‌పవర్ రద్దు చేయాలని హైకోర్టు కూడా రాష్ట్రప్రభుత్వాన్ని ఆదేశించింది. కానీ హైకోర్టు ఆదేశాలను భేఖతారు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేయడం గమనర్హం. 14వ కేంద్ర ఆర్థికసంఘం నిధులను నేరుగా గ్రామ పంచాయతీలకు విడుదల చేస్తున్న విషయం తెలిసిందే. దీంతో అయా గ్రామ పంచాయతీల్లో ఇప్పుడిప్పుడు కొన్ని పనులు చేసేందుకు వీలవుతుంది. ఈ నిధులపై రాష్ట్రప్రభుత్వం ఆజామాయిషీ చేసేందుకే జాయింట్ చెక్‌పవర్‌ను వర్తింపజేసిందని పలువురు సర్పంచులు ఆరోపిస్తున్నారు. వాస్తవానికి గ్రామపంచాయతీలకు వచ్చిన నిధులను రాష్ట్ర ప్రభుత్వమే లాగేసుకుంటుంది. గ్రామ పంచాయతీలకు కేంద్ర ఆర్థిక సంఘం నుంచి వచ్చే 60శాతం నిధులకు ఏదో రకంగా రాష్ట్రప్రభుత్వం కత్తెర పెడుతున్నది. రాష్ట్రంలోని గ్రామపంచాయతీలకు ఇటీవల కాలంలో కేంద్ర ఆర్థిక సంఘం నుంచి నిధులను మంజూరుచేసింది. ఈ నిధులు గ్రామ పంచాయతీల ఖాతాలోకి రాగానే విద్యుత్ బకాయిల కింద రాష్ట్ర ప్రభుత్వం ఖాతాలోకి నిధులను వేసుకున్నట్లు తెలిసింది. ఇదే కాకుండా గ్రామపంచాయతీ పరిధిలోని తాగునీటి ప్రాజెక్టుల నుంచి అయా గ్రామాలకు సరఫరా చేసే తాగునీటి బకాయిలను కూడా వసూలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ సర్పంచులు లబోదిబోమంటోన్నట్లు తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలను బలోపేతం చేయనున్నట్లు గతంలో చాలాసార్లు ప్రకటించిన విషయం తెలిసిందే. నిధులతో పాటు విధులను కూడా కట్టబెడుతామని బీరాలు పలికింది. కానీ కేంద్రప్రభుత్వం పుణ్యమా అని నేరుగా కేంద్ర ఆర్థిక సంఘం నిధులను గ్రామపంచాయతీలకు వస్తున్నాయి. కానీ వీటిని కూడా లాగేసుకునేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుంది. ఉదాహరణకు 1300 ఓటర్లు కలిగిన గ్రామ పంచాయతీలకు కేంద్ర ఆర్థిక సంఘం నుంచి రూ.2,60లక్షలు నిధులు విడుదల కాగా, వీటిలో విద్యుత్ బకాయిల కింద రూ. 2.30లక్షలు రాష్ట్ర ప్రభుత్వం ఖాతాలోకి వేసుకున్నట్లు తెలిసింది. ఇది కాకుండా ఇదే గ్రామపంచాయతీలో రూ. 1.60లక్షలు తాగునీటి బకాయిలున్నాయి. దీంతో కేంద్రం నుంచి వచ్చిన నిధుల్లో సంబంధిత గ్రామపంచాయతీ రూ.1.30లక్షలు బకాయిల కింద రాష్ట్రప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంది. దీంతో దీన్నిబట్టి రాష్ట్రంలో ఉన్న గ్రామ పంచాయతీల పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. విద్యుత్‌గానీ, తాగునీటి బకాయిలుగానీ దాదాపు అన్ని గ్రామపంచాయతీల్లో ఇదే పరిస్థితుల్లో ఉంటాయని తెలిసింది. గ్రామ పంచాయతీల నిధులను ఒకపక్కా లాగేసుకుంటూనే ఉన్న అధికారాలకు కూడా కత్తెర పెడుతుంది. నిధులు, విధుల బదలాయింపుపై ప్రభుత్వం ఒక్కసారి కూడా దృష్టి కేంద్రీకరించలేదు. కానీ వారి అధికారాలను కత్తెరించేందుకు దృష్టి కేంద్రీకరిస్తుంది. దీంతో సర్కార్ నిలదీసేందుకు సర్పంచులు సన్నద్ధం కానున్నట్లు తెలుస్తోంది.

చిన్న సినిమాలకు ఆదరణ కరవు


జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఆంధ్రప్రభ ఎడిటర్ వైఎస్ఆర్. శర్మ


కార్యక్రమంలో ప్రసంగిస్తున్న రచయత దర్శకుడు ప్రభాకర్ జైనీ

- పరిశ్రమలో కొందరిదే పెత్తనం
- సినీవాలి నవల ఆవిష్కరణ
- నవలను సినిమాగా తీయటం అంత సులువు కాదు: రచయత, దర్శకుడు ప్రభాకర్ జైనీ

వరంగల్, కెఎన్ఎన్ బ్యూరో : నవలలను సినిమాగా తీయడం అంత సులువైన విషయమేమి కాదని నవల రచయిత, దర్శకుడు ప్రభాకర్ జైనీ అన్నారు. హన్మకొండలోలోని వాగ్దేవి కళాశాల ఆడిటోరియంలో ఆయన వ్రాసిన సినివాలీ పరిచయ సభ జరిగింది. కార్యక్రమంలో ఆంధ్రప్రభ సంపాదకులు వైఎస్ఆర్. శర్మ, కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహిత అంపశయ్య నవీన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభాకర్ జైనీ మాట్లాడుతూ నవలలను సినిమాలుగా తీయడం అంటే పెద్ద సాహసమే అన్నారు. కవి, రచయిత ఏది మనసులో అనుకుంటే అది రాసేయగలడు. కానీ అదే సినిమా విషయానికొస్తే అనుకున్నదల్లా విజువలైజేషన్ చేయడం సాధ్యం కాదన్నారు. విమర్శలు చేయడం పెద్ద కష్టమేమి కాదూ.. కానీ పని చేయడంలో కష్టం కనిపిస్తుందని తెలుసుకోవాలని హితవు పలికారు. తాను తీసిన క్యాంపస్ అంపశయ్య సినిమాను ఎంతో శ్రమిస్తే తప్పా సాధ్యం కాలేదన్నారు. అయితే అంత కష్టపడి సినిమా తీసినా సినిమాను కొనడానికి డిస్ట్రిబ్యూటర్లు గానీ, సినిమా థియేటర్లు దొరక్కా తీవ్ర ఇబ్బందులకు గురయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు.. ఎంత మంచి తీసినా థియేటర్లు లేనప్పుడు అది ఎం పనికొస్తుందని అసహనం వ్యక్తం చేశారు. తెలుగు సినిమా పరిశ్రమ పూర్తిగా భ్రష్టుబట్టి పోయిందని, ఆ పరిశ్రమను కొందరే శాసిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సినీ పరిశ్రమలో చిన్న సినిమాలకు పూర్తి ఆదరణ కరువయిందన్నారు. చిన్న దర్శకులకు, చిన్న సినిమాలకు ఎక్కడా అవకాశాలు రావడం లేదన్నారు. ఎంతో మంది చిన్న సినిమాల దర్శకులు అద్భుతాలు సృష్టించే సృజనాత్మకత ఉన్నా మరుగున పడిపోతున్నారన్నారు. అయితే తాను ఇప్పుడు రాసిన సినీవాలి నవలలో సినీ పరిశ్రమ పరిస్థితితో పాటు ఆర్టిస్టుల పరిస్థితిని, చిన్న సినిమాల దర్శకులు పరిస్థితిని కల్లకు కట్టినట్లు చూపించానన్నారు. సినివాలీ నవలను ప్రముఖ సాహితీ వేత్త, సెన్సార్ బోర్డు సభ్యులు వారాల ఆనంద్ సమీక్షించగా ప్రముఖ కవి బిక్కి కృష్ణ సభా అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో కాకతీయయూనివర్సిటీ తెలుగు శాఖ అధ్యక్షురాలు వేల్పుల శ్రీదేవి, ప్రముఖ కవయిత్రి దేవులపల్లి వాణి, ప్రముఖ కవులు రామ చంద్రమౌళి,అన్వర్, సాది క్ అలీ తదితరులు పాల్గొన్నారు.నగారనికి చెందిన ఉత్తమ పాఠకుల సంఘం (ఉపాసం) కార్యక్రమాన్ని నిర్వహించింది. చివరగా అయిత శ్రీనివాస్ వందన సమర్పణ చేశారు.

గృహనిర్మాణంలో ఏపీ టాప్

- తర్వాతి స్థానంలో తమిళనాడు, మధ్యప్రదేశ్
- మరో 2 లక్షల గృహాల కోసం నిధులు మంజూరు చేసిన కేంద్రం

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: గృహ నిర్మాణంలో ఆంధ్రప్రదేశ్ దూసుకుపోతోంది. దేశంలోనే అత్యధిక గృహాలు నిర్మించిన రాష్ట్రంగా రికార్డు సృష్టించింది. ఈ క్రమంలో మరిన్ని గృహాల నిర్మాణం కోసం నిధుల విడుదలకు కేంద్ర సర్కార్ ప్రాథమిక ఆమోదం తెలిపింది. కేంద్ర పట్టణ గృహ నిర్మాణ శాఖకు చెందిన మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రతిపాదనలను అంగీకరిస్తూ 40 శాతం నిధుల విడుదలకు సిఫార్సు చేసింది. ఈ ప్రకారం మొత్తం రూ. 1,351.47 కోట్లు త్వరలో రాష్ట్రప్రభుత్వానికి అందనున్నాయి. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాల కింద 4.2 లక్షల గృహాలను నిర్మించింది. మరో 2 లక్షల గృహాలు నిర్మించేందుకు పంపిన ప్రతిపాదనలపై కేంద్రం సానుకూలంగా స్పందించింది. ఆంధ్రప్రదేశ్ తర్వాత 3.34 లక్షల గృహాల నిర్మాణం చేపట్టి తమిళనాడు ద్వితీయ స్థానంలో నిలవగా, 2.86 లక్షల గృహాలతో మధ్యప్రదేశ్ మూడో స్థానంలో నిలిచింది. 2 లక్షల గృహాలతో కర్ణాటక, 1.54 లక్షల గృహాలతో గుజరాత్ రాష్ట్రాలు ఆ తర్వాతి స్థానాల్లో నిలిచాయి.2022 నాటికి అందరికీ గృహాలు నినాదంతో కేంద్ర ప్రభుత్వం దేశంలో గృహ నిర్మాణాన్ని ప్రోత్సహిస్తోంది. మొత్తం 2 కోట్ల గృహాలను నిర్మించాలన్న లక్ష్యంతో ప్రధాన మంత్రి ఆవాస యోజన, పట్టణ పేదరిక నిర్మూలన పథకాల కింద అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను సమాయత్తం చేసింది. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పేద, బడుగు, బలహీన వర్గాలు, ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకంతో పాటు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద లబ్ధిదారులను ఎంపిక చేసింది.

లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడిగా రవీందర్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: లోక్ సత్తా పార్టీ రాష్ట్ర శాఖ నూతన అధ్యక్షుడిగా నందిపేట రవీందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపింది.

ఉపఎన్నికల పోరు..హామీల జోరు!

- సీమ సమస్యలే ప్రచారాస్త్రాలు
- బరిలోకి దిగిన రాయలసీమ పరిరక్షణ సమితి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో ప్రధా న రాజకీయ పార్టీలకు పరీక్షగా మారిన నంద్యాల ఉప ఎన్నికల్లో తొలిఅంకం ముగిసింది. అధికార తెలుగుదేశం, ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న వైఎస్ఆర్‌కాంగ్రెస్‌పార్టీ, కాంగ్రెస్, రాయలసీమ పరిరక్షణ సమితీ పార్టీల అభ్యర్ధులతోపాటు ఇండి పెండెంట్లతో కలిపి మొత్తం 16 మంది ఉప ఎన్నికల బరిలో నిలిచారు. అయితే ఇక్కడ పోటీ ప్రధానంగా అధికార తెలుగుదేశంపార్టీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి, వైఎస్ఆర్‌కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శిల్పా మోహన్ రెడ్డి మధ్యనే కేంద్రీకృతమైంది. కాంగ్రెస్‌పార్టీ ఈ ఉప ఎన్నికల పోటీద్వారా పార్టీ ఉనికిని కాపాడుకునే ప్రయత్నం చేస్తోంది. రాయలసీమ పరిరక్షణ సమితీ నేత మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి ఆర్‌పీసీ అభ్యర్థిగా పుసులూరు మాజీ సర్పంచ్ పులయ్యను బరిలోకి దింపారు. ఉప ఎన్నికల ప్రాచారంలో రాయలసీమ ప్రాంత సమస్యలను ప్రధాన అస్త్రాలుగా మలిచి ప్రభుత్వంపైకి ఎక్కుపెట్టే ప్రయత్నంలో ఉన్నారు. తెలుగుదేశం , వైఎస్ఆర్‌కాంగ్రెస్ పార్టీలు ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నాయి. ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయడు నంద్యాల నియోజకవర్గంలో పర్యటించారు. రోడ్ షోలు ,బహిరంగ సభలు నిర్వహించారు. నంద్యాల ఓటరును ప్రసన్నం చేసుకునేందుకు అభివృద్ధి మంత్రం జపిస్తున్నారు. దివంగత ఎమ్మెల్యే భూమా నాగిరెడ్డి గతంలో నంద్యాల ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే దిశగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. నంద్యాలలో అతి పెద్ది హౌసింగ్ కాలని నిర్మాణం చేపట్టారు. నంద్యాల పట్టణ రూపు రేఖలు మార్చే విధంగా రోడ్ల విస్తరణ పనులు ప్రారంభించారు. డ్రైనేజీ వ్యవస్థలను ఆధునికరించే కార్యక్రమానికి కూడా శ్రీకారం చుట్టారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రజల ఆదరాభిమానాలను మంరిత చూరగొనేలా 5వేల మందికి వృద్యాప్య , వితంతు పెన్సన్లు మంజూరు చేశారు. నంద్యాల ఉప ఎన్నికల నేపద్యంలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంతో దూరదృష్టితో నంద్యాల అభివృద్ధిని ఒక పథకంప్రకారం చేపట్టడం ఆ పార్టీ అభ్యర్థి బ్రహ్మానందరెడ్డికి బాగా కలిసివస్తోందని టీడీపీ శ్రేణులు భావిస్తున్నాయి. మంత్రి అఖిలప్రియ కూడా తన తండ్రి భూమా నాగిరెడ్డి ఆశయాలు నేరవేర్చేలా నంద్యాలను అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తామని ప్రజలకు నమ్మకం కల్పించే ప్రయత్నాలు చేస్తున్నారు. భూమా నాగిరెడ్డి లేకపోయినా ఆయన వర్గం చెక్కుచెదరలేదని నిరూపించేందుకు భూమా ప్రాణమిత్రుడుగా ముద్రవేసుకున్న ఏవీ సుబ్బారెడ్డి ఈ ఎన్నికల్లో తనదైనశైలిలో శ్రమిస్తున్నారు. ఎమ్మెల్సీ ఫరూఖీ కూడా ఈ ఎన్నికల్లో భూమా కుటుంబానికి చేదోడుగా నిలిచారు. రాష్ట్రమంత్రులు , పార్టీ సీనియర్ నేతలు సీఎం చంద్రబాబు ఆదేశాలమేరకు నంద్యాలలో మకాంవేసి ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలను వల్లవేస్తు ప్రజలముందుకు వెళుతున్నారు.

భూ రికార్డులు సక్రమంగా నిర్వహించాలి



నల్లకుంట, కెఎన్ఎన్ : తెలంగాణలో భూ రికార్డులు సక్రమంగాలేవని, దీనితో దొంగ రిజిస్టర్‌లు జరుగుతున్నాయని కేంద్ర ప్రభుత్వం తెచ్చిన డిజిటల్ ఇండియా పథకంలో భాగంగా భూ రికార్డులను సక్రమంగా నిర్వహించాలని కేంద్ర కార్మిక శాఖ మంత్రి బండారు దత్తాత్రేయ సూచించారు. దీనికి సంబంధించిన నిధులు కేంద్రం నుంచి తేవడానికి తాను కృషిచేస్తానని చెప్పారు. మియాపూర్ భూకుంభకోణం వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చిందని భూ రికార్డులను పూర్తిగా కంప్యూటరీకరించి డిజిటల్ రికార్డులను తయారుచేసి ఎలాంటి అవకతవకలకు తావులేకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరముందన్నారు. మియాపూర్ భూ కుంభకోణం ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చిందని, అక్రమాలకు తావులేకుండా సమగ్ర భూరికార్డుల నిర్వహణ చేపట్టాలన్నారు. ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ భూముల రికార్డుల నిర్వహణలో ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి మరింత సమర్థవంతంగా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత రెవెన్యూ శాఖ పనితీరు మరింత మెరుగైందని, ఎంత పనిచేసినా రెవెన్యూ శాఖ కొన్నిసార్లు అబాసుపాలవుతుందని అన్నారు. తెలంగాణలో ఉన్న భూముల్లో అనేక సమస్యలు ఉన్నాయని వాటిని దశలవారీగా పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రెవెన్యూ శాఖలో సిబ్బంది ఖాళీలను త్వరలోనే భర్తీచేసి శాఖ పనితీరును మరింత మెరుగుపరిచి ప్రజలకు మెరుగైన సేవలు అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. త్వరలో పాస్‌పోర్టును పోలిన విధంగా ఉండే పాస్‌బుక్‌లను రైతులకు అందించనున్నట్టు చెప్పారు.

భార్గవ లేకపోతే భవిష్యత్తు అంధకారం

సీసీఎంబీని ప్రపంచపటంలో నిలిపిన భార్గవ



నల్లకుంట, కెఎన్ఎన్ : సీసీఎంబీని ప్రపంచ పటంలో నిలిపిన ఘనత పి.ఎం. భార్గవే దక్కుతుందని కేంద్ర మాజీ మంత్రి ఎస్. జైపాల్‌రెడ్డి అన్నారు. భార్గవ లాంటి వ్యక్తి మన దేశంలో పుట్టి ఉండకపోతే దేశ భవిష్యత్ అంధకారంగా మారేదని ఆయన అన్నారు. సీసీఎంబీ పూర్వ డైరెక్టర్ డాక్టర్ పి.ఎం. భార్గవ సంతాప సభ ఆదివారంనాడు సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగింది. మండల వాదానికి అనుగుణంగా మాట్లాడి వెనుకబడిన వర్గాల వారికి రిజర్వేషన్‌లు రావా లని కోరుకున్న వ్యక్తి అని చెప్పారు. శాస్త్రీయ విప్లవం వల్లే ఆధునిక సమాజమైందని, అన్నింటికన్న పెద్ద విప్లవం శాస్త్రీయ విప్లవమేనని పేర్కొన్నారు. ఈ విప్లవం వచ్చాకే అన్నీ వచ్చాయని, శాస్త్రీయ విప్లవం ఆధునిక సమాజానికి పునాది అని ఆయన అభిప్రాయపడ్డారు. నెహ్రూ తరం ఆఖరి ప్రతినిధిగా భార్గవను పేర్కొవచ్చని, సైంటిస్టులు ఉన్నారు కాని సైంటిఫిక్ స్పిరిట్ ఉన్న వారు తక్కువగా ఉన్నారని పేర్కొన్నారు. విజ్ఞానాన్ని సవరిస్తేనే అది మరింత పెరుగుతుందని చెప్పారు.

జగన్ తీరు అమానవీయం

ఏపీ మంత్రి పితాని సత్యనారాయణ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ముఖ్య మంత్రి చంద్రబాబును విమర్శించిన ప్రతి పక్షనేత వైఎస్ఆర్‌కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి తనకుతానుగా రాజ కీయంగా ఆత్మహత్య చేసుకున్నారని రాష్ట్ర మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. ఆదివారం ఎన్టీఆర్ ట్రస్ట్‌భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి హోదా తోపాటు తన తండ్రి వయసున్న చంద్రబాబు నాయుడును గౌరవించని జగన్ సీఎం నే హత్య చేయాలనటం దుర్మార్గమైన చర్యగా పేర్కొన్నారు. జగన్ ప్రతిపక్షనేతగా ఉంటడం దేశానికే అరిష్టం అన్నారు. జగన్ ఎప్పటికీ సీఎం కాలేరన్నారు. ఇదేవైఖరితో ఉంటే ఈ సారి ప్రజాప్రతినిధి కూడా కాలేరని శపించారు. ఇటువంటి వ్యక్తి ప్రజాస్వామ్యవిలులను ఏవిధంగా కాపాడుతారని ప్రశ్నించారు. ఉప ఎన్నికల్లో ప్రజలను రెచ్చగొట్టి గెలవాలనుకోవటం అసాధ్యం అన్నారు.


ఎయిర్‌పోర్టులో బంగారం స్వాధీనం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : శంషాబాద్ ఎయిర్‌పోర్టులో భారీగా బంగారం పట్టుబడింది. కస్టమ్స్ అధికారులు రియాద్ నుంచి వచ్చిన ఓ ప్రయాణికుడి నుంచి 233 గ్రాముల బంగారంను కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు 7 లక్షల వరకూ ఉంటుందని కస్టమ్స్ అధికారులు తెలిపారు. సదరు ప్రయాణీకుడిని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు.

డ్రగ్స్ సంస్కృతి ఈనాటిది కాదు!

హైదరాబాద్, ఆంధ్రప్రభ : చిత్ర పరిశ్రమలో డ్రగ్స్ సంస్కృతి ఎప్పటి నుంచో ఉందని ప్రముఖ దర్శకుడు, కళా తపస్వి కె.విశ్వనాథ్ అన్నారు. సినీ స్టార్ల పేర్లు బయటకు రావడంతో దీనిపై ఎక్కువ ప్రచారం జరిగిందని ఆయన అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లా డారు. తెలుగు దర్శకులకు జాతీయస్థాయిలో పెద్దగా గుర్తింపు రాకపోవడానికి కారణం తెలుగు చిత్రసీమపై ఉన్న చిన్నచూపేనని ఆయన విమర్శించారు.

పునర్జీవ సభను విజయవంతం చేయండి



బాల్కొండ, కెఎన్ఎన్: ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటన సందర్భంగా చేస్తున్న ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి హరీష్‌రావు సూచించారు. ఆదివారం నిజామాబాద్ జిల్లా, బాల్కొండ మండలంలోని పోచంపాడ్‌లో 10న జరిగే పునర్జీవ సభ ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్థానిక ఎమ్మెల్యే, మిషన్ భగీరథ వైస్ చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డితో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. బహిరంగ సభ వేదిక, ప్యలాన్, వాహనాల పార్కింగ్, తదితర వాటిని అధికారులకు పలు సూచనలు చేశారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ఏర్పాట్లు వేగంగా చేయాలని తెలిపారు. బహిరంగసభకు అత్యధికంగా తరలివచ్చే విజయవంతం చేయాలని కోరారు.

కేసీఆర్‌వి ఉత్తుత్తి హామీలు

శాసన మండలి విపక్ష నేత షబ్బీర్‌అలీ

కామారెడ్డి, కెఎన్ఎన్ : 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రంలోని రైతులందరికి రూ.2 లక్షల వరకు రుణమాఫీ పథకాన్ని ఒకేసారి వర్తింపజేస్తామని, ఇండ్లు లేని నిరుపేదలకు వారి స్వంత స్థలాల్లోనే ఇండ్లు కట్టి ఇస్తామని, మొదటి సంతకం వీటిపై చేస్తామని శాసన మండలి విపక్షనేత షబ్బీర్‌అలీ కామారెడ్డిలో ఆదివారం అన్నారు. ఈ మేరకు జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా నియామకం అయిన జమున రాథోడ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షునిగా రాములు నియామకం అయిన సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఆచరణ సాధ్యం కానీ వాగ్ధానాలు చేస్తున్నారని విమర్శించారు. రైతులకు రుణమాఫీ అని చెప్పి నాలుగు విడతలుగా మాఫీ చేస్తామని చెప్పి మూడు సం.లు గడిచిన ఇప్పటికి రుణమాఫీ చేస్తామని చెబుతూనే ఉంటూ కొంత మంది రైతులకు రుణమాఫీ కాక బ్యాంకుల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారని ఆరోపించారు. అలాగే రాష్ట్రంలో ఇండ్లులేని వారికి డబుల్‌బెడ్‌రూంలు నిర్మిస్తామని చెప్పి ఇప్పటి వరకు నామమాత్రంగానే కొన్ని ప్రాంతాల్లో నిర్మించి వాటినే నిర్మిస్తున్నామని ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు.



యూఏఈలో భారతీయుడికి జాక్‌పాట్

• 1.3 మిలియన్ డాలర్ల లాటరీ

దుబాయి: యునైటెడ్ అరబ్ ఎమిరెట్స్‌లో నివసించేభారతీయ పౌరుడికి అబుదాబిలో నిర్వహించిన మెగా రాఫిల్ డ్రాలో 5 మిలియన్ దీర్హం...1.3 మిలియన్ డాలర్లు .. భారతీయ కరెన్సీ ప్రకారం (రూ.8.4 కోట్లు) జాక్‌పాట్ దక్కించుకున్నాడు. ఇక్కడ నిర్మాణరంగంలో పనిచేసే కృష్ణంరాజు తోకచిచ్చు తాజా బిగ్ 5 టిక్కెట్ డ్రాలో విజేతగా నిలిచారు.

అబుదబి అంతర్జాతీయ విమానాశ్రయం లాటరీ డ్రా తీయడం జరిగింది. డ్రా తర్వాత ఆయన మాట్లాడుతూ.. స్నేహితుల కోసం లాటరీ టిక్కెట్లు కొనుగోలు చేసే వాడినని, ఈ సారి తన అదృష్టాన్ని పరిక్షించుకోవాలని తనే టికెట్ కొనుగోలు చేయాలని నిర్ణయించుకున్నానని ఆయన గల్ఫ్ న్యూస్‌కుచెప్పారు.

లాటరీ తగలడం తనకు అతి పెద్ద ఊరట అని... ఇప్పటికే ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నానని, తీసుకున్న రుణాలు చెల్లించలేకపోతున్నాన్నారు. తాజాగా లాటరీ తగలడంతో తన ఇబ్బందులు తీరుతాయన్నారు. గత మూడు సంవత్సరాల నుంచి రాస్ అల్ ఖైమాలో టిక్కెట్లు కొనుగోలు చేస్తున్నానన్నారు. ప్రతి నెల కొంత సొమ్ము టిక్కెట్ల కోసం పక్కన పెడుతుంటానని చెప్పారు. లాటరీ తగిలిన వెంటనే సంతోషంతో తన తల్లికి ఫోన్ చేశానని చెప్పారు.

2008లో యూఏఈకి వచ్చిన కృష్ణంరాజు నెలకు 10,000 దర్హమ్‌ల కంటే తక్కువ సంపాదిస్తున్నాడు.. పిల్లల చదువు కోసం కొంత డబ్బును పొదుపు చేస్తున్ననన్నాడు.

అమెజాన్ గ్రేట్ ఇండియా బిగ్ సేల్

• ఈ నెల 9నుంచి 12 వరకు

• మొబైల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్స్‌పై డిస్కౌంట్లు

హైదరాబాద్: అమెజాన్ గ్రేట్ ఇండియా సేల్ మరోసారి కస్టమర్లను ఆకర్షించేందుకు ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు ముందుకొస్తుంది. అమెజాన్ వెబ్‌సైట్ పెద్ద పెద్ద ఆఫర్లను ప్రకటించింది. వాటిలో మొబైల్స్, యాక్సెసరీస్; ఎలక్ట్రానిక్స్, హోం అండ్ కిచెన్ అప్లియెన్సెస్, ఫ్యాషన్ బ్రాండ్స్‌లపై పెద్దెత్తున డిస్కౌంట్లను ఆఫర్ చేస్తావంటోంది. ఎస్‌బీఐ కార్డుపై ఆఫర్ మొబైల్స్, యాక్సెసరీస్‌పై 40 శాతం వరకు, పర్సెనల్‌కేర్ ప్రాడక్టులపై 30శాతం వరకు డిస్కౌంట్ ప్రకటించింది. ఇదిలా ఉండగా జులై 13 అమెజాన్ సుమారు రూ.130కోట్లను అమెజాన్ పే ఇండియాకు పెట్టుబడులు సమకూర్చింది. మార్కెట్లో పోటీ కంపెనీలైన ఫ్లిప్‌కార్ట్‌కు చెందిన ఫోన్‌పేతో పాటు ఆలీబాబాకు చెందిన పేటీయంకు గట్టి పోటీ ఇవ్వాలనుకుంటోంది. అమెజాన్ కార్పొరేట్ హోల్డింగ్స్, అమెజాన్ డాట్‌కామ్‌లు కలిసి అమెజాన్ పే ఇండియాలో తాజాగా రూ.130 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టాయని కార్పొరేట్ మంత్రిత్వశాఖకు అందజేసిన డాక్యుమెంట్ల ద్వారా తెలుస్తోంది. దీనికి ప్రభుత్వం జూన్ 28న ఆమోదం తెలిపింది. ఇక అమెజాన్ ఇండియా విషయానికి వస్తే భారత్ మార్కెట్లో ఎంట్రీ ఇచ్చి నాలుగు సంవత్సరాలు పూర్తి చేసింది. దీంతో గిడ్డంగుల నిర్మాణం, లాజిస్టిక్ వ్యవస్థను బలోపేతం చేసుకుంటోంది.

విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు

• ఈ నెలలో రూ.5వేల కోట్లు


ముంబై: విదేశీ పోర్టుపోలియో ఇన్వెస్టర్లు గత నాలుగు ట్రేడింగ్ సెషన్‌లలో డెట్ మార్కెట్లో రూ.5000 కోట్ల పెట్టుబడులు పెట్టాయి. దీంతో డాలర్ మారకంతో రూపాయి బలపడింది. అయితే ఆశ్చర్యకరం ఏమిటంటే ఇదే విదేశీ ఫోర్టుపోలియో ఇన్వెస్టర్లు స్టాక్‌మార్కెట్ల నుంచి రూ.1,500 కోట్లు ఉపసంహరించుకుపోయాయి. తాజా గణాంకాలను పరిగణనలోకి తీసుకుంటే ఆగస్టు 1-4 వరకు డెట్ మార్కెట్లో 811 మిలియన్‌డాలర్లు లేదా రూ.5,181 కోట్లు పెట్టుబడులు పెట్టాయి. అంతకు ముందు వీరే రూ.2,300 కోట్లు ఉపసంహరించుకున్నారు. తాజా గణాంకాలను పరిగణనలోకి తీసుకుంటే డెట్ మార్కెట్లో ఈ ఏడాది పెట్టుబడులు రూ.1.2 లక్షల కోట్లు లేదా 18 బిలియన్ డాలర్లు వచ్చాయి. గత కొన్ని నెలల నుంచి డెట్ మార్కెట్లో పెద్దమొత్తంలో పెట్టుబడులు వస్తున్నాయి. అయితే ఆర్‌బీఐ ద్రవ్యపరపతి సమీక్షలో వడ్డీరేట్లు తగ్గించర్న అంచనాతో కాస్తా పెట్టుబడులు మందగించాయి. అటు తర్వాత ఆర్‌బీఐ వడ్డీరేట్లు తగ్గించడంతో మళ్లీ యధావిధిగా పెట్టుబడులు మొదలయ్యాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. దీంతో పాటు మార్కెట్ నియంత్రణా సంస్థ సెబి గత జులై నెలలో ప్రభుత్వ సెక్యూరిటీల్లో ఎఫ్‌పీఐ పరిమితి ఎఫ్‌పీఐ పరిమితిని పెంచింది.

'స్మార్ట్స్'లో శ్యాంసంగ్ టాప్!

• ప్రపంచవ్యాప్తంగా పెరిగిన అమ్మకాలు

ప్రపంచవ్యాప్తంగా స్మార్ట్‌ఫోన్ల అమ్మకాలు గత ఏడాది రెండవ త్రైమాసికానికి (అంటే జూన్ 2016 చివరి) నాటికి వార్షిక ప్రాతిపదికన ఆరు శాతం పెరిగి 34 కోట్ల యనిట్లు అమ్ముడు పోయాయి. అదే ఈ ఏడాది రెండవ త్రైమాసికం ముగిసే నాటికి (అంటే జూన్ 2017) నాటికి అమ్మకాలు 36 కోట్లకు ఎగబకాయని తాజాగా స్ట్రాటజీ ఎనలిటిక్స్ తాజా పరిశోధనలో వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా స్యాంసంగ్ తన హవా కొనసాగిస్తోంది. గ్లోబల్ మార్కెట్లో స్యాంసంగ్ మొత్తం 22 శాతం వాటాను దక్కించుకుంది. కాగా ఆపిల్ విషయానికివ వస్తే కాస్తా తగ్గి 11 శాతం, జియోమి విషయానికి వస్తే వార్షిక ప్రాతిపదికన 58 శాతం పెరిగింది. ఈ ఏడాది మొట్టమొదటిసారి టాప్ ఐదు ర్యాంకుల్లో జియోమి స్థానం సంపాదించుకుంది.

స్యాంసంగ్: ఈ ఏడాది రెండవ త్రైమాసికానికి స్యాంసంగ్ మొత్తం 7.9 కోట్ల స్మార్ట్‌ఫోన్లు గ్లోబల్ మార్కెట్లో విడుదల చేసింది. క్రితం ఏడాది అంటే క్యూ2 2016లో 7.7 కోట్లతో పోల్చుకుంటే అమ్మకాలు 2 శాతం పెరిగాయి. అయితే స్యాంసంగ్ గతేడాది గెలాక్సీ నోట్ 7 బ్యాటరీ వివాదం నుంచి (గెలాక్సీ నోట్ 7 బ్యాటరీ పేలిపోయిన విషయం తెలిసిందే). అటు తర్వాత అమ్మకాలు పెంచుకునేందుకు కొత్త గెలాక్సీ ఎస్8ను తన పోర్టుపోలియోలో చేర్చుకుంది. సరికొత్త డిజైన్‌తో కొనుగోలు దార్లను ఆకర్షించింది. విశ్లేషకులు మాత్రం గెలాక్సీ నోట్8 అప్‌గ్రేడ్‌తో .. అంటేపెద్ద స్ర్కీన్‌తో వస్తే రాబోయే వారాల్లో మార్కెట్లో మరింత బలపడుతుందన్న అభిప్రాయానికి వచ్చారు.



మొత్తం మార్కెట్లో విడుదల చేసిన యూనిట్లు 7.9 కోట్లు

గ్లోబల్ మార్కెట్లో వాటా 22.1 శాతం

యాపిల్: యాపిల్ విషయానికి వస్తే వార్షిక ప్రాతిపదికన చూస్తే 1 శాతం పెరిగి 4.1 కోట్ల స్మార్ట్‌ఫోన్లను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసింది. క్యూ2, 2017 నాటికి 11 శాతం వాటాను దక్కించుకుంది. క్రితం ఏడాది 12 శాతం మార్కెట్ వాటా ఉంది. యాపిల్ ఐ-ఫోన్ విషయానికి వస్తే చైనా మార్కెట్లో ఔట్ ఆఫ్ ఫ్యాషన్ అయిపోయింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా దీనిపై మోజు తగ్గింది. ప్రస్తుతం ప్రజలంతా యాపిల్ ఐఫోన్-8 దృష్టి కేంద్రీకరించారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ ఏడాది చివరి నాటికి మార్కెట్లో వస్తుందన్న వార్తలు వినిపిస్తున్నాయి. కంపెనీ పదవ వార్షికోత్సవ సందర్భంగా కొత్త మోడల్‌ఫోన్‌ను పరిచయం చేస్తుందా లేదా వేచి చూడాల్సిందే. క్యూ4 నాటికి పాశ్చత్య దేశాల్లో (క్రిస్మస్, కొత్త సంవత్సరం సందర్భంగా ఆకర్షణీయమైన స్మార్ట్‌ఫోన్‌ను మార్కెట్లో విడుదల చేసి అమ్మకాలు పెంచుకుంటుందా లేదా చూడాల్సి ఉంది.



మార్కెట్లో విడుదల చేసిన యూనిట్లు 4.1 కోట్లు.

గ్లోబల్ మార్కెట్లో వాటా 11 శాతం.

హువాయ్: తాజా నివేదిక ప్రకారం చూస్తే హువాయ్ నెంబర్ మూడు స్థానాన్ని నిలబెట్టుకుంది. గ్లోబల్ మార్కెట్లో 10.7 శాతం వాటాను ఈ ఏడాది రెండవ త్రైమాసికంలో దక్కించుకుంది. ఏడాది ప్రాతిపదికన ఆరు శాతంవృద్ధి చెందుతోంది. మొత్తం 3.8 కోట్ల స్మార్ట్‌ఫోన్లను మార్కెట్లో విడుదల చేసింది. మొత్తానికి హువాయ్ త్వరలోనే యాపిల్‌ను వెనక్కినెట్టెట్టు కనిపిస్తోంది. రాబోయే కొన్ని త్రైమాసికాల్లో యాపిల్ తనను మించిపోతుందన్న ఆందోళన కూడా యాపిల్‌కు పట్టుకుంది. ఇక హువాయ్ విషయానికి వస్తే ఆసియా మొత్తానికి, యూరోప్, ఆఫ్రికా మార్కట్లో దూసుకుపోతోంది. బాగా ప్రసిద్దిచెందిన యాండ్రియాడ్ మోడల్ ఉదాహరణకు పీ10,మేట్ 9కు మంచి స్పందన లభించిందని స్ట్రాటజీ ఎనలిటిక్స్ డైరెక్టర్ వుడీ ఓహెచ్ చెబుతున్నారు.



ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసిన యూనిట్లు 3.8 కోట్లు

గ్లోబల్ మార్కెట్లలో వాటా 10.7 శాతం


ఒప్పో: ఇక ఒప్పో విషయానికి వస్తే ప్రపంచవ్యాప్తంగా 2.9 కోట్ల స్మార్ట్‌ఫోన్లను విడుదల చేసింది. ఈ ఏడాది రెండవ త్రైమాసికంలో నాలుగవ స్థానాన్ని ఆక్రమించింది. గ్లోబల్ మార్కెట్లో వాటా 8శాతంగా ఉంది. అయితే క్యూ2లో ప్రపంచవ్యాప్తం ఒప్పో ఏకంగా 64 శాతం వృద్ధిని సాధించింది. దీంతో మార్కెట్లో అతి పెద్ద పోటీ కంపెనీలైన జడ్‌టీఈ, ఎల్‌జీ, టీసీఎల్-ఆల్కాటెల్‌లను చైనా, ఇండియా, యూరోప్‌లో మించిపోయింది.



ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసిన ఫోన్లు 2.9 కోట్లు

గ్లోబల్ మార్కెట్ వాటా 8.2 శాతం

జియోమి: జియోమి విషయానికి వస్తే వార్షిక ప్రాతిపదికన 58శాతం వృద్ధిని సాధించి ఈ ఏడాది మొట్టమొదటిసారి 5వ స్థానాన్ని ఆక్రమించింది. దీంతో ఈ ఏడాది క్యూ2లో గ్లోబల్ స్మార్ట్ మార్కెట్‌లో ఆరు శాతం వాటాను సాధించింది. ప్రపంచవ్యాప్తంగా 2.3 కోట్ల స్మార్ట్‌ఫోన్లను విడుదల చేసింది. జియోమి మొత్తం యాండ్రియాడ్ రేంజి మోడల్స్‌ను మార్కెట్లో విడుదల చేసింది. ఉదాహరణకు రెడ్‌మి 4ఏ, తీసుకుంటే భారత్‌లో విశేష స్పందన లభించింది. దీని పోటీ కంపెనీలైన ఉదాహరణకు లెనోవో, మైక్రోమాక్స్‌ను మట్టి కరిపించింది. మాజీ గూగుల్ ఎగ్జిక్యూటవ హుగో బర్రా ఈ ఏడాది ప్రారంభంలో జియోమి నుంచి నిష్క్రమించిన తర్వాత నుంచి అమ్మకాలు జోరందుకున్నాయి. అయితే ఈ జోరు ఈ ఏడాది చివరి వరకు అలానే కొనసాగుతుందని కంపెనీ అంచనా వేస్తోంది.



మార్కెట్లో విడదలు చేసిన యూనిట్లు 2.3 కోట్లు

గ్లోబల్ మార్కెట్ వాటా 6 శాతం

నిధుల కోసం మార్కెట్లోకి.. పీఎస్‌యు బ్యాంకులు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగానికి చెందిన 12 బ్యాంకులు మార్కెట్ల నుంచి నిధులు సేకరించడానికి సన్నహాలు చేస్తున్నాయి. మూలధనం పెంచుకునేందుకు గ్లోబల్‌రిస్క్ నిబంధనలు - బాసిల్-3ని అమలు చేసేందుకు ఈ నిధులు సేకరించనున్నాయి. వాటిలో పీఎన్‌బీ, బ్యాంకు ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంకులు కూడా ఉన్నాయి. మరో 6-7 బ్యాంకులు వాటిలో ఆంధ్రాబ్యాంకు కూడా ఈ ఆర్థిక సంవత్సరంలోగా నిధుల సమీకరణను పూర్తి చేస్తుందని అధికారులు చెబుతున్నారు. మిగిలిన బ్యాంకులు ఫాలో ఆన్ పబ్లిక్ ఆఫర్ (ఎఫ్‌పీఓ)ద్వారా లేదా క్వాలిఫైడ్ ఇన్సిస్టిట్యూషన్ ప్లేస్‌మెంట్ (క్యూఐపీ) ద్వారా వచ్చే ఆర్థిక సంవత్సరం సేకరిస్తాయని తెలియజేశారు.

అలహాబాద్, ఆంధ్రాబ్యాంకు, బ్యాంకు ఆఫ్ ఇండియా, సెంట్రల్ బ్యాంకు ఆఫ్ ఇండియా, దేనాబ్యాంకు, ఐడీబీఐ బ్యాంకు, ఇండియన్ బ్యాంకు, పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ)లు ఇప్పటికే ప్రభుత్వం నుంచి నిధులు సేకరించుకోవడానికి అనుమతులు సంపాదించుకున్నాయి. ఇక సిండికేట్ బ్యాంకు, యూకోబ్యాంకు, యూనైటెడ్ బ్యాంకు ఆఫ్ ఇండియా, విజయాబ్యాంకులు ఇప్పటికే ప్రభుత్వం నుంచి అనుమతులు దక్కించుకున్నాయి నిధుల సేకరణ ప్రక్రియ కూడా మొదలుపెట్టాయి. ఉదాహరణకు అలహాబాద్ బ్యాంకు ఇప్పటికే వాటాదారుల నుంచి నిధులు సేకరించడానికి అనుమతులు పొందాయి. మొత్తం రూ.2,000 కోట్లకు క్యూఐపీ, లేదా ఎఫ్‌పీఓ, లేదా రైట్స్ ఇష్యూ ద్వారా సేకరించడానికి అనుమతులు దక్కించుకున్నాయి. పంజాబ్ నేషనల్ బ్యాంకు బోర్డు కూడా రూ.3,000 కోట్లు మూలధనం సేకరించానికి ఉదారణకు ఎఫ్‌పీఓ, క్యూఐపీ, రైట్స్ ఇష్యూ ద్వారా సేకరించడానికి వాటాదారుల నుంచి అనుమతులు పొందింది. దేనా బ్యాంకు విషయానికి వస్తేఇప్పటికే వాటాదారుల నుంచి అనుమతి పొందింది. వాటాదారుల నుంచి గరిష్ఠంగా రూ.1,800 కోట్లు సేకరించడానికి క్యూఐపీ లో పాటు రూ.10 ముఖ విలువ కలిగిన షేరుపై ప్రీమియం విధించి సేకరించాలని నిర్ణయించింది. ఇంద్ర ధనుష్యా రోడ్‌మ్యాప్ కింద ప్రభుత్వ రంగానికి చెందిన బ్యాంకులకు మార్కెట్ల నుంచి రూ.1.10 లక్షల కోట్లు అవసరం అవుతాయి.

వాటిలో ఫాలోఆన్ పబ్లిక్ ఆఫర్ కూడా ఉంటుంది. మార్చి 2019 నుంచి అమల్లోకి రావాల్సిన బాసిల్ -3 నిబంధనలు ఖచ్చితంగా బ్యాంకులు అమలు చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం బ్యాంకులకు రూ.70 వేల కోట్ల వరకు మూలధనం సమకూరుస్తామని ప్రకటించింది.

దీని అదనంగా రూ.1.10 లక్షల కోట్లు నిధులు అవసరం అవుతాయి. ప్రభుత్వం సమకూరుస్తామన్న రూ.70వేల కోట్లకు గాను ఇప్పటికే రూ.50వేల కోట్లు గత రెండు ఆర్థిక సంవత్సరాల నుంచి సమకూర్చింది. మిగిలిన మొత్తాన్ని 2018-19 ఆర్థిక సంవత్సరంలో సమకూరుస్తుంది. ఈ ఏడాది జూన్‌లో ఎస్‌బీఐ రూ.15,000 కోట్లను సమకూర్చుకుంది మొత్తం 52.2 కోట్ల షేర్లను క్యూఐపీ ద్వారా సెకండరీ మార్కెట్లో విక్రయించింది. సేకరించిన నిధులను క్యాపిటల్ అడిక్వెయో రేషియాతో పాటు కార్పొరేషన్ అవసరాల కోసం వినియోగిస్తుంది.

కాగ్నిజెంట్‌లో 400 జాబ్స్ హుష్..!

• ఏడాది 60 మిలియన్ డాలర్ల ఆదా

చెన్నై: ఐటి దిగ్గజం కాగ్నిజెంట్ టెక్నాలజీస్ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లకు ఆఫర్ చేసిన స్వచ్ఛంద పదవీ విరణమకు (వీఆర్ఎస్)కు 400 మంది సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు ఆమోదం తెలిపారు. వీరందరు తప్పుకుంటే ఏడాదికి 60 మిలియన్ డాలర్లు ఆదా అవుతుందని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఏడాది మేలో కంపెనీ స్వచ్ఛంద పదవీ విరమణ పథకాన్ని తెరపైకి తెచ్చింది. అమెరికాతో పాటు ఇండియాలో పనిచేస్తున్న ఉన్నతా స్థాయి ఎగ్జిక్యూటివ్‌లు స్వచ్ఛంద పదవి విరమణ చేస్తే తొమ్మిది నెలల వేతనం ఇస్తామని ప్రకటించింది. కాగా కంపెనీలో మొత్తం 2.56 లక్షల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వారిలో మెజారిటీ సిబ్బంది భారత్‌లో ఉన్నారు. అయితే భారత్‌కు చెందిన ఎగ్జిక్యూటివ్‌లు ఎంతమంది వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకొన్నారో తెలియజేయలేదు. 400 అసోసియేట్ల కోసం 35 మిలియన్ డాలర్ల వరకు వ్యయం అవుతుందని, అయితే తమ అంచనా ప్రకారం వీరిపై ఏడాదికి 60 మిలియన్ డాలర్ల వరకు ఆదా అవుతుందని కాగ్నిజెంట్ సీఎఫ్ఓ కరెన్ మెక్ లోగ్లిన్ ఇటీవల ఇన్వెస్టర్ కాల్‌లో మాట్లాడుతూ చెప్పారు. ఈ సర్దుబాట్లు జరిగిన తర్వాత కంపెనీ మంచి లాభాలను ఆర్జించగలుగుతుంద న్నారు. కాగా మార్చి చివరి నాటికి కంపెనీ ఉద్యోగుల సంఖ్య 4,400 వరకు తగ్గిందని, అయితే జూన్ త్రైవమాసికానికి అదనంగా 10,800 మందిని ఉద్యోగాల్లోకి తీసుకున్నామని తెలిపారు. కాగ్నిజెంట్ డిజిటల్ వ్యాపారం కోసం నిపుణులైన ఉద్యోగులను తీసుకుంటామని ఆమె వివరించారు. మొత్తానికి చూస్తే కంపెనీ వలసల సంఖ్య ఎక్కువే అన్నారు. సంవత్సరం ప్రాతిపదికన చూస్తే బీపీఓ, ట్రైనీలను కూడా కలుపుకుంటే 23.6 శాతానికి ఎగబాకిందని,, క్రితం ఏడాది ఇదే జూన్‌లో 17.1శాతమని తెలిపారు. అయితే రాబోయే నెలల్లో వలసలు తగ్గుతాయని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. కాగ్నిజెంట్ ప్రెసిడెంట్ రాజీవ్ మెహతా మాట్లాడుతూ ఈ ఏడాది నైపుణ్య ఆధారిత రంగాలకు ఉదాహరణకు ఎనలిటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్సెస్, డిజిటల్ సెక్యూరిటీ రంగాల్లో మిలియన్‌ల కొద్ది డాలర్లను పెట్టుబడులను పెడుతున్నట్లు తెలిపారు.





• ఉద్యోగుల వేతనాల్లో సరాసరి 6 శాతం పెంపు

• భారీగా పేరుకుపోయిన నష్టాలు

టాటాస్టీల్ ఎండీ వేతనం రూ.8.17 కోట్లు

న్యూఢిల్లీ: టాటాస్టీల్ మేనేజింగ్ డైరెక్టర్ (ఇండియా, ఆగ్నేయాసియా) టీవీ నరేంద్రన్ గత ఆర్థికసంవత్సరం అంటే 2016-17లో రూ.8.17 కోట్ల వేతనం తీసుకున్నారు. అంతకు ముందు ఆర్తికసంవత్సరం రూ.7.3 కోట్లతో పోల్చుకుంటే 11.87 శాతం పెరిగింది. ఈ వివరాలన్నీ కంపెనీ వార్షిక నివేదికలో పొందుపర్చింది. గ్రూపు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఫైనాన్స్, కార్పొరేట్, యూరోప్) కౌశిక్ చటర్జీ వేతనం కూడా 10.06 శాతం పెరిగి రూ.8.09 కోట్లకుచేరింది.. అంతకు ముందు ఆర్థికసంవత్సరం 2015-16లో ఆయన రూ.7.36 కోట్లు తీసుకున్నారు. కంపెనీ సెక్రెటరీ పార్వతీశం కె వేతనంలో 24.98 శాతం పెరిగి రూ.1.53 కోట్లు తీసుకున్నారు. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం రూ.1.22 కోట్లు మాత్రమే. యాజమాన్యంలోని కీలకమైన వ్యక్తుల వేతనాల్లోపెద్దగా మార్పుల్లేవని కంపెనీ వార్షిక నివేదికలో వివరించింది. కాగా ఆర్థిక ఫలితాలు చూస్తే గత ఆర్థికసంవత్సరం నికర నష్టం రూ.4,168.57కోట్లకు ఎగబాకగా.. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం రూ.497.07 కోట్లు. కాగా యాజమాన్యంలోని కీలక వ్యక్తులను పక్కనపెడితే ఉద్యోగుల వేతనాల్లో 6.60 శాతం పెరిగింది. ఇండిపెండెంట్ డైరెక్టర్ల విషయానికి వస్తే నస్లీ వాడియాను బోర్డునుంచి వోటింగ్ ద్వారా తప్పించారు. వారి వేతనాల్లో 6.28 శాతం నుంచి 77.95 శాతం వరకు పెరిగింది.

చిన్న కార్లతో మారుతికి పెద్ద షాక్

• మారుతి సుజుకి కొత్త ఆల్టో 660 సీసీ ఇంజిన్

• చిన్న కార్ల రంగంలో తగ్గిన వాటా

• గట్టిపోటీ ఇస్తున్న రెనోక్విడ్, రెడీ గో

హైదరబాద్: మారుతి సుజుకి నెక్స్ జనరేషన్ ఆల్టో చిన్న కారును మార్కెట్లోకి తీసుకురానుంది. కారు చిన్నదే అయినా ఇంజిన్ మాత్రం పవర్‌ఫుల్‌గా ఉంటుంది. కొత్త ఆల్టో విషయానికి వస్తే 660 సీసీ పెట్రోల్ మోటార్‌తో పాటు బీఎస్ఈ -6 ప్రమాణాలను కలిగి ఉంటుంది. ఇంధన సామర్థ్యం కూడా ఎక్కువగా ఉంటుంది. ఈ కారు మొత్తానికి 2019 చివరి నాటికి దేశీయ మార్కెట్లోకి తీసుకురావాలని కంపెనీ గట్టిగా ప్రయత్నిస్తోంది. ఎ-1 సెగ్మెంట్‌కు చెందిన ఈ కారు ప్రస్తుతం మారుతి 800 సీసీ బీఎస్4 ప్రమాణాలు కలిగిన కారు ధర రూ.2.5 లక్షలుగా ఉండవచ్చు. అయితే ఈ కారును లైట్‌వెయిట్ ఫ్లాట్‌పాంలో రూపుదిద్దుతున్నారు. దీంతో చూసేందుకు ఆకర్షణీయంగా ఉంటుంది. ప్రస్తుతం ఆల్టో మోడల్ మాదిరాగానే భద్రతతో పాటు కర్బన ఉద్గారాలను మరింత మెరుగుర్చారు. ధర తక్కువ, మైలేజీ ఎక్కువ కాబట్టి కస్టమర్లకు అనుకూలంగా ఉంటుందని పేరు చెప్పడానికి ఇష్టపడని మారుతి సుజుకి అధికార ప్రతినిధి చెప్పారు. అయితే కంపెనీ నిబంధనల ప్రకారం భవిష్యత్తులో విడుదల చేసే మోడల్స్‌తో పాటు కొత్త ప్రాడక్టుల గురించి బహిరంగంగా వెల్లడించ రాదనే నిబంధన ఉంది కాబట్టి పూర్తి వివరాలు తెలియజేయలేమని ఆయన అన్నారు.

మారుతి సుజుకి 2015లో వచ్చే ఐదేళ్లలో కొత్తగా 15 మోడల్స్‌ను మార్కెట్లో విడదల చేయబోతున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. 2020 నాటికి రెండు మిలియన్ యూనిట్లు (20లక్షల) యూనిట్లు ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే ఇప్పటికే తొమ్మది మోడల్స్‌ను మార్కెట్లో విడుదల చేసింది. మరో ఆరు మోడల్స్ కొత్త స్విఫ్ట్‌ను మార్కెట్‌కు పరిచయం చేయబోతోంది.

మార్కెట్లో పెరిగిన పోటీ: రెనో క్విడ్, డాట్సన్ రెడీ గోల నుంచి మారుతి సుజుకి గట్టిపోటీని ఎదుర్కొంటోంది. దీంతో మారుతి సుజుకి అందరిని ఆశ్చర్యపరుస్తూ నెక్స్ జనరేషన్ ఆల్టో 660 సీసీ కారును ప్రకటించేసింది. దీంతో కంపెనీ ఎ - సెగ్మెంట్ విభాగంలో మరింత పట్టు సంపాదించుకోవచ్చు. ఇప్పటికే కొంత వాటాను రెనోక్విడ్‌కు, డాట్సన్‌కు సమర్పించుకుంది. వాటిని కూడా రాబట్టుకోవచ్చు. దేశంలో ఇప్పటికే చౌక కార్లకు ఎక్కువ డిమాండ్ ఉంది. ప్రస్తుతం కార్ల వినియోగం 35/1000గా ఉంది. వచ్చే దశాబ్దం నాటికి ద్విచక్ర వాహనదారులు పెద్దెత్తున కార్లను కొనుగోలుకు ముందుకు వస్తారని, వారంతా ఎఅండ్‌బి సెగ్మెంట్ కార్ల కొనుగోలు చేస్తారని మార్కెట్ రిసెర్చి కంపెనీలు చెబుతున్నాయి. చిన్న చిన్న పట్టణాల్లో చిన్న కార్లకు డిమాండ్ పెరుగుతుందని.. డీలర్ నెట్‌వర్కు పటిష్టంగా ఉంటే అమ్మకాలు మాత్రం జోరందుకుంటాయని చెబుతున్నారు.

చిన్న కార్లలో మారుతికి తగ్గిన వాటా: భారత ప్యాసింజర్ కార్ల మార్కెట్లో మారుతి సుజుకి రారాజు అనే విషయంలో ఎవరికి ఎలాంటి అనుమానాలు అక్కర్లేదు. అయితే ఏ సెగ్మెంట్ విభాగంలో మాత్రం రెనో క్విడి, రెడి గోల నుంచి గట్టిపోటీ ఎదుర్కొంటోంది. దీంతో చిన్న కార్ల విభాగంతో మారుతి వాటా తగ్గింది. ఇక్కడే మారుతి సుజుకి చిన్న తప్పు చేసింది. గత మూడు సంవత్సరాల నుంచి చిన్న కార్లను పట్టించుకోకుండా ప్రీమియం, యుటిలిటి కార్లపై దృష్టి పెట్టింది. కొత్తగా ప్రీమియం కార్లు బలెనో, బ్రెజ్జా, ఇగ్నిస్, ఎస్ క్రాస్ లాంటివి మోడల్స్‌పై ఫోకస్ పెట్టింది. దీంతో పోటీ కంపెనీలు చిన్న కార్లను మార్కెట్లో ఇబ్బడి ముబ్బడిగా విడుదల చేసి మారుతి వాటాను గండికొట్టాయి. దీంతో కళ్లు తెరిచిన మారుతి తిరిగి కొత్త రూపుతో ఆల్టోను విడుదల చేయాలనుకుంటోంది. తిరిగి మినీకారు సెగ్మెంట్‌లో కోల్పోయిన తమ వాటాను తిరిగి పొందవచ్చునని నమ్మకం కుదించింది.

ఆటో టాక్

మీడియాలో వస్తున్న వార్తలను బట్టి చూస్తే మారుతి సుజుకి కొత్త ఆల్టో (అంతర్గతంగా దీనికి వై1కె) కోడ్‌తో పిలుస్తున్నారు. హర్యానాలోని రోహటక్ ఆర్అండ్‌డిలో పనులు కొనసాగుతున్నాయి. స్థానిక కస్టమర్ల అభిరుచులకు, ఇక్కడ వాతావరణ పరిస్థితులకు తగ్గట్టు కారు ఇంజిన్, డిజైన్‌ను రూపుదిద్దుతున్నారు. ఆర్అండ్‌డిపైవచ్చే మూడు సంవత్సరాల కాలంలో రూ.2,000 కోట్ల వరకు పెట్టుబడులు పెడుతుంది. దీంతో రోహతక్ ఆర్అండ్‌డిపై మొత్తం పెట్టుబడులు రూ.3,800 కోట్లకు చేరుతాయి.



భాగ్యనగరంలో మరో డ్రగ్స్ ముఠా పట్టివేత

రూ. 10లక్షల విలువచేసే 180 గ్రాముల కొకైన్ స్వాధీనం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: హైదరాబాద్ యూసఫ్‌గూడలోని మధురానగర్ పార్క్ వద్ద మరో డ్రగ్స్ ముఠాను ఆదివారంనాడు టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. నైజీరియన్ దేశస్థుడైన జాన్ బాస్కో(37), ఏపీలోని తూర్పు గోదావరి జిల్లా కాకినాడకు చెందిన మొహమ్మద్ జహారుల్లా అలియాస్ సన్ని అలియాస్ ఎయిజాజ్(33)లను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.10 లక్షల విలువైన 180 గ్రాముల కొకైన్, నాలుగు సెల్‌ఫోన్‌లు, ఒక యాక్టివా హోండా బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసుకు సంబంధించిన వివరాలను టాస్క్‌ఫోర్స్ డీసీపీ లింబారెడ్డి మీడియాకు వెల్లడించారు. నైజీరియన్ జాన్ బాస్కో బిజినెస్ వీసాపై జూన్, 2006న ముంబైకి వచ్చాడు. అక్కడి నుంచే జాన్ బాస్కో డ్రగ్స్ దందా కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. జాన్ బాస్కో స్వతహాగా గార్మెంట్స్ ఎక్స్‌పోర్ట్స్ బిజినెస్ నిర్వర్తిస్తున్నాడు. ఏజెంట్స్ ద్వారా చైన్ సిస్టమ్‌లో ముంబై నుంచి హైదరాబాద్ ఇతర మెట్రోపాలిటన్ సిటీలకు కొకైన్‌ను చేరవేస్తుండే వాడని టాస్క్ ఫోర్స్ డీసీపీ లింబారెడ్డి తెలిపారు. జాన్‌బాస్కో ఒక గ్రాము కొకైన్‌కు రూ.2,000 నుంచి రూ.2,500 వరకు ఏజెంట్లకు విక్రయించేవాడని తెలిపారు. 2014లో హైదరాబాద్‌కు మకాం మార్చేశాడు. డ్రగ్స్ బానిస మొహమ్మద్ జహరుల్లాను ఓ ఈవెంట్‌లో జాన్ బాస్కో పరిచయమ య్యా డు. అప్పటి నుంచి జాన్ బాస్కో నుంచి కొకైన్‌ను జహరుల్లా తక్కువ రేటులో కొనుగోలు చేసి అవసరమైన కస్టమర్లకు అధిక రేట్లకు విక్రయిస్తుండేవాడు. కొన్ని సందర్భాల్లో జాన్ బాస్కో స్వయంగా హైదరాబాద్ టోలిచౌక్ ఏరియాకు వచ్చి కొకైన్‌ను జహరుల్లాకు అందజేసేవాడని పోలీ సులు తెలిపారు. తనకు 80 గ్రాముల కొకైన్ కావాలని జహరుల్లా నాలుగు రోజుల క్రితం జాన్ బాస్కోను సంప్రదించాడు. ఇందుకు జాన్ బాస్కో అంగీకరించాడు. జాన్‌బాస్కో మొత్తం గా 180 గ్రాముల కొకైన్‌ను తన వెంట తీసుకు వచ్చాడు. అందులో 80 గ్రాములు జహరుల్లాకు అందజేసి మరో ఏజెంట్‌కు డెలివరీ కావాల్సిన 100 గ్రాముల కొకైన్‌ను తనవద్దనే ఉంచుకున్నాడు. విశ్వసనీయంగా సమాచారం తెలుసుకున్న నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు జాన్ బాస్కో, జహీరుల్లాలను అరెస్టు చేశారు. నిందితులను ఎస్‌ఆర్‌నగర్ పోలీసుస్టేషన్‌కు తదుపరి విచారణ నిమిత్తం అప్పగించినట్లు డీసీపీ లింబారెడ్డి తెలిపారు.

భారతీయ న్యాయవ్యవస్థ పవిత్రమైనది

హైకోర్టు న్యాయమూర్తి బి. శివశంకర్‌రావు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న హై కోర్టు న్యాయమూర్తి బి శివశంకర్‌రావు

సూర్యాపేట, కెఎన్‌ఎన్: భారతీయ న్యాయ వ్యవస్థ పరమ పవిత్రమైందని హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ బి శివశంకర్‌రావు అన్నారు. ఆదివారం సూర్యాపేట పట్టణంలో రూ. 8 కోట్లతో నిర్మించిన మూడు కోర్టుల బిల్డింగ్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవం అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. న్యాయ వ్యవస్థ ప్రతిష్టను ఇనుమడింప చేయాల్సిన బాధ్యత న్యాయమూర్తులు, న్యాయవాదులకు ఉందన్నారు. అభియోగాల నమోదులో పారదర్శకంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని పోలీస్, రెవెన్యూ అధికారులను కోరారు. క్లైంట్‌కు లబ్ధి చేకూర్చేందుకు మాత్రమే కేసులు వాదించరాదని న్యాయ వాదులకు సూచించారు. కక్షలు పక్కన పెట్టి చిన్న చిన్న వివాదాలను రాజీ మార్గంలోనే పరిష్కరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. క్షణికావేశంలో జరిగే తప్పుల వలన రెండు వైపుల ఉన్న కుటుంబాలకు నష్టం జరుగుతుందన్నారు. మనిషి అహం అనే భావ నను విడనాడాలన్నారు. సామాజిక దృక్పథంతో శాంతీయుతంగా జీవించా లన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తులు ఏ రాజశేఖర్‌రెడ్డి, డాక్టర్ షమీం అక్తర్, జి శ్యాం ప్రసాద్, రాష్ట్ర విద్యుత్, ఎస్సీ కులాల అభివృద్ధి శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ కె సురేంద్రమోహన్, సూర్యాపేట రెండవ అదనపు జిల్లా న్యా యమూర్తి ఎస్‌కె రజాక్ ఉల్ జుమా, ఎస్పీ పరిమళ హణ నూతన్, మున్సిపల్ చైర్ పర్సన్ ప్రవళిక ప్రకాష్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు జి వెంకటేశ్వర్ రావు, ఆర్డీవో మోహ న్‌రావు, ఉమ్మడి జిల్లా న్యాయాధికారులు, న్యాయవాదులు తదితరులు ఉన్నారు.

పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టాలి

పార్లమెంటు ముందు భారీ ప్రదర్శన



హైదరాబాద్,ఆంధ్రప్రభ: ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే బీసీ బిల్లు పెట్టాలని డిమాండ్ చేస్తూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆదివారం పార్లమెంటు ముందు భారీ ప్రదర్శన చేపట్టింది. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్, హర్యానా రాష్ట్రా లకు చెందిన బీసీలు ప్రదర్శనలో పాల్గొన్నారు. సంఘం జాతీయ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య నాయకత్వంలో ప్రదర్శన జరిగింది. ఈ కార్యక్రమంలో ఎర్ర సత్యనారాయణ, వరప్రసాద్ యాదవ్, గుజ్జ కృష్ణ, శారదా గౌడ్, ఆర్ సత్యనారాయణ, కోలా జనార్ధన్, కర్రి వేణుమాధవ్, కృష్ణుడు, గుజ్జ రమేష్, నీల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. కేంద్రంలో ఖాళీగా ఉన్న 12 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో 1470 ఐఏఎస్, 1059 ఐపిఎస్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వ శాఖలతోపాటు, ప్రభుత్వ రంగ సంస్థల్లో రిజర్వేషన్లను పూర్తిగా అమలు చేయాలని ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. గుజ్జర్లు, పటేళ్ళు చేసినట్టు మిలిటెంట్ పోరాటాలు చేస్తేనే కేంద్ర ప్రభుత్వం దిగి వస్తుందని అన్నారు. బంద్‌లు జరిపి, ప్రజాజీవితం స్థంభింప చేస్తేనే బీసీలకు జరిగే అన్యాయాలను ప్రభుత్వాలు గుర్తించి న్యాయం చేసే దిశగా కదులుతాయని అన్నారు. త్వరలోనే ఉత్తర్‌ప్రదేశ్, రాజస్థాన్, బీహార్, మధ్యప్రదేశ్ రాష్ట్రా ల్లో పర్యటిస్తానని ఆర్ కృష్ణయ్య తెలిపారు. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో దేశ వ్యాప్తంగా 54 లక్షల మంది ఉద్యోగులు ఉండగా వారిలో బీసీ ఉద్యోగులు కేవలం 5.60 లక్షల మంది మాత్రమే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు ఉద్యోగాల్లో కేవలం 10 శాతం మాత్రమే ప్రాతినిధ్యం ఉందని అన్నారు. 67 ఏళ్లుగా బీసీలకు అన్యాయం జరుగుతూనే ఉందన్నారు.

గొర్రెల మందపైకి దూసుకెళ్లిన ఇసుకలారీ

- లారీ డ్రైవర్‌ను నరికిన గొర్రెల కాపరి
- ప్రాణాపాయ స్థితిలో డ్రైవర్



చెల్పూర్ , కెఎన్‌ఎన్ : జయశంకర్ భూపాలపల్లి జిల్లా, గణపురం మండలం చెల్పూర్ శివారు కుందురుపల్లి సమీపంలోని భద్రకాళి ఎస్టేట్ వద్ద మేతకు పోయిన గొర్రెల మంద రోడ్డు దాటుతుండగా కాళేశ్వరం నుండి హైదరాబాద్‌కు వెళ్లే ఇసుక లారీ గొర్రెల మందపైకి దూసుక వెళ్లడంతో 35 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. సంఘటన జరిగినప్పటికి డ్రైవర్ లారీని ఆపకుండా వెళ్ళిపోవడంతో ఆగ్రహానికి గురైన గొర్రెల కాపరి బానోతు చంద్రయ్య మోటరు వాహనం పై వెంబడించి కుందయ్య పల్లి వద్ద లారీని అడ్డుకుని డ్రైవర్ ను గొడ్డలితో మెడపై నరికాడు. దీంతో రక్తస్రావంతో పడి ఉన్న డ్రైవర్‌ను స్థానికులు 108లో వరంగల్ ఆస్పత్రికి తరలించారు. గణపురం ఎస్సై ప్రవీణ్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. డ్రైవర్ జమాల్ ఊరు భువనగిరి కాగా అతనికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఇద్దరు జనశక్తి నక్సలైట్లు అరెస్ట్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ నర్సింహారెడ్డి

సిద్దిపేట, కెఎన్‌ఎన్ : జనశక్తి పార్టీ పునఃనిర్మాణం చేయడానికి ఆయుధాలతో తిరుగుతున్న ఇద్దరు జనశక్తి నక్సలైట్లను సిద్దిపేట జిల్లా, చిన్నకోడూర్ మండలం గంగాపూర్ గ్రామంలోని వ్యవసాయ భూమి వద్ద అరెస్ట్ చేసి రెండు రివాల్వ ర్లు, తూటాలను స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ నర్సింహారెడ్డి తెలిపారు. ఆదివారం సిద్దిపేట జిల్లా ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ జనశక్తి పార్టీకి చెందిన శ్రీనివాస్‌రెడ్డి అలియాస్ యాదన్న, వసంత్‌లు జనశక్తి కార్యకలాపాలను బలోపేతం చేయడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. జనశక్తి పార్టీని పునఃనిర్మాణంలో భాగంగా కూర రాజన్న, అమర్, దేవేందర్, నర్సారెడ్డి అలియాస్ విశ్వనాథం, భీం భరత్‌తో పాటు 60 మంది జనశక్తి కార్యకర్తలు రంగారెడ్డి జిల్లా చేవెళ్లలోని ఒక ప్రైవేటు కళాశాలలో జూన్ 24నుంచి 26వరకు ప్లీనరీ నిర్వహించి పలు తీర్మాణాలు చేశారన్నారు. యాదన్నను రాష్ట్ర కమిటీ సభ్యులుగా చేస్తూ ఆయుధాలు తెప్పించాలని సూచించగా కరీంనగర్ జిల్లా, గర్జెనపల్లికి చెందిన వసంత్ గతంలో సానుభూతిపరునిగా పని చేసిన పరిచయంతో బాంబేలో ఉంటున్న వసంత్ దగ్గరికి ఆయుధాలు కావాలని కోరగా బీహార్‌కు చెందిన వారి నుంచి రూ.35 వేలకు ఒక రివాల్వర్ తెచ్చారన్నారు. తూటాలను వాటిని పరిశీలించిన అనంతరం మరికొన్ని ఆయుధాలు తెప్పించుకోవ డానికి డబ్బులు తీసుకెళ్లగా మరో రివాల్వర్‌ను తెప్పించుకొని దళాల ఏర్పాటుకు ప్రజా పోరాటం చేయాలనిభావించారన్నారు.

ఈ ఏడాది అధిక స్థాయిలో మట్టి గణపతులు

మట్టి విగ్రహాలను ప్రతిష్టించే వారికి ప్రోత్సాహకాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : పర్యావరణహితమైన మట్టి వినాయకులను పూజించే విధంగా ప్రజల్లో అవగాహన పెంపొందించడానికి కాలుష్య నియంత్రణ మండలి విస్తృత ప్రచారం నిర్వహించేందుకు సిద్దమైంది. రంగులతో తయారు చేసే విగ్రహాల వలన పర్యావరణానికి హాని కలుగుతుందనే విధాంగా ప్రచార కార్యాచరణ రూపొందుతుంది. ప్రభుత్వ, స్వచ్చంద సంస్థలను ఇందులో భాగస్వామ్యం చేయబోతు న్నారు. మట్టి వినాయకులను ప్రతిష్టించే వారికి ప్రోత్సాహక బహుమతులు ఇచ్చే విషయం పరిశీలనలో ఉంది. స్వచ్ఛంధ సంస్థల సహకారంతో మట్టి వినాయకులను పెద్ద ఎత్తున పంపిణీ చేసేందుకు కార్యాచరణ రూపొందించబడుతుంది. ఈ నెల 25న వినాయక చవితి పర్వదినం సందర్భంగా వివిధ శాఖలు, స్వచ్ఛంధ సంస్థలతో ఇప్పటికే సంప్రదింపులు ప్రారంభించింది. తెలంగాణలోని అన్ని నగరాలు, పట్టణాల్లో మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమం జరిగే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. గత సంవత్సరం నిర్వహించిన ప్రచారానికి మంచి స్పందన వచ్చింది. ఈ సంవత్సరం మరింతగా ప్రజా స్పందన పెంచేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. వివిధ సైజుల్లో విగ్రహాలను తయారు చేయించి పెద్ద ఎత్తున పంపిణీ చేయబోతున్నారు. నగరాలు, పట్టణాల్లో ప్రతిష్టించే వినాయక విగ్రహాల్లో కనీసం మూడవ వంతైనా మట్టి విగ్రహాలు ప్రతిష్టించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. మట్టి విగ్రహాలను ప్రతిష్టించే వారికి తోడ్పాటు, ప్రోత్సాహకం, బహుమతులు ఇచ్చేందుకు నగరపాలక సంస్థలు ముందుకు రావాలని పర్యావరణ వేత్తలు కోరుకుంటున్నారు. భారీ విగ్రహాలకంటే కూడా ఐదు అడుగుల విగ్రహాలే మంచిదని సూచిస్తున్నారు. ఇంటిలో మట్టి విగ్రహాలను పూజించే వారి సంఖ్య 90 శాతానికి చేరుకుందని స్వచ్ఛంద సంస్థలు నిర్వహించిన సర్వేలో వెల్లడయింది. మండపాల్లో ప్రతిష్టించే విగ్రహాల్లో కనీసం 50 శాతం వరకు మట్టి విగ్రహాలకు స్థానం కలిగించే విధంగా అవహాన పెంపొందించడం పై పర్యావరణ వేత్తలు, స్వచ్చంద సంస్థలు, ప్రభుత్వ శాఖలు చర్యలు తీసుకుంటున్నాయి.

ఇండో-చైనా వార్ తప్పదా?


డోక్లామ్‌లో భారత్‌తో వివాదం

- అది చైనా-అమెరికా యుద్ధం
- అందులో భారత్ పాల్గొంటుంది
- బ్రిటన్‌లో భారత సంతతి ఆర్థికవేత్త అంచనా
- తొందర్లోనేనని హెచ్చరిక


దక్షిణ చైనా సముదంలో డ్రాగన్ నిర్మాణాలు

న్యూఢిల్లీ: భారత్ ఎంత నిగ్రహంగా ఉన్నా చైనాతో యుద్ధం తప్పదంట. డొక్లాం విషయంలో మనం ఎంత చర్చలకోసం పాకులాడినా యుద్ధం మాత్రం తప్పదని విశ్లేషకుల అంచనా. డొక్లాం కోసమే చైనా యుద్ధానికి తెగిస్తుందా? ఆర్థికంగా ప్రయోజనం కాని విషయంలో అంత దూరం వెళుతుందా? అని సంశయాలు వెలిబుచ్చే వారికి బ్రిటన్‌లో భారత్ సంతతికి చెందిన ఆర్థిక వేత్త, అక్కడి హౌస్ ఆఫ్ లార్డ్స్‌లో సభ్యుడు అయిన మేఘనాథ్ దేశాయ్ సమాధానం చెబుతున్నారు. ఆయన డొక్లాం వివాదాన్ని దక్షిణ చైనా సముద్రంలో చైనా ప్రయోజనాలతను కలిపి చూస్తున్నారు. దక్షిణ చైనా సముద్రంలో చైనాకు వ్యతిరేకంగా ఆసియన్ దేశాలకు భారత్, అమెరికాలు మద్దతు తెలుపుతున్నాయి. అయితే.. దక్షిణ చైనా సముద్రంలో కృత్రిమ దీవుల నిర్మాణాలకు పూనుకుంటున్న చైనా అక్కడ ముందుగా మిలిటరీ స్థావరాలను, ఆ తరువాత సొంత రేవులను నిర్మించడానికి ప్రణాళికలు రచిస్తోంది. ఇప్పటికే కొన్ని నిర్మాణాలు పూర్తవడంతో చైనా ఆధిపత్యంపై ఆసియాన్ దేశాలతో పాటు భారత్‌కు కూడా ఆందోళన మొదలైంది. దీంతో అమెరికా, జపాన్‌లతో కలిసి చైనాకు వ్యతిరేకంగా జట్టుకటింది. దీంతో డొక్లాం సాకుతో దక్షిణ చైనా సముద్రంలో భారత్ జోక్యాన్ని నివారించాలంటే చైనాకు యుద్ధం తప్పనిసరి అని మేఘ్నాథ్ దేశాయ్ చెబుతున్నారు. అయితే.. ఇటీవల పలువురు భావిస్తున్నట్లు, చైనాలో అధికార మీడియా రాస్తున్నట్లు, డొక్లాంలో కుమ్ములాటలకే భారత్-చైనా ఘర్షణ పరిమితం కాదు. ఉత్తర హిమాలయాల నుంచి దక్షిణ చైనా సముద్రం వరకూ చైనా యుద్ధం చేస్తుందని, భారత్ కూడా ఆ స్థాయిలో యుద్ధం చేయాలని, ఇందులో భారత్ తరపున అమెరికా యుద్ధం చేస్తుందని ఆయన అంచనా. దక్షిణ చైనా సముద్రం చైనా వశమైతే, అంతర్జాతీయంగా అమెరికా ప్రయోజనాలకు, ఇక్కడ భారత్ ప్రయోజనాలకు నష్టం. దీంతో ఆసియాలో భారత్‌తో ప్రపంచ అగ్రరాజ్యం అమెరికా కూడి ఉంటుందని దేశాయ్ చెబుతున్నారు. ఇటీవల ఐఏఎన్ఎస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మేఘనాథ్, అందరూ ఆశ్చర్యపోయేవిధంగా చైనా, భారత్ చైనాల మధ్య యుద్ధం వస్తుందని అన్నారు. పరిస్థితులు ఎవరి నియంత్రణలోనూ ఉండవని, అయితే.. ఈ సందర్భంగా అమెరికా, జపాన్, రష్యాలతో భారత్ కుదుర్చుకున్న ఒప్పందాలు అప్పుడు బాగా ఉపకరిస్తాయని చెప్పారు. చైనా భారత్‌తోనే కాక అమెరికా, జపాన్, రష్యా దళాలను ఎదుర్కోవాల్సిన పరిస్థితి వస్తుందని ఆయన అంచనా వేసారు. యుద్ధం త్వరలోనే వస్తుందన్న ఆయన ఎప్పుడు వస్తుందో చెప్పడానికి తాను జ్యోతిష్కుడిని కానన్నారు. మొత్తానికి నెలల్లోనే వచ్చేస్తుందని.. ఏళ్లూ, ఊళ్లూ ఆగక్కర్లేదని మాత్రం స్పష్టం చేసారు.

ఇందుకు కారణం ఆయన అందరూ చూసినట్లుగా డొక్లాంను కేవలం భారత్ చైనాల మధ్య వివాదంగానే చూడడం లేదు. దానికి దక్షిణ చైనా సముద్రంతో లింకు పెడుతున్నారు. ఒకరకంగా అమెరికాతో చైనా చేసే యుద్ధంగా దాన్ని ఆయన అభివర్ణించారు. ఆ యుద్ధంలో భారత్ కూడా పాల్గొంటుందని, ఆ దేశం తరపున అమెరికా యుద్ధం చేస్తుందని చెప్పారు. వినడానికి విచిత్రంగా ఉన్నా.. ఇదే నిజమని దేశాయ్ చెబుతున్నారు. అమెరికాకు దక్షిణ చైనా సముద్రానికి దూరంగా ఉన్నా, ఆ ప్రాంత దేశాలతో ప్రయోజనాలు ఉన్నాయి. ఆసియాన్ దేశాలతో భారత్ దగ్గరవుతున్నందున భారత్‌కూ దక్షిణ చైనా సముద్రంలో ప్రయోజనాలు ఉన్నాయి. దక్షిణ చైనా సముద్రంలో చైనా చెబుతున్న విషయాలే నమితే, ఆగ్నేయాసియా దేశాలన్నీ కూడా చైనాకు రాష్ట్రాల్లాగా మెలగాల్సిన పరిస్థితులు వస్తాయి. ఆ సముద్రంలో చైనా స్థావరాలు ఉంటాయి కాబట్టి, ఆ దేశ ప్రాదేశిక జలాల్లోకి ఆ దేశాల భాగాలు వచ్చే అవకాశం ఉంది. దీంతో ఆసియాన్ దేశాలన్నీ తల్లడిల్లిపోతున్నాయి. మేఘనాథ్ చెబుతున్న యుద్ధమే జరిగితే అందులో భారత్ అమెరికాలతో పాటు వియత్నాం లాంటి దేశాలూ పాల్గొనే అవకాశం ఉంది. అమెరికాతోనే యుద్ధం చేసి ఓటమి ఎరుగని వియత్నాం కూడా యుద్ధంలో పాల్గొంటే మూడు దేశాలతో యుద్ధం చేయడం చైనాకూ కష్టమే. కానీ ఆ పరిస్థితులు తప్పవని విశ్లేషకుల అంచనా.

ఆధార్ డేటాను ఇలా దొంగలించాను



- వివరించిన హ్యాకర్
- నేర ఉద్దేశం లేదని స్పష్టం
- ఆ సమాచారం తీసుకోవడం దొంగతనమే
- అది నేరమే అంటున్న పోలీసులు

బెంగళూరు: ఆధార్ కార్డుల డేటాను దొంగిలించిన కేసులో ప్రధాన నిందితుడు అభినవ్ శ్రీవాస్తవ చెబుతున్న విషయాలతో పోలీసులు విస్తుపోతున్నారు. తాను ఆధార్ డేటా ఎలా దొంగిలించానో ఆరు గంటల పాటు సవివరంగా చేసి చూపించాడు. ప్రభుత్వ వెబ్‌సైట్లో ఆధార్ డేటాను పొందడానికి అతడు అనుసరించిన విధానాలను పోలీసులు రికార్డు చేసారు. వెబ్‌సైట్ల భద్రతకు హెచ్‌టీటీపీఎస్ ప్రొటోకాల్ అనేది చాలా ముఖ్యం. ఆధార్ డేటా ఉన్న వెబ్‌సైట్లో అదే లోపించింది కాబట్టి, తాను ఈ-ఆస్పత్రి వెబ్‌సైట్లోకి హ్యాక్ చేసానని చెప్పాడు. హైపర్ టెక్స్ట్ ట్రాన్స్‌ఫర్ ప్రొటోకాల్ అనేది హ్యాకర్లకు అర్థం కాని భాషలో జరగాలంటే హెచ్‌టీటీపీఎస్ అనేది ఉండాలి. అంటే ఏ వెబ్‌సైట్ నుంచైనా హ్యాకర్లు సమాచారం దొంగిలించాలంటే అక్కడి డేటా బదిలీ జరిగేటప్పుడు చేస్తారు. సదరు వెబ్‌సైట్లో హెచ్‌టీటీపీఎస్ ప్రొటోకాల్ లేకుంటే ఆ డెటా హ్యాకర్లకు అర్థమైపోతుంది. తేలిగ్గా కాపీ చేసేస్తారు. హెచ్‌టీటీపీఎస్ లేనందున డేటాను తేలిగ్గా తీసుకోగలిగామని అభినవ్ చెప్పాడు. బ్యాంకులు, ఈ-కామర్స్ సంస్థల వంటివి హెచ్‌టీటీపీఎస్ ప్రొటోకాల్‌ను పాటిస్తాయి. యూజర్‌కు సర్వర్‌కు తప్పితే బదిలీ జరిగే సమాచారం ఏమిటో ఎవరికీ అర్థం కాదు? ఈ ఏర్పాటు వల్ల సైట్లకు , లావాదేవీలకూ భద్రత ఉంటుంది.అంతేనా, సదరు యాప్‌ను గూగుల్ ప్లేస్టోర్‌లో కూడా అతను పెట్టిన సంగతి తెలిసిందే. దీంతో ఆధార్ డేటాను ఎవరు యాక్సెస్ చేసారో క నూడాతెలియడం లేదు. ప్రస్తుతానికి ఆ యాప్‌ను తీసివేసినా, మరి కొందరికి ఆధార్ డేటా లభించి ఉండొచ్చు. అయితే.. తనకు ఇందులో నేరపూరిత ఉద్దేశాలేవీ లేవని, కేవలం సాఫ్ట్వేర్ లేదా యాప్ డెవలప్‌మెంట్ ఉద్దేశంతోనే చేసానని అభినవ్ చెప్పాడు. అయితే.. పోలీసులు మాత్ర ఆధార్ వెబ్‌సైట్లోని రహస్య ప్రదేశాల నుంచి సమాచారం తీసుకోవడం దొంగిలించదమేనని, అది నేరమేనని స్పష్టం చేస్తున్నారు.

ప్రైవేటు సంస్థలకు ఆధార్ సమాచారం ఇవ్వడం భద్రతకు సరి కాదని ఇటీవల వార్తలు వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వం వద్దనుంచే సమాచారం చోరీకి గురికావడం శోచనీయమని పలువురి భావనగా ఉంది. అంత కీలక సమాచారానికి భద్రతకు సంబంధించిన ప్రొటోకాల్ లేకపోవడమేమిటని ఈ ఘటన తరువాత విమర్శలు వెల్లువెత్తాయి. బ్యాంకులు తదిరత సంస్థలు పాటించే ప్రొటోకాల్‌ను కూడా పౌరుల గోప్యతకు సంబంధించిన సమాచారం నిల్వ ఉంచే సంస్థ పాటించకపోవడం శోచనీయం.

శత్రు దేశమూ ఇలా చేయదు

కేరళలో రాజకీయ హింసపై అరుణ్ జైట్లీ ఆగ్రహం



తిరవనంతపురం: శత్రు దేశం కూడా ఒక వ్యక్తిని ఇంత దారుణంగా చంపదని కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ పేర్కొన్నారు. కమ్యూనిస్టు పాలిత కేరళలో జరుగుతున్న రాజకీయ హింసపై జైట్లీ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత కొద్దిరోజుల క్రితం కేరళలోని రాష్ట్రీయ స్వయం సేవక్ (ఆర్ఎస్ఎస్) కార్యకర్త రాజేశ్‌ను అధికార ఎల్‌డీఎఫ్‌కు చెందిన వ్యక్తులు హతమార్చారని ఆరోపణలను ఉన్నాయి. ఈ నేపథ్యంలో రాజకీయం హింసపై రాష్ట్రప్రభుత్వంపై పెద్ద ఎత్తున విమర్శలొస్తున్నాయి. రాష్ట్రంలో ఇకనైనా రాజకీయ హింసకు చరమగీతం పాడాలని జైట్లీ అభిప్రాయపడ్డారు. మృతుడు రాజేశ్ కుటుంబానికి భరోసా కల్పించేందుకు కేంద్రమంత్రి ఆదివారం కేరళలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మృతుడి కుటుంబీకులను పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని వారికి భరోసానిచ్చారు అరుణ్ జైట్లీ. తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఎల్‌డీఎఫ్ అధికారంలోకి వచ్చిన ప్రతిసారి రాజకీయ హింస పెరుగుతుందన్నారు. కమ్యూనిస్టులు వారి భావజాలాన్ని వ్యతిరేకించిన వారిని హతమారుస్తారా? అని ప్రశ్నించారు. రాజేశ్‌పై జరిగిన దాడి చూస్తే తీవ్రవాదులు కూడా కలవరపడతారని అన్నారు. ఆయన శరీరంపై 70 సార్లు కత్తితో దారుణంగా పొడిచారన్నారు. ఇటువంటి దాడులు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో జరిగితే అవార్డ్‌వాపసీ కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరిగేవని చెప్పారు. ప్రతిపక్షాలు పార్లమెంట్‌ను స్తంభింపజేసేవన్నారు. రాజకీయ హింసతో సాధించేది ఏం ఉండదన్నారు. రాష్ట్రప్రభుత్వం ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

బీజేపీ వ్యాఖ్యలను తిప్పి కొట్టిన సీపీఎం

భారతీయ జనతా పార్టీ రాజకీయ హింసపై చేస్తున్న ఆరోపణలను అధికార సీపీఐ(ఎం) పార్టీ ఖండించింది. పక్కా ప్లాన్‌తోనే బీజేపీ హైకమాండ్ తమపై కుట్ర పన్నుతుందని విమర్శించారు. ఇటువంటి ప్రచారాలు అందులో భాగమేనన్నారు. అరుణ్‌జైట్లీ పర్యటనకు ముందు సీపీఐ(ఎం) రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. బీజేపీ-ఆర్ఎస్ఎస్ పార్టీ నాయకులు తమ 21 మంది కార్యకర్తలను పొట్టనబెట్టుకున్నారని ఆరోపించారు. వాళ్ళ ఇండ్లకు జైట్లీ వచ్చి పరామర్శించాలని కోరారు. కాగా, రాష్ట్రంలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితిపై కేరళ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. బీజేపీ-ఆర్ఎస్ఎస్ ప్రతినిధులతో కూడా చర్చించి భవిష్యత్‌లో ఇటువంటి సంఘటనలు జరగకూడదని ఆకాంక్షించారు.



'అమర్‌నాథ్ దాడి'లో ముగ్గురి అరెస్ట్

- కేసును చేధించిన జమ్ము కశ్మీర్ పోలీసులు
- సూత్రధారి లష్కరే తొయిబా.. సహకరించిన ఇద్దరు స్థానికులు

న్యూఢిల్లీ: గత నెలలో అమర్‌నాథ్ యాత్రికులపై జరిగిన దాడి కేసును జమ్ము కశ్మీర్ పోలీసులు చేధించారు. ఆ దుర్ఘటనకు పాల్పడిన ముగ్గురు తీవ్రవాదాలను ఆదివారం అరెస్టు చేశారు. అరెస్టైన వారిలో లష్కరే తొయిబాకు చెందిని తీవ్రవాది ఇస్మాయిల్, మరోక తీవ్రవాద సంస్థకు సానుభూతిపరులుగా ఉన్నటువంటి ఇద్దరు స్థానిక యువకులు ఉన్నట్లు శ్రీ నగర్ ఐజీపీ మునీర్ ఖాన్ ఆదివారం పేర్కొన్నారు. నిందితుల ఫొటోలను ఈ సందర్భంగా పోలీసులు మీడియాకు వెల్లడించారు. అయితే దాడిని ముందుగా జులై 9వ తేదీన చేయాలని నిర్ణయించారన్నారు. కానీ ఆ రోజు సీఆర్‌పీఎఫ్ బృందాలు గస్తీ నిర్వహించడంతో దాడి జరపలేకపోయారని తెలిపారు. విచారణలో నిందితులు కేసుకు సంబంధించిన ప్రతి విషయాన్ని తమకు చెప్పినట్లు తెలిపారు. దాడికి ముందు తీవ్రవాదులకు ఆశ్రయం కల్పించిన వారిని కూడా అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. కాగా, జులై 10వ తేదీన అమర్‌నాథ్ యాత్ర నుంచి తిరిగి వస్తున్న బస్సుపై కాల్పులు జరపడంతో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే.

వేర్పాటువాది షబ్బీర్ షా అనుచరుడు అస్లాం అరెస్ట్

కశ్మీర్ వేర్పాటువాది అస్లాం వణిను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఆదివారం అరెస్ట్ చేసింది. తీవ్రవాద చర్యలకు ఆర్థిక సహకారం అందజేస్తున్నారన్న నెపంతో ఆయనను అరెస్ట్ చేస్తున్నామని ఈడీ ప్రకటించింది. దేశంలో జరిగిన ఎన్నో తీవ్రవాద దాడుల్లోఅస్లాం వణి హస్తం ఉందని చెప్పింది. ఇదే కేసుపై అస్లాం జులై 26న పాటియాల కోర్టులో హాజరయ్యారు. కాగా, అస్లాంతో పాటు అరెస్టైన వారిలో అటాఫ్ షా, అయాజ్ అక్బర్, పీర్ సైఫుల్లా, మేరాజ్ కల్వాల్, షాహీద్ ఇస్లాం, నయీం ఖాన్, బిట్టా కరాటే తదితరులు కూడా ఉన్నట్లు ఈడీ తెలిపింది. అయితే, డెమొక్రటిక్ ఫ్రీడం పార్టీకి ఛైర్మన్‌గా ఉన్నటువంటి షబ్బీర్ షా, ప్రముఖ వేర్పాటువాది షబ్బీర్ షాకు అనుచరుడే అన్న విషయం తెలిసిందే. వేర్పాటువాదుల ఆస్తులపై ఎన్ఐఏ దర్యాప్తు జరుపుతుండడం తెలిసిందే. ఈ దర్యాప్తులో భాగంగా గిలానీ సహచరులను కూడా ఇటీవల అరెస్టు చేసారు.

ఉత్తర కొరియాపై కన్నెర్ర

మరింత కఠిన ఆంక్షలు





- అమెరికా తీర్మానానికి భద్రతా మండలి ఆమోదం
- బొగ్గు, ఇనుము, ఇనుప ఖనిజం ఎగుమతులపై నిషేదం
- మూడో వంతు ఎగుమతులు, ఆదాయానికి దెబ్బ
- తీవ్రంగా వ్యతిరేకించిన చైనా, రష్యా

వాషింగ్టన్: వరుస ఖండాతర క్షిపణుల పరీక్షలతో అమెరికాను కవ్విస్తున్న ఉత్తర కొరియాపై ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి మరింత కఠిన ఆంక్షలు విధించింది. ఉత్తర కొరియా ఎగుమతులపై ఆంక్షలకు సంబంధించిన అమెరికా తీర్మానానికి 15 సభ్యుల భద్రతా మండలి శనివారం మద్దతు తెలిపింది. అంతర్జాతీయ ఆంక్షలను లెక్కచేయక జులై 3, 28న అణు సామర్థ్యమున్న ఖండాతర బాలిస్టిక్ క్షిపణులను ఉత్తర కొరియా పరీక్షించింది. దీంతో అమెరికాలోని పలు ప్రధాన నగరాలు తమ గుప్పిట్లోకి వచ్చినట్లు ఆ దేశ అధ్యక్షుడు కిమ్ ప్రకటించడంపై యూఎస్ మండిపడింది. అది ప్రతిపాదించిన మరింత కఠిన ఆంక్షలకు ఐక్యరాజ్య సమితి అంగీకారం తెలిపింది. ఇప్పటి వరకు జీవనాధారం కోసం అనుమతిస్తున్న బొగ్గు, ఇనుము, ఇనుప ఖనిజం ఎగుమతులను పూర్తిగా నిషేధించారు. అలాగే ఉత్తర కొరియా సంస్థలు లేదా ఆ దేశ జాతీయులకు విదేశాల్లో ఉద్యోగాలు, సంయుక్త, సహకార పెట్టుబడులు, లావాదేవీలను పూర్తిగా రద్దు చేసింది. ఉత్తర కొరియాకు సంబంధించిన ఆస్తులు, ఖాతాలతో పాటు ప్రయాణాలపైనా నిషేధం విధించింది. అలాగే ఆ దేశం ఎలాంటి క్షిపణి పరీక్షలు, ఉద్రిక్తలు పెంచేచర్యలు చేపట్టవద్దని భద్రతా మండలి హెచ్చరించింది. గతంలో ఏ దేశంపై విధించని ఈ కఠిన ఆర్థిక ఆంక్షలతో ఉత్తర కొరియా ఎగుమతులు మూడో వంతు తగ్గడంతోపాటు ఒక ఏడాదిలో బిలియన్ డాలర్ల ఆదాయం కోల్పోనుంది. మరోవైపు ఉద్రిక్తతల నివరణకు ఉత్తర కొరియాతో రాజకీయ చర్చలు కొనసాగించాలని ఆరు దేశాల బృందానికి సూచించింది. ఉత్తర కొరియాపై కఠిన ఆంక్షలకు సంబంధించిన ఈ తీర్మానం ఆమోదంపై సభ్య దేశాలు తమ నివేదికను 90 రోజుల్లో తెలపాలని యూఎన్ సెక్యూరిటీ కౌన్సిల్ కోరింది. 2006లో తొలిసారి అణు పరీక్షలు నిర్వహించిన ఉత్తర కొరియాపై ఇప్పటి వరకు ఆరుసార్లు ఆంక్షలు విధించినప్పటికీ దాని దూకుడును అడ్డుకోలేకపోవడం విశేషం.

తగిన మూల్యం చెల్లించాల్సిందే: అమెరికా

తాజా ఆంక్షలు ఉత్తర కొరియాకు కోలుకోలేని దెబ్బని అమెరికా వెల్లడించింది. అణు సామర్థ్యమున ఖండాంతర క్షిపణుల పరీక్షలను నిర్వహించిందుకు ఆ దేశం తగిన మూల్యం చెల్లించుకోనుందని




ఐక్యరాజ్య సమితిలో అమెరికా ప్రతినిధి నిక్కి హాలే తెలిపారు. ఇప్పటి వరకు ఏ దేశంపై విధించని ఇలాంటి కఠిన ఆంక్షలతో ఉత్తర కొరియా మూడో వంతు ఎగుమతులతో పాటు ఆదాయాన్ని కోల్పోతుందని ఆమె అన్నారు. తమతో పాటు మిత్ర దేశాలను కాపాడుకునేందుకు చర్చలు కొనసాగించడం తోపాటు సైనిక విన్యాసాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఉత్తర కొరియాతో పాటు అన్ని దేశాల భద్రత, శ్రేయస్సు అమెరికాకు ఎంతో అవసరమని నిక్కి హాలే అన్నారు. అణ్వాయుధ రహిత, శాంతి, సుస్థిరమైన కొరియా ద్వీపకల్పం నెలకొనేంత వరకు ఉత్తర కొరియాపై మరింత ఒత్తిడి తెచ్చేందుకు తాజా కఠిన ఆంక్షలతో పాటు గత తీర్మానాలను సంపూర్ణంగా అమలు చేస్తామని ఆమె స్పష్టం చేశారు.

ఆంక్షలను వ్యతిరేకించిన చైనా, రష్యా

మరోవైపు ఉత్తర కొరియాపై అమెరికా ప్రతిపాదించిన కఠిన ఆంక్షలను చైనా, రష్యా వ్యతిరేకించాయి. ఇలాంటివి మరింత సైనికపరమైన ఉద్రిక్తతలకు దారి తీస్తాయని, చర్చలే దీనికి మార్గమని ఆ దేశాలు అభిప్రాయపడ్డాయి. అయితే ఉత్తర కొరియాతో 90 శాతం వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్న చైనాపై తాజా ఆంక్షలతో మరింత ఒత్తిడి పెంచేందుకు అమెరికా ప్రయత్నిస్తోంది.

బోఫోర్స్‌పై విచారణకు పిటిషన్




న్యూఢిల్లీ: బోఫోర్స్ కేసుపై సత్వర విచారణ చేపట్టాలని కోరుతూ బీజేపీ నేత, న్యాయవాది అజయ్ అగర్వాల్ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 1986 లో స్వీడన్‌కు చెందిన బోఫోర్స్ కంపెనీతో జరిగిన రూ.1437 కోట్ల హోవిట్జర్ గన్స్ సరఫరా ఒప్పందంలో రూ.64 కొట్లను ముడుపుల కింద ఆ కంపెనీ కొందరికి చెల్లించినట్లు ఆరోపణలొచ్చాయి. దీనిపై సీబీఐ దర్యాప్తు చేయగా 2005 మే 31న హిందుజా బ్రదర్స్‌పై ఆరోపణలను ఢిల్లీ హైకోర్టు కొట్టివేసింది. అయితే 90 రోజుల గడువులోగా సీబీఐ దీనిపై సుప్రీం కోర్టును ఆశ్రయించలేదు. దీంతో సీబీఐ నిందితులతో కుమ్మక్కై ఉద్దేశపూర్వకంగా సుప్రీం కోర్టులో అపీల్ చేయలేదని ఆరోపిస్తూ అజయ్ అగర్వాల్ 2005 అక్టోబర్ 18న సుప్రీం కోర్టును ఆశ్రయించారు. దీంతో తగిన ఆధారాలతో హైకోర్టు తీర్పుపై అపీల్ చేసేందుకు సర్వోన్నత న్యాయస్థానం ఆయనకు అనుమతి ఇచ్చింది. ఆమేరకు ఆయన తగిన వివరాలతో సుప్రీం కోర్టులో అపీల్ చేశారు. అయితే 2010 ఆగస్ట్ 12న దీనిపై తొలి విచారణ జరగ్గా ఆరేళ్ళ తర్వాత 2016 డిసెంబర్ 1న మరోసారి విచారణ జరిగింది. తాజాగా స్వీడన్ చీఫ్ ఇన్వెస్టిగేషన్ అధికారి బోఫోర్స్ కుంభకోణంలో కొందరికి ముడుపులు అందాయని చెప్పినట్లుగా మీడియాలో కథనాలొచ్చాయి. దీంతో ఈ కేసుపై తిరిగి దర్యాప్తు చేయాలని కొందరు బీజేపీ ఎంపీలు పార్లమెంటులో డిమాండ్ చేశారు. ఈనేపథ్యంలో 2014 లోక్‌సభ ఎన్నికల్లో రాయబరేలీ నుంచి సోనియా గాంధీపై పోటీ చేసి ఓడిన బీజేపీ నేత, న్యాయవాది అజయ్ అగర్వాల్ మరోసారి సుప్రీం కోర్టును ఆశ్రయించారు.

తక్కువ స్థాయి రోబోలంటేనే మనకిష్టమట!




లండన్: సాధారణ మనిషి తన కంటే తక్కువ స్థాయి రొబోలను ఇష్టపడతాడని లండన్‌లో శాస్త్రవేత్తలు జరిపిన ఓ అధ్యయనంలో తేలింది. ప్రస్తుత ప్రపంచానికి రొబోలు అవసరపడుతున్నాయి. దీంతో, శాస్త్రవేత్తలు వాటి రూపకల్పనపై దృష్టిసారించి రొబోలను ఎంతగానో అభివృద్ధి జరిపిస్తున్నారు. అయితే, సగటు పౌరులు మాత్రం తప్పులు చేసే రొబోలను ఇష్టపడతారని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వారి దగ్గర ఉన్న రొబోకు తమ కంటే ఎక్కువ తెలివి తేటలు ఉంటే ఇష్టపడరని వెల్లడించారు. గతంలో జరిపిన అధ్యయనాల్లో కూడా ఇటువంటి ఫలితాలే వెల్లడయ్యాయని చెప్పారు. వారి కంటే తక్కువ తెలివి ఉన్న రొబోలను మాత్రం అమితంగా ఇష్టపడతారని లండన్ యూనివర్సిటీ అధ్యయన కారురాలు నికోలీ మిర్‌నింగ్ ఇటీవల వెల్లడించారు.

ఏనుగు దంతాలతో మనిషి అస్థిపంజరం



తిరవనంతపురం: దేశంలో ప్రాశ్చాత్య వైద్య వ్యవస్థ అందుబాటులో లేని రోజుల్లో మానవ శరీర నిర్మాణంపై ఎన్నో అధ్యయనాలు జరిపాడు ట్రావెన్‌కోర్ పాలకుడు తిరునాల్ మార్తండ వర్మ మహారాజా. మనిషి శరీరం, ఎముకలు, నరాలపై క్షుణ్ణంగా అధ్యయనం చేసేందుకు ఏనుగు దంతాలతో అస్థిపంజరాన్ని 19వ శతాబ్దంలో ఆయన తయారు చేయించారు. ఈ విషయాన్ని అధ్యయనకారులు ఇటీవల తమ అధ్యయనంలో భాగంగా వెల్లడించారు. సాధారణంగానే వైద్య శాస్త్రం, మానవ శరీర నిర్మాణ శాస్త్రం గురించి ఆయనకు ఆసక్తి ఉండేదని వివరించారు. అందులో భాగంగానే ఆ అస్థిపంజరాన్ని తయారు చేయించినట్లు చెప్పారు. ఇంగ్లాండ్ నుంచి మందులు తీసుకువచ్చి తన రాజ దర్బార్‌లో క్లినిక్‌ను కూడా నడిపేవారని అన్నారు. మానవ శరీర నిర్మాణ శాస్త్రంపై అమితాసక్తితో ఆయన ఏనుగు దంతాలతో మనిషి అస్థిపంజరాన్ని పోలిన విధంగా తయారు చేయించడంలో ఓ సామాజిక అంశం కూడా ఉందని అధ్యయనకారులు చెబుతున్నారు. అప్పట్లో అగ్రకులాల్లో మనిషి శవం లేదా అస్థిపంజరాలను ముట్టుకోవడం నిషేధంగా ఉండేది. ఈ నేపథ్యంలోనే ట్రావెన్‌కోర్ పాలకుడు తిరునాల్ మార్తండ వర్మ అస్థిపంజరాన్ని పోలిన విధంగా ఏనుగు దంతాలతో రూపొందించుకున్నాడని ప్రసిద్ధి.

ఢిల్లీ కాదు గుజరాత్‌కే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు




బెంగళూరు: గుజరాత్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు స్వరాష్ట్రానికి చేరుకోనున్నారు. ఇప్పటి వరకూ బెంగళూరులోని ఒక రిసార్టులో ఉన్న 44 మంది ఎమ్మెల్యేలు ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీని కలిసిన తరువాత గుజరాత్ వెళతారని వార్తలు వచ్చాయి. అయితే.. తాజాగా వారు నేరుగా గుజరాత్ వెళతారని కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి. మంగళవారం జరిగే రాజ్యసభ ఎన్నికల్లో పాల్గొనేందుకు వీలుగా వారిని గుజరాత్‌కు తరలిస్తున్నారు. ఈ రాజ్యసభ ఎన్నికల్లో సోనియా రాజకీయకార్యదర్శి అహ్మద్ పటేల్ పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. తమ ఎమ్మెల్యేలను బీజేపీ ఆకర్షిస్తోందనే ఆరోపణలతో కాంగ్రెస్ వారిని బెంగళూరు రిసార్టులో దాచి ఉంచింది. అయితే.. వీరిని ఎప్పుడు గుజరాత్ తరలిస్తారో కాంగ్రెస్ వర్గాలు చెప్పడం లేదు.

మహిళ గర్భాశయంలో 32 కిలోల కణితి

న్యూయార్క్: ఓ మహిళ శరీరం నుంచి ప్రపంచంలోనే అతిపెద్ద కణితిని మాస్కోలో వైద్యులు తొలగించారు. 40 ఏళ్ల మహిళ గర్భాశయం నుంచి 32 కిలోల కణితిని వైద్యుల బృందం తొలగించింది. గ్వాటిమాల నివాసి అయిన ఓ మహిళ పొత్తి కడుపు బాగా పెరగడంతో వైద్యులను సంప్రదించింది. ఆమెకు అన్ని పరీక్షలు చేసిన చేసిన వైద్యులు పొత్తి కడుపులో కణితి ఉందని గుర్తించారు. ఇది ఏడేళ్ల నుంచి పెరుగుతూ 70 ఎల్‌బీఎస్ (లిక్విడ్ బేస్ స్టెబ్‌లైజర్) 32 కిలోలకు చేరింది. ఇప్పటి వైద్య చరిత్రలో ఇంత పెద్ద కణితితో ఎవరూ బాధపడలేదని వైద్యులు నిర్ధారించారు. ఇది గర్భాశయంలోకి చేరి గర్భ నిరోధకంగా వృద్ధి చెందిందన్నారు. ఈ వ్యాధితో బాధ పడేవారి పొత్తి కడుపు భారీగా పెరుగుతుంది. ప్రస్తుత రోగి కడుపు చుట్టుకొలత 137 సెం.మీ. ఉందని వైద్యులు తెలిపారు. ఏడేళ్ల నుంచి ఈ వ్యాధితో బాధపడుతుందని నిర్ధారించారు. గిన్నిస్ వరల్డ్ రికార్డు ప్రకారం ఈ కణితి బయటపడేవరకూ 2005 లో కర్ణాటక రాయచూర్‌లోని రాజీవ్ గాంధీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో డాక్టర్ పుష్పాంజలి మలిపాటి నేతృత్వంలో చేసిన శస్త్రచికిత్సలో తొలగించిన 30 కేజీల కణితే పెద్దది.

తల్లి పాలే శ్రేయస్కరం



న్యూఢిల్లీ: బిడ్డలకు తల్లి పాలు ఎంతో శ్రేయస్కరమని పరిశోధనలు మరోసారి స్పష్టం చేశాయి. తల్లి పాలకు మించిన సంపూర్ణ పోషకాహారం మరొకటి లేదని నిర్ధారించాయి. తల్లి పాలతో బిడ్డల బ్రెయిన్‌తోపాటు పూర్తి ఎదుగుదలకు అవసరమైన పోషకాలుంటాయని నెదర్లాండ్స్‌లోని హ్యూమన్ మిల్క్, న్యూట్రిషినియా రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ బెర్న్‌స్టాల్ వెల్లడించారు. డయోరియా, అలర్జీ, ఆస్మా వంటి రోగాలను కూడా తల్లి పాలు దూరం చేస్తుందని ఆయన తెలిపారు. అలాగే బిడ్డలకు పాలు ఇచ్చే తల్లులకు రొమ్ము, సర్వేకల్ క్యాన్సర్ ముప్పు తక్కువని తమ పరిశోధనల్లో తేలినట్లు ఆయన వివరించారు.

ఆవు, గేదే పాలతో.. శిశువులకు అనారోగ్యం

మరోవైపు నవజాత శిశువులకు ఆవు, గేదే, డబ్బా వంటి పట్టుడు పాలు అనారోగ్యానికి దారి తీసే అవకాశముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొన్ని ఇళ్ళల్లో ముఖ్యంగా అర్బన్ నగరాల్లో సరైన అవగాహన లేకపోవడం, నిర్లక్ష్యం, పని ఒత్తిడి, పని ప్రాంతాల్లో తగిన పరిస్థితులు లేకపోవడం వంటి కారణాలతో తల్లులు తమ బిడ్డలకు చనుబాలు ఇవ్వలేకపోతున్నట్లు ఈ పరిశోధనలో తేలింది. కాగా బిడ్డలకు తొలి ఆరు నెలల పాటు పూర్తిగాను, మరో రెండేళ్ళ వరకు పాక్షికంగా తల్లులు పాలివ్వాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచిస్తోంది. భారత్‌లో తల్లి పాలకు నోచుకోని బిడ్డలు ప్రతి ఏటా సుమారు లక్ష మంది చనిపోతున్నారని, ఇది ఆ దేశానికి 14 బిలియన్ డాలర్ల మేర ఆర్థికంగా నష్టం కలిగిస్తోందని ఐక్యరాజ్యసమితి నివేదిక హెచ్చరిస్తోంది.

భారత్‌లో అనుకూల ధోరణి

భారత్‌లో గత పదేళ్ళలో బ్రెస్ట్ ఫీడింగ్‌పై అనుకూల ధోరణి కనిపిస్తోంది. గత ఆరు నెలల్లో తల్లులు బిడ్డలకు పాలివ్వడం 55 శాతం మేర పెరిగినట్లు జాతీయ కుటుంబ ఆరోగ్య నాలుగో సర్వే పేర్కొంది. కేంద్ర మంత్రిత్వ శాఖ అమలు చేస్తున్న భారత నవజాత శిశు కార్యాచరణ ప్రణాళిక ఈ దిశగా మంచి ఫలితాలిస్తోంది. 2017 నాటికి 75 శాతం, 2025 నాటికి 90 శాతం మేర పుట్టిన ప్రతి బిడ్డకు తల్లి పాలు ఇచ్చే విధానంపై కసరత్తు చేస్తోంది.



ఘనంగా లై ప్రీ రిలీజ్

నితిన్, మేఘా ఆకాష్ జంటగా దర్శకుడు హను రాఘవపూడి రూపొందించిన చిత్రం 'లై'. వెంకట్ బోయినపల్లి సమర్పణలో 14 రీల్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మించింది. ఈ నెల 11న 'లై' ప్రేక్షకుల ముందుకొచ్చేందుకు సిద్ధమవుతోంది. ఈ చిత్ర ప్రీ రిలీజ్ కార్యక్రమం హైదరాబాద్ జేఆర్‌సీ కన్వెన్షన్‌లో జరిగింది. దర్శకులు సుకుమార్, త్రివిక్రమ్ శ్రీనివాస్ అతిథులుగా హాజరయ్యారు. ఆడియో సీడీని విడుదల చేసిన అనంతరం దర్శకుడు హను రాఘవపూడి మాట్లాడుతూ...'ఆరు నెలలుగా ఈ చిత్రం కోసం శ్రమించాము. అప్పుడే సినిమా పూర్తయిందా అనిపిస్తుంది.

షూటింగ్ కోసం అమెరికా వచ్చిన 28 మంది సభ్యుల బృందం చాలా కష్టపడ్డారు. మూల కథ నా దగ్గర ఉన్నప్పుడు నిర్మాత రామ్ కథను ప్రతి నాయకుడి నుంచి చెప్పుకొస్తే బాగుంటుందని సలహా ఇచ్చారు. ఆ ఆలోచన సినిమా రూపురేఖలనే మార్చేసింది. నితిన్ నాకంటే ఎక్కువగా సినిమాను నమ్మాడు. మేఘా ఆకాష్ తన పాత్రలో లీనమై నటించింది. సినిమాటోగ్రాఫర్ యువరాజ్ తక్కువ సమయంలో మంచి ఫలితాన్ని తీసుకొచ్చాడు. ఇలాంటి విజువల్స్ నాణ్యత మరెవరూ తీసుకురాలేరు. మణిశర్మ గారి మంచి పాటలు, గొప్ప నేపథ్య సంగీతం అందించారు.' అన్నారు. నితిన్ మాట్లాడుతూ..'నా మనసుకు దగ్గరైన సినిమా ఇది. యూనిట్ పడిన కష్టంతోనే మంచి సినిమా తయారైంది. ఫస్ట్‌లుక్ నుంచే మా చిత్రానికి స్పందన పెరిగింది. 75 రోజుల పాటు అమెరికాలో చిత్రీకరణ జరిపాం. దక్షిణాది చిత్రాలేవీ ఇంత సమయం అక్కడ షూటింగ్ చేయలేదు. దర్శకుడు హను రాఘవపూడికి సినిమాలంటే ప్రేమ. ఎవరి సహాయం లేకుండా ఒక్కడే 40 రోజులు చిత్రాన్ని రూపొందించారు. మణిశర్మ గారు సంగీత మేధావి. మంచి స్వరాలు అందించారు. పవన్ కళ్యాణ్ గారి నిర్మాణంలో నా 25వ సినిమా చేస్తున్నాను. ఇంతకంటే అభిమానిగా ఏం కావాలి.' అన్నారు.

మూడు బలమైన పాత్రల కలయిక

రానా, కాజల్ జంటగా నటిస్తున్న చిత్రం 'నేనే రాజు నేనే మంత్రి'. దర్శకుడు తేజ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. సురేష్ ప్రొడక్షన్స్, బ్లూ ప్లానెట్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థలు సంయుక్తంగా 'నేనే రాజు నేనే మంత్రి' నిర్మిస్తున్నాయి. ఈ నెల 11న సినిమా విడుదలవుతున్న సందర్భంగా నిర్మాతలు సురేష్‌బాబు, భరత్ చౌదరి, కిరణ్ రెడ్డి మాట్లాడారు. సురేష్ బాబు మాట్లాడుతూ...'రానా నటుడిగా మారతానంటే అతనికి ఎలాంటి కథలు కావాలో చాలా ఆలోచించాను. శేఖర్ కమ్ముల 'లీడర్' కథతో సినిమా చేస్తానన్నాడు. అయిష్టంగానే ఒప్పుకుని ఆ సినిమా చేశాను. తేజ 'నేనే రాజు నేనే మంత్రి' కథ చెప్పినప్పుడు కూడా పాత్ర బాగుంది...కథను ఇంకాస్త మార్చాలని భావించాను. రానా కథ బాగుంది మనం చేయొచ్చని నమ్మకంగా చెప్పాడు. కథ చాలా ఆసక్తికరంగా ఉంటుంది. తరువాత జరిగే సన్నివేశాన్ని ప్రేక్షకులు ఊహించలేరు. మలుపులు తిరుగుతూ ఆశ్చర్యకరంగా ముగుస్తుంది. రాధ, జోగేంద్ర ఇద్దరు బాల్య స్నేహితులు. చిన్నప్పటి



భరత్ చౌదరి, కిరణ్ రెడ్డి, సురేష్‌బాబు

నుంచి కలిసే ఉంటారు. కలిసే పెరుగుతారు, ప్రేమించి పెళ్లి చేసుకుంటారు. వీళ్ల ప్రేమ, దాంపత్యం అంతా చాలా గాఢంగా ఉంటుంది. వీళ్లిద్దరి కథలు విభిన్నంగా ఉంటే..క్యాథరీన్ పాత్ర మరింత కొత్తగా ఉంటుంది. ఇలా మూడు ప్రధాన పాత్రల కథలు బాగుండి సినిమాను ఆసక్తికరంగా మారుస్తాయి. రానా గత చిత్రాలు ఘాజీ, బాహుబలి విజయవంతం అవడం ఈ సినిమాకు వ్యాపార పరంగా బాగా కలిసొచ్చింది. చిత్రానికి సంబంధించి సంతృప్తిగా ఉన్నాం.' అన్నారు. నిర్మాత కిరణ్ రెడ్డి మాట్లాడుతూ...'స్క్రిప్టు విన్న తర్వాత ఖచ్చితంగా మంచి సినిమా అవుతుందని భావించాను. సురేష్ ప్రొడక్షన్స్‌తో కలిసి పనిచేయడం సంతోషంగా ఉంది. అయితే సినిమా నిర్మాణంపై నాకు అవగాహన లేదు. ఈ సినిమా పూర్వ నిర్మాణ కార్యక్రమాల జరుగుతున్న సమయంలో చాలా విషయాలు నేర్చుకున్నాను. మరిన్ని మంచి చిత్రాలు చేయాలని ఉంది.' అన్నారు. భరత్ చౌదరి మాట్లాడుతూ..'రానాను మరో స్థాయికి తీసుకెళ్లే చిత్రం అవుతుంది. తేజ సినిమాను బాగా రూపొందించారు. విజయంపై నమ్మకంగా ఉన్నాం.' అన్నారు.



సినిమాలను చేసే అంశంలో మహేష్‌బాబు తన వేగాన్ని బాగా పెంచారు. తాను చేస్తున్న సినిమా షూటింగ్ పూర్తయి, విడుదల కాకమునుపే వేరొక చిత్రాన్ని మొదలు పెట్టేస్తున్నారు. ప్రస్తుతం ఎ.ఆర్.మురుగదాస్ దర్శకత్వంలో ఆయన నటించిన స్పైడర్ చిత్రం షూటింగ్ ఇటీవలనే పూర్తిచేసుకుంది. దసరా సందర్భంగా సెప్టెంబర్ 27న ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఓ వైపు ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్న నేపథ్యంలో మహేష్‌బాబు తన తదుపరి చిత్రం షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. కొరటాల శివ

భరత్ అను నేనుతో మహేష్ బిజీ

దర్శకత్వంలో భరత్ అను నేను చిత్రంలో మహేష్ నటిస్తున్న సంగతి తెలిసిందే. లోగడ వీరిద్దరి కలయికలో వచ్చిన శ్రీమంతుడు చిత్రం ఘన విజయం సాధించడంతో సహజంగానే ఈ కాంబినేషన్‌కు మంచి క్రేజ్ ఏర్పడింది. భరత్ అను నేను చిత్రం ఇప్పటికే హైదరాబాద్‌లో ఒక షెడ్యూల్ పూర్తిచేసుకుంది. రెండో షెడ్యూల్‌ను ఈ నెల 10 నుంచి లక్నోలో జరిపేందుకు చిత్రం బృందం పయనమవుతున్నట్లు సమాచారం. అక్కడ దాదాపు పదిహేను రోజుల పాటు ఈ షెడ్యూల్‌ను కొనసాగిస్తారని తెలిసింది. లక్నోలోని పలు లొకేషన్లతో పాటు లక్నో యూనివర్శిటీలో షూటింగ్ జరపనున్నారట. దేవిశ్రీప్రసాద్ సంగీతాన్ని అందిస్తుండగా, డి.వి.వి.దానయ్య నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ప్రారంభంలో విడుదల చేస్తారని అంటున్నారు. మహేష్ సరసన కథానాయికగా ఇంకా ఎవరినీ ఎంపిక చేయలేదు. త్వరలోనే హీరోయిన్ ఎంపిక జరుగుతుందని అంటున్నారు.

చాలా రోజుల తర్వాత ఓ మంచి సినిమా చేశా

అల్లరి నరేష్



కొత్తరకమైన కథతో రూపొందుతున్న మేడమీద అబ్బాయి చిత్రంలో నటించడం ఆనందంగా ఉంది. చాలారోజుల తర్వాత ఓ మంచి సినిమా చేశాననే భావన కలిగింది అని హీరో అల్లరి నరేష్ తెలిపారు. జి.ప్రజిత్ దర్శకత్వంలో జాహ్నవి ఫిలింస్ పతాకంపై నీలిమ సమర్పణలో బొప్పన చంద్రశేఖర్ నిర్మిస్తున్న ఈ చిత్రం నిర్మాణానంతర పనులు తుదిదశకు చేరుకున్నాయి. కాగా ఈ చిత్రం టీజర్‌ను అల్లరి నరేష్ తన ట్విట్టర్ ఖాతా ద్వారా విడుదలచేశారు. విడుదలచేసిన 12 గంటల్లోనే టీజర్ ఐదు లక్షలకు పైగా వ్యూస్‌ను సాధించిందని చిత్రబృందం వెల్లడించింది. ఈ సందర్భంగా అల్లరి నరేష్ మాట్లాడుతూ, నేను చేస్తున్న విభిన్న చిత్రమిది. ఈ మేడమీద అబ్బాయిని అందరూ మీ ఇంటి అబ్బాయిగా ఆదరించాలని కోరుకుంటున్నా అని అన్నారు. నిర్మాత బొప్పన చంద్రశేఖర్ మాట్లాడుతూ, నవ్యమైన కథ, కథనాలతో దర్శకుడు చిత్రాన్ని ఎంతో బాగా మలుస్తున్నారు. గమ్యం, శంభో శివ శంభో తర్వాత ఆ తరహా సున్నితమైన కథతో నరేష్ చేస్తున్న చిత్రమిది. రొమాంటిక్ కామెడీ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో స్క్రీన్‌ప్లే హైలైట్‌గా ఉంటుంది. సహజమైన అంశాలతో థ్రిల్లింగ్‌గా ఉంటూనే నరేష్ శైలి వినోదం ఉంటుంది. నరేష్ కెరీర్‌లో మరపురాని చిత్రంగా నిలిచిపోతుందన్న నమ్మకం ఉంది. ఈ నెలలోనే పాటలను విడుదలచేసి, సెప్టెంబర్ మొదటివారంలో చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకుని రానున్నాం అని చెప్పారు. ఈ చిత్రంలో నిఖిల విమల్ కథానాయిక కాగా ఇతర ముఖ్యపాత్రల్లో అవసరాల శ్రీనివాస్, జయప్రకాష్, తులసి, సుధ, సత్యం రాజేష్, మధునందన్, జబర్దస్త్ ఆది, పద్మాజయంతి, రవిప్రకాష్, వెన్నెల రామారావు తదితరులు తారాగణం. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: ఉన్ని ఎస్.కుమార్, సంగీతం: షాన్ రెహమాన్, ఆర్ట్: రాజీవ్ నాయర్, ఎడిటింగ్: నందమూరి హరి, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: ఎం.ఎస్.కుమార్.

ఆకట్టుకునేలా అర్జున్ రెడ్డి ట్రైలర్



విజయ్ దేవరకొండ, శాలినీ , నాని , సందీప్

విజయ్ దేవరకొండ, శాలినీ జంటగా నటించిన చిత్రం 'అర్జున్ రెడ్డి'. భద్రకాళీ పిక్చర్స్ పతాకంపై ప్రణయ్ ఈ చిత్రాన్ని నిర్మించారు. సందీప్ వంగా దర్శకత్వం వహించారు. 'అర్జున్ రెడ్డి' ఈ నెల 15న విడుదలకు సిద్ధమవుతోంది. ఈ చిత్ర థియేట్రికల్ ట్రైలర్ విడుదల కార్యక్రమం హైదరాబాద్‌లోని ఓ హోటల్లో జరిగింది. కథానాయకుడు నాని ముఖ్య అతిథిగా హాజరై ట్రైలర్ విడుదల చేశారు. అనంతరం నాని మాట్లాడుతూ...'ప్రేక్షకుల్లో ఓ సినిమా పట్ల ఏకాగ్రత కలిగించడం కష్టమైపోయింది. ట్రైలర్ చిత్రంలో ఎంత విషయం ఉందో తెలుపుతుంది. థియేటర్‌లోకి వెళ్లిన కాసేపటికి గానీ మనం కథలో లీనమవ్వలేం. కొన్ని సినిమాలకు అది విశ్రాంతి దాకా పట్టొచ్చు. మరికొన్ని చిత్రాలకు సినిమా ముగిసినా కథను అనుభూతి చెందము. కానీ ట్రైలర్‌తోనే కథలో లీనం చేస్తోంది 'అర్జున్ రెడ్డి'. ట్రైలర్ మళ్లీ చూడాలనిపిస్తోంది. విజయ్ నా సోదరుడి లాంటి వారు. నా సినిమాతో పరిచయం అయ్యాడని కాదు...ఎందుకో విజయ్‌కు నటుడిగా పేరొస్తుంటే నాకు గర్వంగా అనిపిస్తుంటుంది. ఈ సినిమా తప్పకుండా విజయం సాధిస్తుంది.' అన్నారు. దర్శకుడు సందీప్ మాట్లాడుతూ...'మా సినిమా ఆలస్యమైందని అంతా అంటున్నారు. ఇది సినిమా రూపకల్పనలో భాగమే. ఎందుకంటే ఇలాంటి చిత్రానికి కొత్త తరహా సంగీతం కావాలి. మరికొంత నాణ్యమైన సాంకేతిక అంశాలు అందుకోవాలి. ఈ కారణాలతోనే కొంత సమయం అయ్యింది. ట్రైలర్ చూశాక అదంతా మర్చిపోతారు. మంచి చిత్రంతో మీ ముందుకొస్తున్నాం.' అన్నారు. విజయ్ దేవరకొండ మాట్లాడుతూ..'ట్రైలర్ చాలా పెద్దగా ఉంది. అయినా ఇంకొంత ఉంటే బాగుండును అనిపిస్తోంది. సవాలు చేసి చెబుతున్నా...ఈ సినిమా ఖచ్చితంగా బ్లాక్‌బస్టర్ అవుతుంది. ఈ విషయంలో ఎవరైనా నాతో పోటీ పడొచ్చు. సందీప్, షాలినీ నేనూ ఈ మంచి కథను తెరపైకి తీసుకొచ్చేందుకు కావాల్సినంత పని చేశాం. మా సినిమా విడుదల చేసేందుకు ఏషియన్ ఫిలింస్ లాంటి పెద్ద పంపిణీదారులు దొరకడం సంతోషంగా ఉంది. వాళ్లకు కృతజ్ఞతలు. కానీ సినిమా సాధించే విజయం చూసి వాళ్లే మాకు కృతజ్ఞతలు చెబుతారు. నాని నా తొలి సినిమా నుంచీ సహకారం అందిస్తున్నారు. ప్రోత్సహిస్తున్నారు. నిజంగా ఆయనకు కృతజ్ఞతలు చెబుతున్నాను.' అన్నారు.

హారర్ కామెడీతో ఆనందో బ్రహ్మ



తాప్సీ

తాప్సీ పన్ను ప్రధాన పాత్రలో తెరకెక్కుతున చిత్రం ఆనందోబ్రహ్మ. మహి వి.రాఘవ్ దర్శకుడు. 70 ఎం.ఎం. ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రం విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో దర్శకుడు మహి వి.రాఘవ్ మాట్లాడుతూ, హారర్ కామెడీ చిత్రమిది. ప్రతీపాత్రకు ఎంతో ప్రాధాన్యం ఉంది. ఈ రోజు తొలికాపీ సిద్ధం కావడంతో మా బృందం ఈ చిత్రాన్ని చూసి ఎంతో సంతోషంగా ఉంది. విజువల్స్ చాలా కొత్తగా, విభిన్నంగా ఉంటాయి. దెయ్యాలు మనుషులకు భయపడితే ఎలా ఉంటుందన్న అంశంతో ఈ చిత్రాన్ని మలిచాం. తాప్సీతో పాటు శ్రీనివాసరెడ్డి, వెన్నెల కిషోర్, తాగుబోతు రమేష్, షకలక శంకర్‌లు తమ తమ పాత్రలలో ఎంతగానో ఒదిగిపోయారు. ఒకరిని మించి మరొకరు బాగా చేయాలని పోటీపడ్డారు. ప్రధానంగా నాలుగు పాత్రల చుట్టూ తిరిగే చిత్రమిది. కె. సంగీతం, అనీష్ కెమెరా పనితనం వంటివన్నీ చిత్రానికి బాగా కుదిరాయి అని అన్నారు. నిర్మాతలలో ఒకరైన విజయ్ చిల్లా మాట్లాడుతూ, ఈ నెల 18న చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకుని వస్తున్నామని చెప్పారు. హారర్ అంశం కంటే కామెడీ అంశం ఈ చిత్రంలో ఎక్కువగా ఉంటుందని అన్నారు. నటుడు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, ఇందులో మంచి కామెడీ పాత్ర చేశానని, చిత్రంలో ఫ్యామిలీ ఎమోషన్ కూడా ఉంటుంది అన్నారు. మరో నటుడు షకలక శంకర్ మాట్లాడుతూ, ఈ చిత్రంలో నటించడం ద్వారా తెలియని ఎన్నో మంచి విషయాలు తెలుసుకున్నానని అన్నారు.



మంచు మనోజ్

శ్రీలంక యుద్ధ నేపథ్యంలో
ఒక్కడు మిగిలాడు

ఎల్‌టిటిఈ చీఫ్ ప్రభాకరన్ పాత్రలో మంచు మనోజ్ నటిస్తున్న చిత్రం ఒక్కడు మిగిలాడు. అజయ్ ఆండ్రూస్ నూతక్కి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రమిది. ఎస్.ఎన్.రెడ్డి, లక్ష్మీకాంత్‌లు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. షూటింగ్ పూర్తికావడంతో పోస్ట్ ప్రొడక్షన్ పనులు సైతం పూర్తిచేశారు. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 8న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

నిర్మాతలు మాట్లాడుతూ ఇంతవరకు భారతదేశ చలన చిత్ర చరిత్రలో చూడని సరికొత్త కథాంశాన్ని ఒక్కడు మిగిలాడు చిత్రంలో ప్రేక్షకులు వీక్షిస్తారు. మంచు మనోజ్ యాంగ్రీయంగ్ మేన్‌గా కనిపిస్తాడు. త్వరలోనే ట్రైలర్, పాటలను విడుదల చేయబోతున్నాం. 1990 నాటి శ్రీలంక యుద్ధం నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం ప్రేక్షకులను అలరిస్తుందనే నమ్మకం ఉంది. హాలీవుడ్ సాంకేతిక నిపుణులు పనిచేసిన ఈ చిత్రం సాంకేతికంగా ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది అని చెప్పారు. మంచు మనోజ్, అనీషా ఆంబ్రోస్, మిలింద్ గునాజీ, పోసాని, సుహాసిని, సూర్య, బెనర్జీ, జెన్నీఫర్ తదితరులు ముఖ్యపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం శివ నందిగామ, ఛాయాగ్రహణం వి.కోదండరామరాజు, స్క్రీన్‌ప్లే గోపీమోహన్.



ప్రపంచ చాంపియన్‌షిప్

సెమీస్‌కు చేరిన నిర్మల

లండన్ : ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో క్వార్టర్ మైలర్ నిర్మల మహిళల 400 మీటర్ల పరుగులో సెమీస్‌కు చేరుకోవడం ఒక్కటే ఇప్పటివరకు భారత్ అత్యున్నత ప్రదర్శన. మిగతా అథ్లెట్స్ అందరూ దారుణంగా విఫలమయ్యారు. టి గోపి మారథాన్‌లో 28వ స్థానంలో నిలవగా, జాతీయ రికార్డు గ్రహీత సిద్ధాంత్ 100 మీ హర్డిల్స్‌లో 13.64 సెకండ్లలో పూర్తిచేసి హీట్స్‌లోనే నిష్క్రమించాడు. హర్యానాకు చెందిన 22 ఏళ్ల నిర్మల 52.01 సెకండ్లలో లక్ష్యాన్ని పూర్తిచేసి హీట్‌లో నాలుగోస్థానంలో నిలిచి తదుపరి రౌండ్‌కు అర్హత పొందింది. మహిళల హెప్టాలిన్లో ఆసియా చాంపియన్ స్వప్నా బర్మన్ మరో ఈవెంట్ జరుగవల్సి ఉండగా 28 మంది పోటీదార్లలో ప్రస్తుతం 27వ స్థానంలో (6 ఈవెంట్లలో 4610 పాయింట్లు) ఉంది.

ఇంగ్లండ్‌ను ఆదుకున్న అలీ

- సౌతాఫ్రికాతో నాలుగో టెస్టు

లండన్ : టెయిలెండర్ మొయిన్ అలీ అజేయంగా 67 పరుగులు చేసి క్రీజులో నిలబడడంతో సౌతాఫ్రికా చేతిలో ఓటమికి చేరువైన ఇంగ్లండ్ తేరుకోగలిగింది. ఇంగ్లండ్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 153 పరుగులకే 7 వికెట్లు కోల్పోయిన దశలో అలీ ఆదుకున్నాడు. దీంతో 66 ఓవర్లు ముగిసేసరికి ఇంగ్లండ్ 224/8 పరుగులతో ఉంది.

స్కోరు : ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 362, సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్ 226 ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్ 224/8



సిరీస్ మనదే

- ఇన్నింగ్స్, 53 పరుగులతో భారత్ ఘన విజయం
- రెండు సెషన్లలోనే ముగిసిన శ్రీలంక పోరాటం
- 386కు ఆలౌట్
- కరుణరత్నే సెంచరీ
- 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' జడేజాకు ఐదు వికెట్లు

అనుకున్నదే జరిగింది.. ఓ లాంచనం ముగిసింది. కాకుంటే కాస్త ఆలస్యం అయిందంతే. లంక టాప్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్ పోరాడినా జట్టును ఇన్నింగ్స్ ఓటమి నుంచి కాపాడలేకపోయారు. కొలంబోలో జరిగిన రెండో టెస్టులో భారత్ ఇన్నింగ్స్ 53 పరుగుల తేడాతో గెలుపును సొంతం చేసుకుంది. కరుణరత్నే (141), కుశాల్ మెండిస్ (110) పోరాటం వృథా అయింది. తొలి టెస్టులోనూ విజయ కేతనం ఎగురవేసిన టీమ్‌ఇండియా మరో మ్యాచ్ మిగిలి వుండగానే సిరీస్‌ను కైవసం చేసుకుని 2-0 ఆధిక్యంలో నిలిచింది. భారత్‌కిది లంకలో తొలి ఇన్నింగ్స్ విజయం కావడం విశేషం. కాగా వరుసగా ఎనిమిదో సిరీస్ గెలుపు. ఆదివారం నాలుగోరోజు టీ విరామానికి కొద్ది నిమిషాలకు ముందు అశ్విన్.. లంక ఇన్నింగ్స్ 117వ ఓవర్లో ప్రదీప్‌ను పదో వికెట్‌గా పెవిలియన్‌కు పంపగానే భారత జట్టు సంబరాల్లో మునిగిపోయింది. స్పిన్‌కు అనుకూలించిన పిచ్‌పై జడేజా రెచ్చిపోయి 5 వికెట్లు తీశాడు. మ్యాచ్‌లో ఆల్‌రౌండ్ ప్రదర్శన చేసిన జడేజాకు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. చివరిదైన మూడో టెస్టు ఈ నెల 12న పల్లెకెలెలో ఆరంభమవుతుంది.

కొలంబో: భారత్ తొలి ఇన్నింగ్స్ స్కోరుకు 230 పరుగులు వెనుకబడిన లంక జట్టు ఉదయం ఓవర్‌నైట్ స్కోరు 209-2తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించింది. కరుణరత్నే 92 పరుగులతో, పుష్పకుమార 2 పరుగులతో క్రీజులోకి అడుగుపెట్టారు. ఈ జోడీ దాదాపు 12 ఓవర్ల పాటు పోరాడింది. పుష్పకుమార ఉదయం 45 నిమిషాల పాటు క్రీజులో నిలదొక్కుకున్నాడు.

ఆ క్యాచ్ పట్టివుంటే..: ఇన్నింగ్స్ 67వ ఓవర్లో షమి బంతిని కరుణరత్నే (141, 307 బంతుల్లో, 16 ఫోర్లు) మిడాన్ మీదుగా బౌండరీకి తరలించి టెస్టుల్లో తన 6వ శతకాన్ని సాధించాడు. రెండో ఇన్నింగ్స్‌లో కరుణరత్నేకిది నాలుగో సెంచరీ కావడం విశేషం. 90ల్లో ఉండగా కరుణరత్నే ఇచ్చిన క్యాచ్‌ను ఫార్వర్డ్‌లెగ్‌లో రాహుల్ విడిచిపెట్టకుండా ఉండివుంటే లంక పోరాటం ఇంకా ముందుగానే ముగిసివుండేది. పుష్పకుమార 58 బంతులెదుర్కొని 16 పరుగులే చేసినా సహచరుడికి తోడ్పాటునందించాడు. వీరిద్దరు మూడో వికెట్‌కు 40 పరుగులు జోడించారు.

తొలి దెబ్బ: అశ్విన్ 73వ ఓవర్లో పుష్పకుమారను క్లీన్‌బౌల్డ్ చేసి లంకను తొలి దెబ్బ తీశాడు. తర్వాత క్రీజులోకి వచ్చిన కెప్టెన్ చండిమాల్ (2) మరోసారి జట్టును నిరాశపరిచాడు. జడేజా బౌలింగ్‌లో అతను ఫస్ట్‌స్లిప్‌లో ఉన్న రహానేకు క్యాచ్ ఇచ్చి నాలుగో వికెట్‌గా వెనుదిరిగాడు. తొలి వికెట్ కోసం 23 ఓవర్ల పాటు వేచివున్న జడేజా తర్వాత వీరవిహారం చేసి మరో 4వికెట్లు తీశాడు. చండిమాల్ నిష్క్రమణ అనంతరం క్రీజులోకి వచ్చిన మాథ్యూస్ (36, 66 బంతుల్లో, 3 ఫోర్లు, 1 సిక్స్) తన అనుభవాన్ని ఉపయోగించి స్కోరును పరుగులు తీయించడానికి ప్రయత్నించాడు. కరుణరత్నే, మాథ్యూస్ జోడీ కఎదురుకొని అడపాదడపా బౌండరీలు సాధిస్తూ 5వ వికెట్‌కు 69 పరుగులు జోడించారు. లంక ఇన్నింగ్స్‌లో ఇదే రెండో అత్యధిక భాగస్వామ్యం. 96వ ఓవర్లో జడేజా మరోసారి స్పిన్ మాయాజాలం చేసి కరుణరత్నేను ఖంగుతినిపించాడు. అతనిచ్చిన క్యాచ్‌ను స్లిప్‌లోని రహానే ఎలాంటి పొరపాటుకు తావులేకుండా ఒడిసిపట్టడంతో లంక బ్యాటింగ్ పతనం ఆరంభమైపోయింది. అప్పటికి లంక స్కోరు 310-5. మరో ఐదు పరుగుల తర్వాత మాథ్యూస్ కూడా ఆరో వికెట్‌గా వెనుదిరిగాడు. కీపర్ డిక్వెల (31, 56 బంతుల్లో, 4 ఫోర్లు) కాస్త పోరాడడంతో లంక చివరి నాలుగు వికెట్లకు 71 పరుగులు జోడించగలిగింది. ఆఖరి వికెట్‌గా ప్రదీప్ (1)ను అశ్విన్ ఔట్ చేశాడు. హెరాత్ 17 పరుగులతో నాటౌట్‌గా మిగిలాడు.



"లంక తొలి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేస్తున్నప్పుడు వికెట్ స్పందించిన తీరును బట్టి వారితో ఫాలోఆన్ ఆడించాలనుకున్నాను. నిజానికి ఫాలోఆన్ ఇవ్వడం నాకు ఇష్టం ఉండదు. ఏ దేశంలోనైనా గెలవడం అలవాటుగా మార్చుకున్నాం"

-విరాట్ కోహ్లి

జడేజాపై నిషేధం.. మూడో టెస్టుకు దూరం



కోహ్లీసేనకు పెద్ద షాక్ తగిలింది. జడేజాపై ఐసీసీ ఓ మ్యాచ్ నిషేధం విధించింది. జడేజా.. కరుణరత్నే క్రీజులో ఉన్నప్పుడు అనవసరంగా అతడిపైకి బంతి విసిరాడు. ఇది ఐసీసీ క్రమశిక్షణా నియమావళిని ఉల్లంఘించడమే అవుతుందని లెవల్ -2 తప్పిదంగా నిర్ణయిస్తూ ఒక మ్యాచ్ నిషేధం విధించడమే కాకుండా మ్యాచ్ ఫీజులో 50 శాతం కోత విధించారు. దీంతో అతడు 12 నుంచి పల్లెకెల్‌లో జరిగే మూడవ టెస్టులో ఆడే అవకాశం లేదు.

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 622-9 డిక్లేర్డ్, **శ్రీలంక తొలి ఇన్నింగ్స్:** 183

శ్రీలంక రెండో ఇన్నింగ్స్: కరుణరత్నే (సి) రహానే (బి) జడేజా 141; తరంగ (బి) యాదవ్ 2; మెండిస్ (సి) సాహా (బి) పాండ్య 110; పుష్పకుమార (బి) అశ్విన్ 16; చండిమాల్ (సి) రహానే (బి) జడేజా 2; మాథ్యూస్ (సి) సాహా (బి) జడేజా 36; డిక్వెల (సి) రహానే (బి) పాండ్య 31; పెరెరా (స్టంప్డ్) సాహా (బి) జడేజా 4; డిసిల్వ (సి) రహానే (బి) జడేజా 17; హెరాత్ నాటౌట్ 17; ప్రదీప్ (సి) ధావన్ (బి) అశ్విన్ 1; ఎక్స్‌ట్రాలు 9; మొత్తం (116.5 ఓవర్లలో ఆలౌట్) 386 , **వికెట్ల పతనం:** 1-7 (తరంగ) 2-198 (మెండిస్) 3-238 (పుష్పకుమార) 4-241 చండిమాల్ 5-310 (కరుణరత్నే) 6-315 (మాథ్యూస్) 7-321 (పెరెరా) 8-343 (డిసిల్వ) 9-384 (డిక్వెల) 10-386 (ప్రదీప్), **బౌలింగ్:** యాదవ్ 13-2-39-1; అశ్విన్ 37.5-7-132-2; షమి 12-3-27-0; జడేజా 39-5-152-5; పాండ్య 15-2-31-2

"తొలి ఇన్నింగ్స్‌లో మా బ్యాటింగ్, బౌలింగ్ చెత్తగా ఉంది. ఐతేరెండో ఇన్నింగ్స్ మా ఆట తీరు ఆకట్టుకుంది. కుశాల్, కరుణరత్నే అద్భుతమైన క్రికెట్ ఆడారు. రెండోరోజు ఆట తర్వాత పిచ్‌పై బ్యాటింగ్ కష్టమని భావించాం. పరుగుల కోసం స్వీప్, రివర్స్ స్వీప్ షాట్‌లు ఎక్కువగా ఆడాలని నిర్ణయించుకున్నాం".

- చండిమాల్

ఇంకొక్కటి...

భారత జట్టుకు ఇది వరుసగా ఎనిమిదో సిరీస్ విజయం. ఆ సిరీస్ విజయాలకు నాంది పడింది 2015లో లంకలోనే కావడం విశేషం. అప్పుడూ కోహ్లీనే కెప్టెన్. టీమ్‌ఇండియా మరో సిరీస్ విజయాన్ని దక్కించుకోవగలిగితే ప్రపంచ రికార్డును సమం చేస్తుంది. ప్రస్తుతం ఆ రికార్డు ఆస్ట్రేలియా పేరిట ఉంది. ఆసీస్ 2005-2008 మధ్య వరుసగా 9 సిరీస్ విజయాల్ని సొంతం చేసుకుంది.

శ్రీలంకలో తొలిసారి ఇన్నింగ్స్ విజయాన్ని దక్కించుకున్న భారత్.. పరుగుల పరంగా గాలెలో భారీ విజయం సాధించింది. తొమ్మిది టెస్టుల్లో భారత్‌కిది మూడో ఇన్నింగ్స్ గెలుపు. లంకలో 8వ విజయం కాగా వరుసగా నాలుగవది.

బోల్ట్‌కు కాంస్యమే

- ప్రపంచ అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో గాట్లిన్ షాక్

లండన్ : తన చిరుత పరుగుతో ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న జమైకా స్టార్ ఉసేన్ బోల్ట్ అనూహ్యంగా తన వీడ్కోలు ప్రపంచ చాంపియన్‌షిప్‌లో తనకు ఇప్పటివరకు ఎదురులేకుండా కొనసాగిన 100 మీటర్లలో కేవలం కాంస్యానికే పరిమితమయ్యాడు. 100 మీటర్ల ఫైనల్‌లో బోల్ట్ లక్ష్యాన్ని 9.95 సెకండ్లలో పరిగెత్తి మూడోస్థానానికే పరిమితం కాగా, అమెరికా స్టార్ స్ప్రింటర్ జస్టిన్ గాట్లిన్ 9.92 సెకండ్లతో స్వర్ణం గెలుచుకున్నాడు. మరో 0.02 సెకండ్ల తేడాతో అమెరికాకే చెందిన క్రిస్టియన్ కోల్‌మన్ రెండోస్థానంలో నిలిచాడు. 2006-10 మధ్య డోపింగ్‌తో రెండుసార్లు నిషేధానికి గురైన 35 ఏళ్ల గాట్లిన్ అనూహ్యంగా ఈసారి బోల్ట్ కంటే 3 సెకండ్లతో నంబర్‌వన్‌గా నిలిచాడు. ఇదే గాట్లిన్‌ను 2012 ఒలింపిక్స్‌లో బోల్ట్ అధిగమించి విజయాన్ని అందుకోగలిగాడు.



బోల్ట్ ఆఖరి పరుగును వీక్షించేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చిన అభిమానులు అతడు మూడోస్థానానికే పరిమితం కావడంపట్ల తీవ్రంగా నిరాశచెందారు. తన చివరి పరుగును అత్యంత ఘనంగా బంగారు పతకంతోనే ముగిస్తాడని ఆశించిన వారంతా అతడు కేవలం మూడోస్థానానికే పరిమితం కావడం కొంత ఆవేదనకు గురయ్యారు. కేవలం బోల్ట్ పరుగును వీక్షించేందుకే ఒలింపిక్ స్టేడియంలోని 60,000 పైగా సీట్లు పూర్తిగా అమ్ముడుపోవడం గమనార్హం.

గాట్లిన్‌కు అభినందనలు : తాను కాంస్యానికే పరిమితమైనప్పటికీ, బోల్ట్ కొంత కనిపించని ఆవేదనతోనే మరోవైపు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శిస్తూ విజేతకు అభినందనలు తెలిపాడు. అలాగే అభిమానులతో ఫోటోలు దిగాడు.

ఎప్పుడో నిరూపించుకున్నా: తాను మూడోస్థానానికి పరిమితమైనప్పటికీ, ప్రపంచ అత్యుత్తమ అథ్లెట్‌గా ఎప్పుడో నిలిచానని బోల్ట్ తర్వాత వ్యాఖ్యానించాడు. నా అత్యుత్తమ ప్రదర్శనను ఇచ్చాను. కాంస్యం పతకం అందుకున్నప్పటికీ నిరుత్సాహానికి గురి కావడం లేదన్నాడు. కాకపోతే కొంత ఒత్తిడి తగ్గిన మాట వాస్తవం అన్నాడు. సరైన ఆరంభం లేకపోవడం వల్లనే ఈ రేస్‌లో వెనుకబడిపోయానన్నాడు. నా ప్రారంభమే నన్ను వెనుకబడేలా చేసిందన్నాడు.

10000 మీటర్ల మహిళల విజేత అల్మాజ్



ఒలింపిక్ చాంపియన్ అల్మాజ్ అయానా మరోసారి అద్వితీయంగా రాణించి మహిళల 10,000 మీటర్ల పరుగులో విజేతగా నిలిచింది. గత సంవత్సరం రియోలో ప్రపంచ రికార్డును సైతం బద్దలుకొట్టి బంగారు పతకం అందుకున్న 25 ఏళ్ల అల్మాజ్ 46 సెకండ్ల తేడాతో తన లెజెండరీ ప్రత్యర్థి తిరునేశ్ దిబాబాను కంగుతినిపించింది. మూడుసార్ల ఒలింపిక్ స్వర్ణ విజేత, ఐదుసార్ల ప్రపంచ చాంపియన్ అయిన దిబాబా దీంతో కేవలం రజతానికే పరిమితమైంది. కెన్యాకు చెందిన అగ్నెస్ టిరోప్ కాంస్యం అందుకుంది.

అంద్రియస్‌కు డిస్కస్ స్వర్ణం : పురుషుల డిస్కస్‌లో లూథియానకు చెందిన అంద్రియస్ గుడ్జియస్ బంగారు పతకం అందుకున్నాడు. 26 ఏళ్ల అంద్రియస్ రియో ఒలింపిక్స్‌లో 12వ స్థానానికే పరిమితం కాగా, ఈసారి తన కెరీర్‌లోనే అత్యుత్తమంగా 69.21 మీటర్ల దూరం విసిరి అగ్రస్థానంలో నిలిచాడు. స్వీడన్‌కు చెందిన డానియేల్ స్టాల్ రజతం (69.19 మీ) అమెరికా అథ్లెట్ మాసన్ పిన్‌లే 68.03 మీటర్లతో కాంస్యం సాధించాడు.

మారథాన్ చాంపియన్ కిరుయి : కెన్యాకు చెందిన జెఫరీ కిరుయి సీజన్ అత్యుత్తమ టైమింగ్ 2:08.27 సెకండ్లతో మారథాన్ విజేతగా నిలిచాడు. ఇథోపియోకు చెందిన తామిరాట్ తోలా రెండోస్థానంలో నిలువగా టాంజనియా అథ్లెట్ అల్ఫాన్స్ సింబూ కాంస్యం అందుకున్నాడు.

ఇతర ఫలితాలు : పురుషుల లాంగ్‌జంప్ - 1. మేనీ ఓంగా (దక్షిణాఫ్రికా) 8.48 మీ 2. జారియన్ లాసన్ (యుఎస్) 3.రుస్వాల్ సమాయ్ (దక్షిణాఫ్రికా)



టైటిల్ వద్దు ..శాంతి కావాలి : విజేందర్

న్యూఢిల్లీ : నేను చైనా బాక్సర్ నుంచి గెలుచుకున్న టైటిల్‌ను తిరిగి ఇచ్చేస్తాను. డొక్లామ్ సరిహద్దులో నెలకొన్న ప్రతిష్టంభన నేపథ్యంలో అక్కడ ప్రశాంత వాతావరణం నెలకొనేలా ఉండేలా చూడాల్సిందని ప్రొఫెషనల్ బాక్సర్ విజేందర్ సింగ్ కోరాడు. నేను గెలిచిన టైటిల్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాను. ఇది చైనా ప్రజలకు, అక్కడి మీడియాకు చేరుతుందనుకుంటున్నానంటూ ఓ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపాడు.

వారియర్స్ రికార్డు గెలుపు



వారియర్స్, యోధ జట్ల మధ్య పోరు

నాగపూర్: ప్రొ కబడ్డీలో ఆదివారంనాడు బెంగాల్ వారియర్స్ 20 పాయింట్ల భారీ తేడాతో యుపి యోధపై రికార్డు విజయాన్ని అందుకుంది. ప్రస్తుత కబడ్డీ సీజన్‌లో ఇంత భారీ తేడాతో గెలవడం ఇదే. ఈ గెలుపుతో వారియర్స్ పాయింట్ల పట్టికలో 10 పాయింట్లు అందుకుని రెండోస్తానంలో నిలిచింది. తమ ఫ్రంట్‌లైన్ రైడర్స్ లేకపోవడడంతో యోధ దారుణంగా ఓటమిపాలు కావాల్సి వచ్చింది. ఇదే అదనుగా వారియర్స్ ప్రత్యర్థిపై పూర్తి ఆధిక్యం ప్రదర్శించి 40-20 తో విజయాన్ని అందుకుంది. యోధ ప్రధాన రైడర్ నితిన్ తోమర్ గాయంతో మధ్యలో తప్పుకోవాల్సి రాగా, రిషాంక్ ఆడలేదు. ఇదిలా ఉంటే వారియర్స్ డిఫెన్స్ బ్రహ్మాండంగా కొనసాగింది. జీవ్‌కుమార్, దక్షిణకొరియాకు చెందిన జంగ్ కన్‌లీ, మణీందర్‌లు రాణించారు. అలాగే వారియర్స్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకుంది. ప్రథమార్థం ముగిసేసరికి వారియర్స్ 22-8 తేడాతో పైచేయిలో ఉంది. మొత్తంమీద వారియర్స్‌కు వినోద్‌కుమార్ అత్యధికంగా 8 పాయింట్లు అందించగా, కన్ లీ 7 పాయింట్లు సాధించిపెట్టి గెలుపులో కీలక పాత్ర పోషించాడు. బెంగాల్ మొత్తం 22 రెయిడ్ పాయింట్లు సాధించగా, 9 టాకిల్ పాయింట్లు 6 ఆలౌట్ పాయింట్లు సాధించింది. అదే యోధకు కేవలం 13 రైడ్ పాయింట్లే లభించగా 4 టాకిల్ పాయింట్లు లభించాయి.

పాట్నా పిరేట్స్ గెలుపు

రెండో మ్యాచ్‌లో పిరేట్స్ 6 పాయింట్ల తేడాతో బెంగళూరు బుల్స్‌ను ఓడించింది. పోటాపోటీగా సాగిన పోరులో పిరేట్స్ చివరకు 42-36 తో విజయాన్ని అందుకుంది. పిరేట్స్ టాప్ రైడర్ ప్రదీప్ నర్వాల్ 15 పాయింట్లు సాధించి పెట్టగా,వినోద్‌కుమార్ 4 పాయింట్లు సాధించాడు. అదే బెంగళూరు జట్టులో రోహిత్ కుమార్ మాత్రమే అత్యధికంగా 8 పాయింట్లు అందించాడు. ప్రథమార్థం ముగిసేసరికి బెంగళూరు 11-23 తేడాతో బాగా వెనుకబడి ఉంది.

ఫైనల్‌లో మొహిత్, రావత్

- ఆసియా జూనియర్ చాంపియన్‌షిప్
- ఆరుగురు బాక్సర్లకు కాంస్యాలు

న్యూఢిల్లీ : ఫిలిప్పీన్స్‌లో జరుగుతున్న ఆసియా జూనియర్ చాంపియన్‌షిప్‌లో ఇద్దరు భారతీయ బాక్సర్లు..మొహిత్ ఖాటానా (80కిలో), సతేందర్ రావత్ (80 పైగా కిలోలు) ఫైనల్‌లోకి అడుగుబెట్టగా, మరో ఆరుగురు బాక్సర్లు సెమీస్‌లో ఓడి కాంస్యాలతో సరిపెట్టుకున్నారు. సెమీస్‌లో ఖాటానా 4-1 తో ఉజ్బెకిస్తాన్‌కు చెందిన కామ్రాన్‌బెక్‌ను ఓడించగా, మరోదానిలో రావత్ కజఖస్తాన్‌కు చెందిన అక్‌మెత్సజాహోన్వ్‌పై గెలిచాడు.

ఇదిలా ఉంటే కాంస్యాలు అందుకున్న వారిలో అంకిత్ నర్వాల్ (57 కిలో), బావేశ్ కట్టిమణి (52 కిలోల), సిద్ధార్ద్ మాలిక్ (48 కిలో), వినిత్ దాహియా (75 కిలో, అక్షయ్ సివాచ్ (60 కిలో), అమన్ షెరావాత్ (70 కిలో) ఉన్నారు.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.